
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
శిరోజాలంకరణ
28-12-60
25 నయాపైసలు

ఆంధ్రసచిత్ర వారపత్రిక

ఉత్తరాలు

తెలుగు వెలుగులు

14-12-60 తేది పత్రికలో ప్రచురించబడిన తెలుగు వెలుగులు 68 వ శీర్షికలోని షాలివ త్రి పిచ్చుకారిగారి సంగ్రహ చరిత్ర మిక్కిలి ప్రశంసనీయమైనది.

"సన్నాయి నొక్కులతో చక్కలిగింతలు పెడుతున్న నాదస్వర సుధాలహరి షాలివ త్రి పిచ్చుకారి" ఈ వాక్యం అక్షరాలా నిజం!

చిట్టా బాలకృష్ణశాస్త్రి (మచిలీపట్నం)

* * *

శ్రీ షాలివ త్రి పిచ్చుకారిగారిని గురించి చక్కగా వ్రాసినారు. చివరలో 'యెల్లకన్న హృదయాలను రాగరంజిత మొనర్చి ధీర పుంస్త్వశోభాయమానాలు ప్రసాదించగల స్వభావ సరస్వతి శ్రీ పిచ్చుకారి' అన్న వాక్యము అక్షరాలా నిజము. రచయిత అన్నట్లు 'నాద తనువు' ఆయనకు చక్కని బిరుదు. రచయితకు నా ధన్యవాదాలు—

యార్లగడ్డ సీతారామయ్య (కొమమూరు)

* * *

'నాదతనువు అన్న పేరు ఆయనకెంతయినా తగును' అనటంలాగానే వుంది. ఎవరూ కాదనలేరు. ఎంతోకాలం క్రితం శ్రీ పిచ్చుకారిని గూర్చి వ్రాయాల్సిందివారు. ప్రసిద్ధ కవులు శ్రీ ఈమని శంకరశాస్త్రిగార్ని గూర్చి వ్రాసినప్పుడే శ్రీ పిచ్చుకారినిగూర్చి వ్రాస్తే బాగుండేది.

తలమలశెట్టి పాండురంగారావు

(చిలకలపూడి)

* * *

నాదబ్రహ్మ శ్రీ షాలివ త్రి పిచ్చుకారి గారిని, తెలుగు వెలుగులు, శీర్షికద్వారా ఆంధ్రలోకానికి, పరిచయం చేయడం చాలా ముదావహం "మలయానిలంలో చల్లదనం, పున్నాగతావిలో తీయదనం, చందన చర్చలో హాయి, ప్రత్యూషంలో ఉల్లాసం, ప్రియామ్రుడుల గాత్ర పరిష్వంగంలో, మధురానుభూతి, కలిపి కొలబోసే సన్నాయి నొక్కులతో చక్కలిగింతలు పెడుతున్న నాదస్వరసుధాలహరి శ్రీ పిచ్చుహరి" అని బహు యథార్థంగా నుడివారు. ఇప్పటికైనా ప్రభుత్వము ఈ కళాఖనిని గుర్తించి ఆదరించి, తిరుపతినాదస్వరకళాశాల ప్రిన్సిపాల్ గా నియమించినందుకు సంతోషం.

కె. లక్ష్మీశేఖరరావు (మంతెన)

ముఖచిత్రం

14-12-60 మీ (మా) వారపత్రిక ముఖచిత్రం చాలాబాగుంది, అందంగా ఉంది. కాని ఏమిలాభం! చిత్రకారుడు శ్రీ. ధర్మారావు చిత్రం అంతా బాగానే వేశారు. కాని ముస్తాబు చేసుకుంటున్న అమ్మాయి అందం అద్దంలో చిత్రీకరించకపోవటము చాలాపొరపాటుగా ఉంది.

కొత్తమాసు పాండురంగారావు (చెరుకుపల్లి)

* * *

14-12-60 పత్రికలో ముఖచిత్రం ముస్తాబు చూడముచ్చటగానే ఉంది. కాని, వెనకున్న దీపపుసమ్మె ముందుంటే మరీ ముద్దుగా ఉండేది! పురాతన సంస్కృతికి చెందిన ముగువ సంధ్యాజ్యోతి వెలిగించిన తర్వాత కేశసంస్కారం చేయుటలో, హిందూ సాంప్రదాయ హద్దులు మితిమీరిందేమో?

రాజాన్ పాపారావ్ (బిలాయి)

* * *

"ముస్తాబు, చాలా ఆకర్షణీయముగానున్నది. సినిమాతారల చిత్రాలతో విసుగెత్తకుండా అప్పుడప్పుడు ఇలాంటి చిత్రాలు ప్రచురించడం ఎంతో శ్లాఘనీయం. కాని తమ పత్రికద్వారా చిత్రలేఖనంపోటి ఏర్పరచి పోటిలో గెలిచిన చిత్రములను ముఖపత్రంపై ప్రచురించిన ఎంతోబాగుండునని మనవి. 'ముస్తాబు" చిత్రాన్ని రచించిన శ్రీధర్మారావుగార్కి నా అభినందనములు.

శెట్టి వెంకటప్ప (అనంతపురం)

* * *

కార్టూనులు

14-12-60 తేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో శ్రీ డి. వి. నందకుమార్ గారి కార్టూన్ చిత్రం "చదరంగం" చాలా బాగున్నది. ఆ చిత్రం చూస్తుంటే మాకు ఇప్పటికీ నవ్వు వస్తూవుంటుంది. పత్రికద్వారా వారికి మా అభినందనలు.

ఎ. లోలాక్షి (విస్సన్నపేట)

* * *

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణగారు వారం వారం వ్రాస్తూ ఉండే న్యూఢిల్లీలేఖ మీ పత్రికకు శోభను తెస్తూఉండే విశేషాలలో ఒకటి. అది కాంగ్రెస్ ప్రభుత్వం అవకతవకలనూ, కమ్యూనిస్టుల దేశవ్యతిరేక పద్ధతులనూ సునిశితంగా విమర్శిస్తూ, నాలాంటి అనేకపాఠకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని యిస్తోంది.

శ్రీకృష్ణగారిపైన వచ్చేవిమర్శలు దాదాపు అన్నీ కమ్యూనిస్టులు లేక కమ్యూనిస్టు సానుభూతిపరులనుంచేనని వాటిని చదివేవారికి తెలుస్తుంది. దేశంలో అతిచిన్న వర్గమైన ఈ స్వార్థపరులఆందోళనకులొంగి మీరు శ్రీకృష్ణగారి లేఖను మాన్పటంగాని, వారు వ్రాసే [illegible] టంగాని చెయ్యబోరని ఆశిస్తున్నాను.

రామకృష్ణ (ఏలూరు)

* * *

కథలు

మనుషులూ — మనసులూ — కథ చదువుతున్నంతసేపూ ఎదురుగా కూర్చొని సినిమా చూస్తున్నట్లుంది. కాని కథను యింత తొందరగా ముగిస్తారనుకోలేదు.

వంకాల విశ్వనాథం (విశాఖపట్నం)

* * *

మీ పత్రికలో (ఆంధ్ర సచిత్ర వారపత్రిక) ప్రచురించిన "మనషులు మనసులూ" అనే కథ చాలా బాగుంది.

త్రికూటం వెంకటరమణ శర్మ (హుబ్లీ)

* * *

7-12-60 పత్రికలోని "ఆశాజీవి" కథ చాలా బాగుంది. రచన సహజముగానున్నది. కాని కథలోని భావాలు చాల బాగున్నాయి. ఈ రోజులలో కథలోని పాత్ర కమలలాంటి సహనవంతులుండరని నా అభిప్రాయం.

ఉడతా మార్కండేయులు (మంగళగిరి)

* * *

7-12-60 ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురించిన "ఫలించని ప్రణాళిక"లో కోడలికి తమ్ముడు పుట్టినందువల్ల ఆస్తిరాదని అత్తగారు కోడలితో లేనిపోని గొడవలు పెట్టుకోవడంవంటి సంఘటన నేను కళ్ళారా చూశాను. అత్తగారేకాదు. భర్తగారుకూడ!

నేటి పరిస్థితుల కనువుగా రచించిన రచయిత వేణుగోపాల్ రెడ్డి అభినందనీయుడు.

ఆర్. కె. రాజా (పిగిలాం)

* * *

14-12-60 వార పత్రికలో ఆశాకారి రాధ హృదయాక్రందన చదువరుల జాలి చూరగొనేట్టుంది.

"ముఖ్యంగా రాధ తను దుఃఖములో ఉండి" తన అనాకారితనాన్ని భరించేపాటి సంస్కారంగూడా యీ విద్యావంతుల్లో లేదా?"

"ఇతర మనసులు బాధించి ఆనందించే అ రాక్షసాత్ముల మనుషులలో లెక్క చేయడం పొరబాటు" అనేరెండువాక్యాలు చదువరుల గుండెల్లో గుచ్చుకోక తప్పదు.

సి. ఎం. దేవయ్య (వనపర్తి)

* * *

14-12-60 పత్రికలోని "రాధ" చదువుతూంటే, "హృదయమున్న ప్రతిఒక్కరూ 2 కన్నీటిచుక్కలు విడువకమానరు! అనిపిస్తున్నది!

ఎంత తెలివితేటలున్నా, చూచేటందుకు కొంచం అనాకారిగావుండి విలపించే, యీనాటి కన్యలబాధలను, చాలా విపులంగా వివరించిన "శ్రీ వాచస్పతి" గారికి నా ధన్యవాదాలు.

"[illegible]" ([illegible])

* * *

14-12-60 తేదీన ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించిన కథ "కొంగలో కొర" అనేకథ చాలాబాగుంది. బాలలకు ప్రత్యేకముగా "బాలసాహితి"ని పెట్టి వారమునకు ఒకకథమాత్రము వేయుచున్నారు. ఇది చాలా సహించరానిది. కనీసము బాలల కొరకైన ఒక సీరియల్ వేయ ప్రార్థన.

డి. బదరీనారాయణరావు (రాయచోటి)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 17

28-12-60
బుధవారం

శార్వరి పౌష్య శుద్ధ ఏకాదశి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

అంజలి పిక్చర్స్‌వారి 'రుణానుబంధం'లో అంజలీదేవి.

క థ కా ని క థ

కథకాని కథల పోటీకి రచనలు పంపేవారు కొంతమంది తమ రచనలు కేవలం చిన్న చీటీముక్కలమీద వ్రాసి పంక్తిలో పంక్తిని ఇరికిస్తున్నారు. ఇలాంటివి పరిశీలించటం కష్టం కాబట్టి రచనలు పంపేవారు రచనకుతగ్గసైజు కాగితంమీద పంక్తికి పంక్తికి మధ్య బాగా ఖాళీవదలుతూ వ్రాయాలని కోరుతున్నాము. కాగితాలకు ఒకవైపునే వ్రాయడం కూడా అవసరం.

—సంపాదకుడు

వనితలకు వినతి

'వనితాలోకం' శీర్షికకు రచనలు పంపగోరేవారు కవరుపైన స్పష్టంగా 'వనితాలోకం శీర్షికకు' అని వ్రాయాలి. లేకపోతే అసంఖ్యాకంగా వచ్చే రచనలలో వనితల వ్యాసాలు వింగడించడం కష్టసాధ్యం.

వనితలు పంపే వ్యాసాలు తగు మాత్రపు పరిమితికి — అంటే అచ్చులో రెండు పేజీలకు మించకుండా ఉండాలి.


వ్రాసే రచనగానీ, చేసే సూచనగాని సమకాలీన సాంఘిక పరిస్థితులకు సంబంధించేదిగా ఉండాలి ప్రయోజనాత్మకమైన వ్యాసాలకు ప్రాధాన్యంలభిస్తుంది.

కాగితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిన రచనలే అంగీకారపాత్రంకాగలవు. డిజైనులు, పంపే వారు అవి పావుతావు సైజు డ్రాయింగు పేపరుమీద ఇండియన్ ఇంకుతో వ్రాసి పంపవలెను. రచయిత్రుల చిరునామా లేని ఏ రచన ప్రచురణార్హంకాదు.

గ మ ని క

కార్టూన్ పోటీలో పాల్గొనగోరేవారు తగుమాత్రపు సైజు కాగితంపై ఇండియన్ ఇంకుతో కార్టూన్ వ్రాసి పంపాలి. క్రింద చిరునామా స్పష్టంగా వ్రాయాలి. చాలీచాలని కాగితాలపై పెన్సిల్ తోను, కలంతోను వ్రాసే బొమ్మలు పోటీకి స్వీకరించడం లేదు.

—సంపాదకుడు.



సిగ్గు సిగ్గు
కంపెనీల
పాపపుడబ్బు
తింటున్నారు
స్వతంత్ర పార్టీ
అనుమాన ధనం
విదేశీ ధనం
ఎలావుంది మిత్రమా? పూలపానుపు కాదుకదా?
సంపూర్ణానంద్
సి.బి.గుప్త
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిత్వం
కావలెను
ఆంధ్రమంత్రివర్గం విస్తరణ త్వరలో జరుగుతుంది. దరఖాస్తులు కోరబడుచున్నవి
దరఖాస్తుదారుల బారు
OOMMEN



తెలుగు వెలుగులు 65

"మీకు బాగా వచ్చిన మాటలో బెస్ట్ జోక్ ఏమిటి?", అని ఒక మిత్రుడు అడిగితే, ఏముంది, "లైఫ్, అనగా జీవితం" అన్నాడు రేలంగి వెంకటరామయ్య.

రాళ్లూ రప్పలూ తిని హరాయించుకోగల రోజుల మరమరాలుకూడా దొరకవు; తీరా వజ్రాలూ వైడూర్యాలూ పోగేసుకొన్నాక మరమరాలుకూడా అరగవు ... రేలంగి, వెంకటరామయ్య తెరమీదా జీవితంమీదా షికారు చేస్తున్నపుడు తరుచు ఈ మాట చెప్పుకుని పగలబడి నవ్వుకుంటూ ఉంటారు. దొరక్క వీడూ, అరక్క వాడూ అనుకొంటూ ఉంటారు.

నవ్వడం, నవ్వించడం, నవ్వుకోవడం రేలంగికి ఈనాటి విద్య కాదు; కాకినాడ యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్‌లో చేరిన "అన్ హ్యాపీ మెంబర్ల"తో కలిసి తిరిగిన నాడు కూడా నవ్వడం నవ్వించడమే రేలంగి ఉద్యోగం. సినిమాపేటలలో వేషాలవేట సాగించినపుడు, హేళనమాటలు పడినపుడు, జార్జిటవున్‌లో ఉల్ఫాగా సినిమాచూసి నిశిరాత్రివేళ, ఆరు మైళ్ళదూరాన ఉన్న ఆళ్వారుపేటకి రాజబాట కొలుస్తూ వచ్చి బార్లిగంజితాగి కళ్లు మూసుకు పడుకున్నపుడు, ఉచ్ఛస్థితికి వెళ్ళి జారిపడినపుడు, తనని చూసీ, తనని చూసి నవ్వినవాళ్లని చూసీ కూడా నవ్వుతూనే వచ్చాడు. నవ్వుకుంటూనే వచ్చాడు. అతను కష్టాలుపడ్డా దుఃఖం ఎరగడు. భోజనంలేక కోమకస్తే నిద్రనటించి జీవితంతోనే పరవమాడి దాన్ని నవ్వించాడు. మెప్పించాడు. లొంగదీసుకు సవారీ చేస్తున్నాడు. ఈ విధంగా, ఎంతసేపూ తన కష్టాలు తలుచుకు కుమిలిపోయి తనమీద తనే జాలిపడుతూ కూర్చున్నవాడు కాదు కాబట్టి తనచుట్టూ ఉన్నవాళ్ల కష్టసుఖాలు చూడగలిగాడు. ఇలా, హాలాహలంలోంచి అమృతంలా, కష్టాలను, బాధలను చిలికి-చిలికి తీసినది అతని నవ్వు; అతని హాస్యం. సినిమాలో అతను పలికే మాటలు కొన్ని చిలిపిమాటలు అయినా అతని నోట వచ్చినపుడు నిండుగా ఉండడానికి ఒక కారణం ఇదే.

పాత "చింతామణి" చిత్రంనుంచి నేటి వరకూ నూటికి పైబడ్డ చిత్రాలలో నటించినా హాస్యంమటుకు పాత చింతకాయ పచ్చడిలా తయారవకుండా ఉండడానికి అతను చేసినకృషి అపారం. సినిమాలో వేషానికి సాధారణంగా రచయితా దర్శకుడూ రూపకల్పన చేయడం నిజమే అయినా, రేలంగి అందులో జీవం పూరించి ఏదో కొత్తదనం తేవడానికి, సమకాలిక జీవితానికి దగ్గర కావడానికి కృషిచేస్తూవచ్చాడు. కొత్తలో చేసిన ఆ కృషివల్లనే పాత్రలబదులు రేలంగే ప్రజాదరణ పొందాడు. 'రేలంగి ఉంటే చాలండీ' అనే జనం పెరిగారు. చివరకి, రేలంగి తత్వాన్ని బట్టి, జీవితంపట్ల ఆయన దృక్పథాన్ని బట్టి, ఆయనధరించే పాత్రలకు రూపకల్పన చేయడం వేషభాషలు నిర్ణయించడం జరిగింది. సినిమా ఏదైనాసరే- కథ ఏదైనాసరే రేలంగి హాస్యానికి ఒక వ్యవస్థ అనిపించుకున్నాడు. తెలుగుసినిమాలో ఒకశకం నెలకొల్పాడు. నిజంగా ఒక నటుడుగా వ్యక్తిగా ఆయన ఘనతకు ఇది జోహారు చేయడమే కావచ్చుకాని, సినీవిపణివీధిలో ఇది బాక్సాఫీసు సూత్రమైపోయింది. దుమ్ముకొట్టింది క్రమంగా రేలంగిపేరునే తప్ప ప్రజ్ఞని వాడుకోడంమర్చిపోతున్నారు సినీపారిశ్రామికులు. రేలంగి కూడా కొంత పరాకు, చిత్తగించడం కొంత మొహమాటాలకు లొంగడం జరిగిందని ఆయన విమర్శకులు అంటారు. ఇలాటివి మిశ్రమపరిశ్రమలో తప్పవు. అయితే ఇలాటివి వచ్చినా రేలంగి ఓడిపోడు.

పదేళ్ళనాడు పైకివస్తున్న రేలంగిని కిందకి కొట్టింది అదృష్టం; రెట్టించిన జవసత్వాలతో బంతిలా పైకి ఎగిరాడు తను. అదీ అతని తరహా.

తెరమీద రేలంగి ఎంత సందడయినవాడో జీవితంమీద వెంకటరామయ్యగారూ అంత సందడయిన మనిషి. సినిమాలో పాత్రలు మన సొమ్మేం పోయిందన్నట్టు దయాదాక్షిణ్యాలు వెదజల్లితే, జీవితంలో రేలంగి అంతకన్న దర్జాగా ఉదారంగా ధారాళంగా మంచి పనులు చేస్తాడు. కష్టాలను, కష్టాలలో ఆదుకున్న మిత్రులను మరచిపోలేదు. తిరుపతి విశ్వవిద్యాలయానికిచ్చిన విరాళం ఒకటేనికాక, గుప్తదానాలు ఎన్నో చేశాడు. పెళ్ళిళ్లు చేయించి ఇళ్ళు నిలబెట్టడం అతని సరదా. ఎప్పుడూ దిగులు తన జోలికిరాకుండా చుట్టూరా పది మందిని కూర్చోబెట్టుకుని కబుర్లాడుతూ తిని తిరగడం సరదా. తన యింట్లో రోజూ పాతిక ముప్ఫై విస్తళ్లు లేవగా చూడడం సరదా. నిత్యకల్యాణం పచ్చతోరణం అన్నట్టుగా జీవించడం— సందడిగా జీవించడం సరదా. ★



జూల్స్ వెర్న్ నవల

80 రోజులలో భూప్రదక్షిణం

(గతవారం తరువాయి)

ఎనిమిదీ నలభైఅయిదుకి ప్రపంచ పర్యటన పెట్టుకున్నందువల్ల ఫిలియాఫాగ్ ఆ రోజు ఏడూ ఇరవై వరకే పేకాట ఆడాడు. అప్పటికి సరిగ్గా ఇరవై గినీలు సంపాదించాడు. లేచి, మిత్రుల దగ్గిర సెలవుతీసుకుని క్లబ్ నుండి బయల్దేరాడు. ఎనిమిదికి పదినిముషా లుందనగా ఇల్లుచేరి తలుపు తెరచి లోపల కాలు పెట్టాడు.

యజమాని చాలా కరెక్టయిన మనిషని తెలిసి భక్తి ప్రపత్తులతో ఆయన దైనందిన కార్యక్రమం అంతా కంఠతా చేసి వంట పట్టించుకున్న భృత్యుడు పాస్పార్తూ, నిర్ఘాంతపోయాడు-అంత కరెక్టయిన మనిషి ఇలా వేళకాని వేళ అకస్మాత్తుగా వచ్చి పడడంచూసి. తనకిచ్చిన కార్యక్రమం ప్రకారం, ఫిలియాస్ ఫాగ్ అర్థరాత్రి పన్నెండూ కొట్టకుండా కొంపలో అడుగు పెట్టడానికి ఎంతమాత్రం వీలులేదు. అది అపరాధం.

ఫాగ్ తిన్నగా పడకగదిలోకి వెళ్లాడు. వెళ్లి కూర్చుని "పాస్పార్తూ!" అని పిలిచాడు.

పాస్పార్తూ ఎగిరి గంతేసి పరుగెత్తలేదు. వస్తున్నానని పలకను కూడా పలకలేదు. పలకవలసిన అవసరమూ లేదు. ఇది ఆయన పిలిచే వేళాకాదు, తను పలికే వేళాకాదు.

"పాస్పార్తూ" అని మళ్లీ పిలిచాడు ఫాగ్ నెమ్మదిగానే.

పాస్పార్తూ లేచి, యజమాని ఎదుటకు వెళ్లాడు.

"ఇది రెండోసారి పిలవడం" అన్నాడు ఫాగ్.

"అర్థరాత్రి కాలేదు గదండీ" అన్నాడు పాస్పార్తూ వాచితీసి చేతబట్టుకుని.

"తెలుసు. అందికే తప్పించలేదు...ఇంకో పదినిముషాలలో మనం బయల్దేరి డోవర్ వెళ్లి అక్కణ్ణించి కలేకి వెళ్తున్నాం" అన్నాడు ఫాగ్ ముక్తసరిగా.

పాస్పార్తూ మొహంలో వెర్రినవ్వులాటి దొకటి వెలిగి ఆరిపోయింది. జడికళ పడింది. ఫాగ్ మాట అతనికి పూర్తిగా ఆకళింపు కాలేదు.

అనువాదం :

ఎస్. పార్థసారథి

"అయ్యగారు ఊరెళ్లా లనుకుంటున్నారా?" అన్నాడు ఒకక్షణం ఆలోచించి-నెమ్మదిగా.

"అవును; మనం ప్రపంచయాత్ర చేయబోతున్నాం" అన్నాడు ఫాగ్.

ఇంత టూకీగా వినబడ్డ అంత పెద్ద వార్తతో పాస్పార్తూకి తల తిరిగినట్టయిపోయింది. కళ్లు విప్పారిపోయాయి. కనుబొమలు ఎక్కుపెట్టిన బాణాల్లా వంపుదేరి పైకి లేచాయి. చేతులు బారజాచుకున్నాయి. ఒళ్ళు వశం తప్పిపోయింది. మొత్తం మీద, పిడుగుపాటులాటి మాట విని నిల్చున్నపళంగా కొయ్యబారిపోయిన వాడి లక్షణాలు సకలం అబ్బేయి.

"ప్రపంచ పర్యటన...భూ ప్రదక్షిణం" అని గొణుక్కున్నాడు నమ్మలేక.

"ఎనభై రోజులలో" అని వివరించాడు ఫాగ్. "ఇంక మనం ఒక్క క్షణంకూడా పాడుచేసుకుందికి వీల్లేదు" అన్నాడు.

"మరి పెట్టెలు సర్దవద్దూ?" అన్నాడు పాస్పార్తూ - కోలుకోకుండానే అడ్డంగా తల తాటిస్తూ.

"పెట్టెలక్కరలేదు. ఒక సంచి చాలు. రెండు వులెన్ చొక్కాలు, మూడు జతల స్టాకింగులు పెట్టు. అలాటివే నీకో పెట్టు. మెడకి చుట్టుకుందికి మాకిన్‌టోష్, ప్రయాణాల్లో వేసుకునే ఓవర్‌కోట్ వగైరా. దిటమైన జోళ్లు కూడా పట్టుకో. మనం నడిచేది బహు తక్కువే అనుకో. అసలు నడవనక్కరలేదేమో కూడా. వెళ్ళు."

పురమాయింపులన్నీ విన్నాక, పాస్పార్తూ తన అభిప్రాయం కొంచెం చెబుదామనుకున్నాడు. కాని కుదరలేదు. కీలుబొమ్మలా ఆ గదినుంచి తన గది చేరుకున్నాడు. కుర్చీలో కూలబడిపోయాడు- "దేవుడా! నీడపట్టున కుదురుగా పడుందామనుకున్నందుకు నాకింత చేశావా" అనుకుంటూ ఫ్రెంచి భాషలో ఉసూరుమన్నాడు.

నిట్టూర్పుల పని కాగానే, ఉత్తరక్షణంలో లేచి మరమనిషిలా సమానుసర్దడం ఆరంభించాడు. మధ్యాహ్నమే తన యజమాని తీరు చూసి మరమనిషి అనుకున్నాడు. చాదస్తుడనుకున్నాడు. ఇపుడు పిచ్చివాడని కూడా అనిపిస్తోంది. ఎనభైరోజులలో ప్రపంచమంతా తిరిగిరావటమేమిటి - పిచ్చితనం కాపోతే... కాదేమో.... పరాచికమేమో...

ఓవర్ వెళ్తాయన్నాడు. బావుంది. తరవాత కాలే అన్నాడు. పోనీ అలాగే కానీ. ఫేమైన పని. తన దేశం వదిలి ఐదేదో దాటుతూంది. ఈ వంకన మళ్లీ ఓసారి చూసినట్టుంటుంది. అక్కణ్ణించి కావాలంటే పారిస్ వెళ్ళొచ్చు. మహానగరం... చూస్తే ప్రాణం లేచొస్తుంది. బ్రహ్మాండంగా వుంటుంది. ఎలాటివాడైనా అక్కడితో ఆగుతాడు. తన యజమానిలాటి జాగ్రతపరుడు ఖచ్చితంగా ఆగిపోతాడు. అంతే. భూగోళం తిరిగే మనిషి కాడు. కాని ఏమో ఎవడు చూడొచ్చాడు. ఎన్నేళ్ళబట్టో ఎన్నడూ ఇల్లు కదలని గూటి చిలక ఇన్నాళ్లకి హటాత్తుగా కదిలింది. మరి...

మొత్తంమీద ఎనిమిదోగంట కొట్టేసరికి, సంచి సర్ది సిద్ధంచేశాడు పాస్పార్టూ. సంచి సర్దినా ఆలోచనలు సర్దుకోలేదు. ప్రయాణానికి శాల్తీ సిద్ధమైనా మనసింకా సిద్ధం కాలేదు. అంతా అయోమయంగా ఉంది... సంచి పట్టుకుని ఇవతలకువచ్చి, జాగ్రత్తగా తలుపుమూసి గడియవేసి, ఫాగ్ దగ్గరకు వెళ్లాడు.

ఫాగ్ సర్వసన్నద్ధుడై ఉన్నాడు. చేతిలో బ్రాడ్‌షా గైడ్ ఉంది. యూరప్‌లో రైళ్ళు, ఆయా రేవులనించి ఓడలూ ఏవి ఎప్పుడు ఎక్కడికి వెళ్లేది అంతా సమగ్రంగా ఉంటుంది అందులో. అదే అతని యాత్రకు మార్గదర్శి.

పాస్పార్టూ రాగానే అతని చేతిలో సంచి అందుకున్నాడు ఫాగ్. అది తెరిచి అందులో బాగా దిట్టంగా ఉన్న కరెన్సీనోట్ల కట్ట పడేశాడు. ఆ నోట్లు అన్ని దేశాలలోనూ చెలామణీ అయ్యేవి.

"ఏమీ మర్చిపోలేదుగదా?" అన్నాడు.

"లేదండి"

"మాకింటూష్, ఓవర్ క్లోక్ పట్టుకున్నావా?"

"ఇవిగో"

"గుడ్. ఇంద సంచి... బహు జాగ్రత్తగా ఉంచు. ఇందులో ఇరవై వేల పౌండ్లున్నాయి" అన్నాడు ఫాగ్ సంచి అందించి.

పాస్పార్టూకి శోష వచ్చినంత పని అయింది. సంచిలో 20 వేల పౌండ్ల నోట్లూ హటాత్తుగా బంగారంగా మారిపోయి బరువైనట్టనిపించింది. చేతులుపట్లు సడలిపోయాయి. సంచికింద పడబోయినంత పని చేసి మానేసింది.

ఈ తరక్షణంలో యజమాని, అతని వెంట బంటూ కదిలారు. మేడదిగి, వీధి తలుపుకి లోపలా, బయటా తాళాలు వేశారు. వీధి మొగన బగ్గీల స్టాండు ఉంది. అక్కడిదాకా నడిచివెళ్లి బగ్గీ చేసుకుని ఎనిమిదీ ఇరవై కల్లా చెరింగ్ క్రాస్ స్టేషన్ చేరుకున్నారు. బగ్గీ ఆగగానే పాస్పార్టూ ఇవతలికి దుమికాడు. ఫాగ్ నెమ్మదిగాదిగి బండివాడికి కిరాయి ఇచ్చాడు. అంతలో పిల్లని భుజానవేసుకుని పరిదీనవదనంతో ఒక తల్లి వచ్చి చెయ్యిజాచింది. ఆమె చింకి పాతలు కప్పుకుంది. కాళ్లకి జోళ్లులేవు. బురదకొట్టి ఉన్నాయి. నెత్తిన మంచు పడకుండా వేసుకున్న గుడ్డకూడా చివికి చిరిగివుంది.

గంట క్రితం పేకాటలో గెలిచిన ఇరవై గినీలూ తీసి ఫాగ్ ఆమెచేతిలో పెట్టాడు. "ఇందమ్మా తీసుకో. వేళకి కనబడి అడిగావు. సంతోషం" అని ముందుకు సాగాడు.

ఈ సన్నివేశం చూడగానే పాస్పార్టూ ఒళ్లు పులకరించినట్టయింది. కళ్లు చెమ్మగిల్లాయి. యజమానిమీద అతనికి ఎనలేని గౌరవం అపేక్ష కలిగాయి, ఒక్కమారుగా.



డిటెక్టివ్ ఫిక్స్

అతని హృదయంలో గాఢమయిన ముద్ర పడింది.

ఫాగ్ వెంటనే స్టేషను హాలులోకి వచ్చాడు. పారిస్‌కు మొదటి తరగతి టిక్కట్లు రెండు కొనమని చెప్పాడు. వెనక్కి తిరిగేసరికి క్లబ్బు మిత్రులు అయిదుగురూ ప్రత్యక్షమయ్యారు.

"వెళ్ళొస్తాను. నా పాస్‌పోర్ట్ మీద ప్రతి రేవులోనూ వీసాముద్రలు వేయించుకువస్తాను. నేను అన్ని దేశాలూ వెళ్లినట్టుగా అవే దాఖలా. అందుకే ఇది పట్టికెళ్తున్నాను" అన్నాడు.

"అబ్బెబ్బే! ఎంతమాట అలాంటి వేమీ అక్కర్లేదు. మీరు పెద్దమనుషులు. మీ మాట చాలు" అన్నాడు గాతియర్ రాల్ఫ్.

"ఇదికూడా ఉంటే ఎందుకైనా మంచిది.

"మీరు తిరిగి ఇక్కడికి రావలసిన తేదీ—" అన్నాడు ఆండ్రూ స్టూవర్ట్ మృదువుగా.

"ఎనభై రోజుల్లో—అంటే 1872 డిసెంబరు 21, శనివారం రాత్రి సరిగా పావు తక్కువ తొమ్మిది గంటలకి — సెలవు. వెళ్ళొస్తాను."

ఎనిమిదీనలభై అయేసరికి ఫిలియాస్ ఫాగ్, నౌకరును వెంటబెట్టుకుని రైలు ఎక్కాడు. ఇద్దరు ఒకే పెట్టెలో కూర్చున్నారు. ఐదు నిముషాల తరువాత గార్డు ఈలవేశాడు. రైలు కదిలింది.

బయట చీకటిదట్టంగా ఉంది. సన్నగా వానకురుస్తోంది. ఫిలియాస్ ఫాగ్ తన సీటులో వెనక్కి జేరబడి, ఏమీమాట్లాడకుండా కూర్చున్నాడు; మాట్లాడలేకుండా కూర్చున్నాడు పాస్పార్టూ అతని కింకా ఈ ప్రయాణపు వార్త పూర్తిగా నాటలేదు. ఆదెబ్బనించి ఇంకా కోలుకోనే లేదు. అలా మంత్రముగ్ధుడిగా కళ్ళు విప్పార్చి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. బాంకు నోట్లున్న సంచీనికూడా అతను పట్టుకోలేదు. అతని చేతులు పొదువుకున్నాయి; వేళ్ళు పట్టుకున్నాయి.

అలా కొయ్యబొమ్మలా కూర్చున్న పాస్పార్టూ రైలు సైడెన్‌హాం దాటేవరకు హటాత్తుగా ఒక్కసారి అదరిపడి 'హారొయ్యొయ్యో' అన్నాడు.

'ఏమైంది?' అన్నాడు యజమాని.

"అయ్యో! ఆకంగారులో-మతి స్థిమితం లేక-తొందర్లో మర్చిపోయి,—"

"ఏం మర్చిపోయి?"

"నా గదిలో గాస్ పైపు ముయ్యడం మర్చిపోయి వచ్చేశాను" అన్నాడు పాస్పార్టూ దిగులుగా.

ఫాగ్ అరెరె అనలేదు. పోనీ అనీ అనలేదు.

"మంచిది. అబ్బాయ్! దాని కయే బిల్లు నువ్వే అచ్చుకుందువుగాని" అన్నాడు.

ఫిలియాస్ ఫాగ్ ప్రపంచయాత్రగురించి, పందెంగురించి దేశంలో పెద్దసంచలనం రేగింది. తనయాత్ర ఇంత కలకలం లేవదీస్తుందని ఫాగ్ అనుకోలేదు. పందెం సంగతి ముందరే క్లబ్బువర్గాల చర్చలలో నలిగింది. అక్కణ్ణించి పత్రికా వార్తాహరులద్వారా పత్రికల కెక్కింది. లండన్ అంతా వ్యాపించింది. మర్నాటికల్లా దేశదేశం అంతా తెలిసిపోయింది. ఏనోటవిన్నా ఇదేమాట. ప్రపంచ యాత్ర అన్న విషయాన్ని అందులో సాధకబాధకాలనీ, అది తలపెట్టడంలోగల సాహసాన్ని, తెలివి తక్కువతనాన్ని కూలంకషంగా చర్చించారు జనం. సమస్యని దూదేకినట్టు ఏకేశారు. కొందరటన్నారు. కొందరిటన్నారు. కాని రెండు మూడు రోజులలోనే ఫాగ్ మూర్ఖుడనే జనసంఖ్య పెరిగిపోయింది. ఇలాటి యాత్రలు కాగితాలమీద లెక్కలు కడుతూ చేసుకోవలసిందే తప్ప, ఈ కాలపు రవాణాసదుపాయాలను నమ్మి

కాని ఇంతకొద్ది కాలంలో ఇదిసాధిస్తానని పందాలు కట్టడం తప్పన్నారు. సాధించగల ననుకోవడం వట్టిభ్రమ అన్నారు. అపోహ అన్నారు. లక్షలాది ప్రతులు అమ్ముడుపోయే పెద్దపత్రికలు టైమ్స్, స్టాండర్డ్, ఈవెనింగ్ స్టార్ మొదలైనవి ఇరవై పేచీలుకు ఈపందెం విషయంలో ఫిలియాస్ ఫాగ్‌ను నిశితంగా ఖండించాయి. డెయిలీ టెలిగ్రాఫ్ ఒక్కటే మటుకు కొంత వెనకేసు కొచ్చింది. మొత్తం మీద ప్రజలూ పత్రికలూకూడా ఫిలియాస్ ఫాగ్ వట్టి తెలివితక్కువ మనిషని, మతి పోయిన మనిషనీ, మొండిమనిషనీ అనడం, అనుకోవడం జరిగింది. అలాటి పత్రికాగుల వాడిని రెచ్చగొట్టి పందెం కలిపించి ఇంత అఘాయిత్యప్పనికి దిగపంపిన అతనిమిత్రులు అయిదుగురినీ కూడాఅందరూనానామాటలూ అన్నారు. పందెంపైనా, ఫాగ్ పైనా, అతని మిత్రులపైనా, వాళ్ళ బుద్ధులపైనా పెద్దపెద్ద వ్యాసాలు చాలా ఉద్రేకంగా రాశారు. విమర్శ ఉద్రేకంగాఉన్నా వాదం మటుకు చాలా సబబుగా చేశారు ఎవరి మటుకువాళ్ళు. భూగోళశాస్త్రం అంటే అసలు ఇంగ్లీషువాడికున్న మోజు ఇంతా అంతా కాదు. దానిమీద ఇలాటి పందెం పడినపుడు ఆసక్తి ఎంతో ఇంక చెప్ప నక్కరలేదు.

మొదటి రెండు మూడు రోజులలోనూ ఫాగ్ సాహసాన్ని సమర్థించడానికి సాహసులైనవాళ్లు కొద్దిమందిమటుకే ముందంజ వేశారు-ముఖ్యంగా ఆడవాళ్లు. ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్ పత్రిక, ఫిలియాస్ ఫాగ్ ఫోటో సంపాదించివేసిన తరవాత ఈ వర్గం మరీ పెరిగింది. "ఏం. ఇంతకన్న ఘనమైన అసాధ్యాలే సాధ్యపడుతున్నప్పుడు ఇది మాత్రం ఎందుకు కాకూడదూ" అన్నారు కొందరు. ఈ మాట అన్నవాళ్లు ప్రధానంగా డెయిలీ టెలిగ్రాఫ్ పాఠకులు. అయితే క్రమేపీ ఈ పత్రిక మద్దతు తగ్గిపోసాగింది.

అక్టోబరు 7 వ-ఫాగ్ బయల్దేరిన ఐదో రోజు-రాయల్ జాగ్రఫికల్ సొసైటీవారి "బులెటిన్"లో సుదీర్ఘమైన వ్యాసం ఒకటి వెలువడింది. వ్యాసకర్త ఈ సమస్యను అన్ని కోణాలలోంచీ చూసి యోచించి, క్షుణ్ణంగా చర్చించింది. ఈ ఉద్యమం తలపెట్టడం ఎంత తెలివితక్కువ పనో సహేతుకంగా నిరూపించింది. ప్రయాణమై వెళ్లిన పెద్దమనిషికి అన్నీ అడ్డంకులే, అన్నీ ఎదురుతిరిగేవే అని ఆ వ్యాసం వాదం. మానవుడివల్ల జరిగే లోపాలుంటాయి. ప్రకృతివల్ల కలిగే ఉత్పాతాలు ఉపద్రవాలుంటాయి. ప్రయాణం వేళ పట్టున సాగాలంటే, ఫాగ్ ఎక్కే రైళ్ళూ ఓడలూ అన్నీ టైంటేబుల్ లో నిర్ణయించిన ప్రకారం తు. చ. తప్పకుండా, ఒక నిముషం కూడా ఎక్కువా తక్కువా కాకుండా [illegible]

80 రోజులలో భూ ప్రదక్షిణం

అవతల రైలుకో, ఓడకో అందించడం జరగాలి. అంత ఖచ్చితమైన 'కట్టుదిట్టాలు లేవు. ఇప్పుడే కావు అలాటివి ఎప్పుడూ సాధ్యపడవు. మహాఅయితే రైలుబళ్లు వేళకి చేరవచ్చు. అదైనా ఒకొక్క రైలు కొద్దిపాటి దూరమే వెళ్ళే యూరప్‌లో. అయితే, ఇండియాలో ఈ కోస్తానించి ఆ కోస్తాకి మూడు రోజులు ఏకబిగిన నడిచే రైళ్ళు-అలాగే అమెరికాలో ఈ కోస్తానించి ఆ కోస్తాకి ఏకంగా ఏడు రోజులు నడవవలసి వచ్చే రైళ్లు - ఇలాటివికూడా ఇన్ని వేల మైళ్ళూ నిముషంకూడా వేళ తప్పకుండా వెళ్లేటట్టు చూడడం సాధ్యంకాదు. మరలు అరగొచ్చు, విరగొచ్చు. రైలుపట్టాలు తప్పిపోవచ్చు. మంచుమరిసి దారి కప్పడిపోవచ్చు. రైలూ రైలూ ఢీకొట్టుకోవచ్చు. గాలివానా రావచ్చు. ఇవన్నీ ఫిలియాస్ ఫాగ్ పురోగమనానికి ప్రతిబంధకాలే గదా. రైలుబళ్లే కాదు. ఓడలూ అంతే. శీతాకాలంలో ఓడ నడక గాలి బలాబలాలమీద, పొగమంచు దయాదాక్షిణ్యాలమీద నడవాలి. అధునాతనమైన యంత్రాలూ అమర్చి, ఎన్నో కట్టుదిట్టాలు చేసిన గొప్ప గొప్ప స్టీమర్ల విషయంలో కూడా రాకపోకలు ఎన్నిసార్లు అలస్యంకావడం లేదు? రెండేసి మూడేసి రోజులు ఆలస్యంగా ఓడరావడం ఎన్నిసార్లు జరగలేదు? పోతే, ఫాగ్ ప్రయాణం ధ్వంసంకావడానికి ఎన్నో ఆటంకాలక్కర లేదు. ఒక్కటి చాలు. ఒక్కచోట అలస్యం అయితే చాలు. అంతా తలకిందులైపోతుంది. ఒక రైలు రెండు గంటలు ఆలస్యం అయి ఒక్క స్టీమరును అందించలేకపోతే సరి. మళ్లీ ఇంకో స్టీమరుకోసం ఏడు రోజులు అతను పడిగాపులు పడుతుండాలి. ఉన్నా ఇక ప్రయోజనం ఉండదు... ఈవిధంగా ఆ వ్యాసం ఫాగ్ భవితవ్యం తేల్చేసింది. అక్కడితో తిరిగిమరో పెద్దసంచలనం రేగింది.

ఒకరెడ్డి: ఎంత పొద్దెక్కి వచ్చావయ్యా!
రెండవ రెడ్డి: పొద్దెక్కి రాలేదండి. బండెక్కి వచ్చాను.
చిరంజీవి (తైరు)


అంతవరకు ఏమోలే అనీ, కలిసిరాకూడదా అనీ అనుమానిస్తున్న వాళ్లదగ్గర్నించి, ఫాగ్ తప్పక గెలుస్తాడని వాదించేవాళ్లదాకా అందరూ చల్లారిపోయారు. పత్రికలన్నీ ఆ వ్యాసాన్ని ఉపయోగించుకుని వ్యాసాలు రాశాయి ఆ వాదాన్ని ఆమోదిస్తూ.

అసలు మొదటి మూడు రోజులలోనూ వాద ప్రతివాదాలు తీవ్రంగా ఉండి, ఫాగ్ జయాపజయాలమీద పెద్ద పెద్ద పందాలు ఒప్పందాలూ కూడా జరిగిపోయాయి. ఇంగ్లాండులో పైతరగతి పెద్దమనుషులు వట్టి జూదగాళ్లు కారు. అంతకన్న పైతరగతి వాళ్లే. మామూలువాళ్లు కూడా పందాలు వేసుకున్నారు. పందెం అనేది ఇంగ్లీషువాడి తత్వంలో బాగా వంటబట్టిపోయింది. రిఫారం క్లబ్బు సభ్యులు వాళ్లస్థాయిలో పణాలు ఒడ్డితే, దేశంమీద సామాన్య జనులు వాళ్ల వాళ్ల తాహతును బట్టి కట్టుకొన్నారు. ఈవిధంగా ప్రజాబాహుళ్యం అంతా ఈ ఉద్యమంలో ప్రవేశించింది. ఫిలియాస్ ఫాగ్ పందెపుగుర్రం స్థాయికి—పెరిగాడన్నా అనుకోవచ్చు; తగ్గాడన్నా అనుకోవచ్చు. మొత్తంమీద జోరు అలాఉంది. లండన్ స్టాక్ మార్కెట్‌లో ఫాగ్ పేరిట బాండ్లు అమ్మకానికి రావడంకూడా జరిగింది. చూస్తూఉండగా ధరలు చిచ్చుబుడ్డిలా పైకి లేచిపోయాయి. అయితే ఐదోరోజున జియోగ్రఫికల్ సొసైటీ పత్రికలో పైన చెప్పిన సమగ్ర వ్యాసం రావడంతో చిచ్చుబుడ్డి లాగే ఇట్టే చల్లారిపోయి అడుగంటి పోయాయి...

ఎందరు ఎదురుతిరిగినా, మొదటినించీ ఒక్కలాగ ఫాగ్‌ను వెనకేసుకొస్తు, అతను తప్పక నెగ్గుతాడని నమ్మిన వ్యక్తి ఒక్కడున్నాడు. ఆయన లార్డ్ ఆల్బ్‌మార్లీ. పక్షవాతంతో తీసుకుంటున్నాడు చాల కాలంగా. ఎనభై రోజుల్లో కాదు; పది సంవత్సరాలుపట్టినా ప్రపంచంఅంతా తిరిగిరాగల అదృష్టం తనకి అబ్బితే తన యావదాస్తినీ అచ్చుకుందికి సిద్ధంగా ఉన్నాడాయన. ఐతే పక్షవాతంవల్ల అలా పడుండవలసి వచ్చింది. ఫిలియాస్ ఫాగ్ గెలుస్తాడని, ఆయన ఐదు వేలపౌండ్లు పందెం కట్టాడు. ఫాగ్ సాహసం దుస్సాహసమనీ, అవివేకమనీ, ప్రయాణం వృధా దండుగ అనీ ఎందరు ఎన్నందాల వాదించి నిరూపించినా ఆయన తనధోరణి మార్చుకోలేదు. "పోనెండి. పోతేపోతుంది. కాని, అలాటి ఘనకార్యం సాధ్యపడడం అంటూఉంటే అదేదో మొట్టమొదట ఇంగ్లీషువాడే చెయ్యాలి" అన్నాడాయన.

క్రమంగా ఫిలియాస్ ఫాగ్‌ని బలపరచే వారు నీరసించిపోయారు. ప్రతివాళ్ళూ అతనికి ప్రతిగానే పందెం ఒడ్డుతున్నారు. ఒక

(63-వ పేజీ చూడండి)



భూటాన్ లామాల ప్రతినిధివర్గం సభ్యులు ఈ 14వ తేదీన న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి డా॥ ఎస్. రాధాకృష్ణన్‌ను కలుసుకున్నారు.

న్యూఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణ

అహింసా సిద్ధాంతం మీద నిరర్థక చర్చ: భారతీయ ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతి

ఇటీవల రాజధానిలో టాల్‌స్టాయ్ వార్షికోత్సవాలు జరిగాయి. టాల్‌స్టాయ్ చాలా గొప్పవాడనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. ఆయన గొప్ప జిజ్ఞాసువు, మహారచయిత. ఈ ఉత్సవాల సందర్భంలో అహింసా సిద్ధాంతం, "నిర్యుద్ధం" ప్రస్తావనకు వచ్చాయి. 1911 తరువాత యుద్ధాలు జరుగకపోయినట్లయితే, ప్రపంచ పరిస్థితులు, ముఖ్యంగా భారతదేశం పరిస్థితులు ఎలా ఉండేవో చర్చించేందుకు మరో సదస్సును ఏర్పాటు చేసుకుంటే భారతీయ మేధావులు కసరత్తు చేయడానికి మంచి వీలు కలిగేది.

బ్రిటిష్ వారిలో శ్రేష్ఠులనదగినవారు 1914-1919 యుద్ధంలో ఫ్లాండర్సు పొలాల్లో నిహతులయ్యారని 1960 లో ప్రచురితమైన చారిత్రక రికార్డులు తెలుపుతున్నాయి. [illegible] నష్టం మళ్ళీ 1939-45 యుద్ధంలో జరిగింది. స్వర్గీయ వేవెల్ ప్రభువు [illegible] లక్షలమంది బ్రిటిష్ సైనికులు కావలసి వచ్చారు. ఇందుకు భారతదేశంమీద ఆధారపడవలసిందని శ్రీ చర్చిల్ ఆయనకు సూచించారు. అయితే కావలసిన మేరకు అప్పుడు మనుష్యసంపద లభించలేదు.

1913 నాటి ప్రపంచ పరిస్థితులను కొంత వరకు వివరిస్తాను. బ్రిటన్, ప్రపంచంలోకెల్లా అగ్రరాజ్యంగా చెలామణీ అవుతోంది. ఫ్రాన్సు శక్తివంతమైన రాజ్యంగా కనిపించింది. జమీందారీ వ్యవస్థ, నిరంకుశత్వం కొనసాగుతున్నా అగ్రరాజ్యంగా కన్పించడానికి రష్యా ప్రయత్నిస్తోంది. తూర్పు యూరప్ ఆస్ట్రియా - హంగరీ సామ్రాజ్యంగా ఉంది. టర్కీ పతనావస్థలో ఉన్నది. అగ్రరాజ్యం అనిపించుకోవాలని జర్మనీ ఉబలాటపడుతోంది. శ్రీ నెహ్రూ ఈనాడు ఇస్తున్న సలహా 40 సంవత్సరాలక్రితం యూరప్‌లోని అగ్రరాజ్యాలు అంగీకరించారు అనుకుందాం. అప్పుడు ఏమి జరిగేది? నూటికి 90 పాళ్లు భారతదేశం ఇంకా బ్రిటన్ అజ్మాయిషీలోనే ఉండేది.

ఇప్పుడు మరో పెద్ద యుద్ధమేదీ రాకుండా నిరోధిస్తున్నది అటంబాంబుల వల్ల సర్వవినాశనం తప్పదనే భయమే గాని, అహింసా సిద్ధాంతం ప్రభావం కాదు. ఇక ఈ సిద్ధాంతానికి సంబంధించినంత వరకు, శ్రీ నెహ్రూ దీనిని గోవాలో పోర్చుగీసువారిపైనా, సరిహద్దులో చైనీయులపైన ప్రయోగించడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. మహాత్మునకు బ్రిటిష్‌వారి తత్వం ఎరుగున్నారు కనుక ఈ ఆయుధాన్ని వారిపై ప్రయోగించారు. చైనీయులే గాని, జపానీయులే గాని, అమాటకొస్తే రష్యనులే గాని, భారత భూభాగాన్ని ఆక్రమించి ఉంటే వారిపై గాంధీజీ దీనిని ప్రయోగించేవారేనా అంటే, చెప్పలేం

ఈ విషయాన్నే మరో విధంగా కూడా పరిశీలించవచ్చు. రష్యాలో అహింసా సిద్ధాంతం

(53-వ పేజీ చూడండి)

మానవదేహశాస్త్రము

కొన్ని ధాతువుల ప్రవేశంవల్ల వికటించే శరీర స్వభావం

గత వ్యాసంలో ఇమ్యూనిటీ అంటేఏమిటో అది ఎన్ని విధములుగా, కల్పించబడుతున్నదో తెలుసుకున్నాము. ఆయా వ్యాధులనుగురించి ప్రత్యేకంగా చర్చిస్తున్నప్పుడు ఈ విషయం ఇంకా బాగా అర్థం అవుతుంది.

ఇనాక్యులేషన్ (Inoculation) వల్ల శరీరంలో జరిగే మార్పులేమిటి? ఇందువల్ల రోగ నిరోధక శక్తి కలగడమువల్ల లాభమేనా లేక వేరే ప్రమాదాలేమయినా వున్నవా?

బేక్టీరియా శరీరములూ, వాటినుంచి ఉద్భవించే టాక్సినులూ కూడా, రసాయనికంగా ప్రోటీనులను పోలి వుంటవి. ఏ మందుకూ లొంగని దీర్ఘవ్యాధులున్నవారికి, పాలు ఇంజక్షనుగా ఇస్తారు. పాలలో ఉండే ప్రోటీనులు శరీరంలోకి పోయినప్పుడు, శరీరంలో కొన్ని యాంటీ బాడీలను సృష్టించి ఆ రోగమును అరికట్టుతుంది. సహజ స్థితిలో గాని, దుర్బలస్థితిలో గాని, శవస్థితిలో గాని, బేక్టీరియములో వాటి టాక్సినులో మన శరీరంలో ప్రవేశించినప్పుడు కూడా యాంటీ బాడీలు తయారవుతవి. అయితే ఈ యాంటీ బాడీలు, ఏ క్రిమివల్ల జరిగినవో ఆ క్రిమిని మాత్రమే సంహరించే శక్తి గలవి. ఒక యాంటీ బాడీని ఉద్భవింపజేసే వస్తువును యాంటిజెన్ అంటారు. యాంటీబాడీని ఉద్భవింపజేసేవి గనక ఆ వస్తువుకు యాంటిజెన్ అని పేరు. (జెన్ పుట్టించు) యాంటీ బాడీలలో చాలా రకములు ఉన్నవి. కొన్ని టాక్సిన్ కణములను దిగమ్రింగేవి. మరికొన్ని క్రిములను గుంపుగాచేర్చి, రక్తంలో సంచరించకుండాచేసి సంహరించేవి. మరి కొన్ని క్రిములు, ఒకటి రెండు వృద్ధిచెందకుండా అరికట్టేవి. ఒక క్రిమి రోగంతో ఒక వ్యక్తి బాధపడినప్పుడు, ఆ క్రిమికి సంబంధించిన యాంటీ బాడీలు అతనిరక్తంలో ఏర్పడుతవి గదా? అటువంటి రోగి రక్తమును తీసి, ఆ రక్త సీరముకు, ఆ జాతి క్రిములున్న కల్చరును చేరిస్తే, సీరంలో వున్న యాంటీబాడీలు కల్చరులో వున్న క్రిములను ఒకచోటగుంపుగా చేరుస్తవి. అల్పసంఖ్యాకములుగావున్నపుడు సాధారణదృష్టికి కనపడని క్రిములు ఇల్లా గుమిగూడగానే, కంటికి కనుపిస్తవి. ఈ విషయాన్ని గ్రహించిన క్రిమిశాస్త్రజ్ఞులు రోగుల రక్తంతీసి పరీక్షచేసి, ఆ వ్యాధి ఉందోలేదో చెప్పగలుగుతారు. టైఫాయిడ్ జ్వరం వచ్చినప్పుడు, మొదటివారం గడిచిన తరువాత రోగిరక్తంలో ఈయాంటీబాడీలు ఏర్పడతవి. అప్పుడు రక్తంతీసి, అది టైఫాయిడ్ జ్వరం అవునోకాదో నిర్ణయించి తగినచికిత్స చేయడం, ఆ వ్యాధి ఇతరులకు రాకుండా తగినజాగ్రత్త తీసుకోడం ఇందువల్ల సాధ్యం అవుతుంది. టైఫాయిడ్ ఉందోలేదో తేల్చేపరీక్షను 'వైడాల్' అనే శాస్త్రజ్ఞుడు కనిపెట్టేడు. ఇల్లాగే 'సిఫిలిస్' అనేవ్యాధితో కొంతకాలం బాధపడినవారి రక్తం పరీక్షచేసి ఆవ్యాధి వుందో

డా॥ గాలి బాలసుందరరావు

లేదో తేల్చడానికి వీలంటుంది. వాసర్‌మన్, కాన్, అనే శాస్త్రజ్ఞులు ఈ పరీక్షను కనిపెట్టేరు. సిఫిలిస్, ఆదిలో ప్రమాదం కలిగించకపోయినా, కాలక్రమాన ప్రమాదం కలిగించగలదీ, తరతరాలు వ్యాపించి, పిల్లలకు కూడా సంక్రమించగలదీ అయిన వ్యాధి. అవ్యాధి ఉనికిని త్వరగా తెలుసుకుని తగిన చికిత్స చేయడానికి క్రిమివిజ్ఞానం చాలా సహాకరిస్తుంది. ఇల్లా ఎన్నో పరీక్షలు ఎన్నో వ్యాధుల ఉనికినీ, స్థితినీ, తీవ్రతనూ నిర్ణయించడానికి సహాకరిస్తవి. ఈ విజ్ఞానంతోనే జంతువులకు ఆయా వ్యాధులు కల్పించి, వాటిసీరమును సేకరించి, ఆసీరమును, వ్యాధులు రాకుండా ప్రతిషేధించడానికీ (Prev Entive) వచ్చినప్పుడు నివారించడానికి, (Curative) ఉపయోగించడానికి వీలుకలుగుతున్నది. ఈ సీరములు రాకముందు డిఫ్తీరియా వచ్చినవారూ, టెటనస్ వచ్చినవారూ, విధిగా మరణించేవారు. ఇప్పుడు సకాలంలో ఈసీరములను ఉపయోగిస్తే, నూటికి 80 మందికి పైగా పూర్ణ నివారణను పొందుతున్నారు.

అయితే ఈ సీరములు, వేక్సినులు, యాంటీ టాక్సినులూ ఆయావ్యాధుల నివారణ ప్రతిషేధములకు పనికివస్తున్నా వీటి ఉపయోగం వల్ల కొంతమందికి, కొన్ని ప్రమాదములూ, అప్పుడప్పుడు ప్రాణనష్టముకూడా సంభవించడం కద్దు.

ఎల్లర్జీ:—శరీరంలోకి ఇతరవస్తువులు — అవి ఆహారపదార్థములు కావచ్చును, ఔషధములు కావచ్చును, సువాసనద్రవ్యములు కావచ్చును—ప్రవేశించినప్పుడు కొంతమందిలో కొన్ని విపరీతలక్షణములు ఏర్పడతవి. ఆవస్తువులే, అవేపరిస్థితులలో సేవించే అసంఖ్యాకులలో ఏవిపరీత లక్షణములను కలిగించవు. ఏ వస్తువు, ఏవ్యక్తిలో ఎప్పుడు వికటించి, ఏయేలక్షణములను కలిగిస్తవో చెప్పడం సాధ్యం కాదు. కాని ఒకవస్తువుతో వికటించిన శరీరం ఆవస్తువు ఎప్పుడు సేవించినా వికటిస్తూనే ఉంటుంది. అయితే కొన్ని ప్రక్రియలవల్ల, శరీరతత్వంనుంచి ఈ వికటించే స్వభావమును పోగొట్టవచ్చును. తనకు సరిపడనిపదార్థం తనలో ప్రవేశించినప్పుడు శరీరం ప్రదర్శించే వైపరీత్యమును "ఎల్లర్జీ" అంటారు. కొంతమందికి కొన్ని వస్తువులు పడనప్పుడు ఏర్పడే దేహస్థితి 'ఎల్లర్జీ'.

అయితే, ఈవిధంగా ఎల్లర్జీతో బాధపడే వారిసంఖ్య స్వల్పంగానే ఉంటుంది అని చెప్పాను. కాని ఆ అల్పసంఖ్యాకులెవరో నిర్ణయించడానికి సాధనములులేవు. అందుచేత ఎల్లర్జీ ఏర్పడినప్పుడు, ఏదయినా చర్య తీసుకోగలమే గాని, ఏర్పడకుండా చేసేపద్ధతి లేదు. అయితే, ఒకవస్తువు ఒకవ్యక్తికి పడుతుందా లేదా అని తేల్చుకుంటానికి కొన్ని పరీక్షామార్గము లున్నవి.

ఎల్లర్జీ, కొంతమందిలో, కొన్ని కూరలు, కొన్ని పళ్లు, చేపలు, కొన్ని జంతువుల మాంసము తీసుకుంటే రావచ్చును. అనేక లక్షలమంది తినే వంకాయలు తింటే కొంత మందికి ముఖమంతా వాచి గుమ్మడికాయ అంత అయిపోవచ్చును. లేదా ఒళ్లంతా దురదలుపుట్టి దద్దురు లేవవచ్చును. అనేకమందికి అతి హితకరమయిన పళ్ళరసం మరికొందరికి జలుబు చేయవచ్చును. ఇంకొందరిలో ఉబ్బసం కలిగించవచ్చును. కొంతమందికి కొన్ని వాసనలు గిట్టవు. నిమ్మగడ్డి వాసన చూస్తే కొందరికి ఉబ్బసంవస్తుంది. మల్లెపూవులవాసన, కొందరికి పడదు. పూలకింజల్కములు వాసన కొందరికి పడదు. ఎండుగడ్డి వాసనపడక, కొందరికి జ్వరం వస్తుంది. కొంతమందికి కొన్ని మందులు పడవు. కడుపులోకి తీసుకుంటేనే పడవు. ఇక ఇంజక్షన్ ద్వారా తీసుకుంటే ఏం జరుగుతుందో చెప్పడమే కష్టము. పెన్సిలిన్ ఇంజక్షను పుచ్చుకొని మరణించిన పార్లమెంటు సభ్యుని విషయం వార్తాపత్రికలలో మీరు చదివే ఉంటారు. ఒకప్పుడు విటమిన్ బి 1. ఎనిమిదవ ఇంజక్షన్ తీసుకున్న తరవాత ఒక

రోగికి వచ్చినంత పని జరిగింది. ఒక్కొక్కప్పుడు కొన్ని లోషన్లు, ఇంజక్షన్లు చేసేటప్పుడు మందులు చేతిమీదపడి, కొంతమంది డాక్టర్లకు చర్మం పెట్లిపోతుంది. ఇలా చేతులకు చర్మవ్యాధి వచ్చిన సర్జన్లు ఎంతోమంది మళ్ళీ ఆపరేషన్లు చేయడానికి పనికిరాకుండా పోయినారు. ఒక్కొక్కప్పుడు ఒక వయస్సులో, ఒక వస్తువుకు, ఏర్పడని ఎలర్జీ అదే వస్తువుకు మరొక వయస్సులో ఏర్పడవచ్చును. ఎప్పుడూ ఉపయోగించే డెటాల్ లోషను, మరొకప్పుడు వికటించవచ్చును.

ఒక్కొక్కప్పుడు ఒక క్రిమి వ్యాధితో బాధపడే రోగికి, ఆ క్రిమినుండి పుట్టిన టాక్సిను శరీరంలోకి పోతే విపరీతంగా రియాక్షను రావచ్చును. ఉదాహరణంగా ఒక రోగి క్షయతో బాధపడుతున్నాడనుకోండి. ఆ వ్యక్తి శరీరంలో క్షయక్రిములూ ఉన్నవి. ఆ క్రిములు వాటి టాక్సినులను ఉత్పత్తి చేస్తే, ఆ టాక్సినులు అతని శరీరంలో సంచరిస్తూనూ ఉన్నవి. కాని, క్షయ క్రిమినుండి ఉద్భవించిన "ట్యుబర్ కిలిన్" అనే విషములు అతి స్వల్ప మోతాదులో అతని చర్మమధ్యంలోకి ఇంజెక్షనుగా ఇస్తే విపరీతమయిన రియాక్షను వస్తుంది. ఇదేవిధంగా ఆ వ్యాధితో బాధపడని వారికి చర్మంలోకి ఇచ్చినప్పుడు కొద్దిగా రియాక్షన్ వస్తుంది కాని ఇంతగా రాదు కొందరిలో అసలే రాదు. ఈ సత్యమును గ్రహించిన డాక్టర్లు శరీరంలో ఆరోగ్యమున్నదో లేదో తెలుసుకుంటానికి ఈ పద్ధతి అవలంబిస్తారు. బి. సి. జి. ఇంజక్షను ఇల్లా పరీక్షచేసి తెలుసుకున్న తరవాతనే ఇస్తారు. ఇల్లాగే డిఫ్తీరియా వ్యాధి రావడానికి ఆ తత్వంలో అనుకూలత ఉందో లేదో తెలుసుకోవచ్చును. అంటే సాధారణంగా ప్రమాద హేతువయిన ఎలర్జీయే శరీరవిజ్ఞానం కలిగిన వైద్యుల చేతుల్లో ప్రాణరక్షణ హేతువయిన రోగ నిరోధకశక్తిని కల్పించడానికి, శరీరంలో ఆరోగ్యం ఉనికిని గుర్తించడానికి, ఉపయోగకరమైన సాధన అవుతుందన్నమాట.

ఇమ్యూనిటీ ఏవిధంగా ఏర్పడుతుందో తెలుసుకున్నాము. క్రిమి ప్రవేశానికో లేక క్రిమివిష ప్రవేశానికో ఫలితంగా శరీరంలో యాంటబాడీలు వృద్ధిచెంది, ఇమ్యూనిటీ యేర్పడుతున్నదిగదా! అదేవిధంగా శరీర తత్వానికి సరిపడని ఔషధ ఆహారవాసనాదులు శరీరంలో ప్రవేశించినప్పుడు గూడా, ఎలర్జీని కలిగించే వస్తువులు విషో శరీరంలో ఉత్పత్తి అయి ఉండాలి. అంటే, ఇమ్యూనిటీ ఎలర్జీ కూడా శరీరానికిబాహ్యములయినవస్తువులు శరీరంలో ప్రవేశించినప్పుడు, శరీరం యొక్క రియాక్షనేనని అనుకోవాలి.

శరీరానికి పడనివస్తువులు శరీరంలో ప్రవేశించగానే ఏర్పడే వైకల్యమును ఎలర్జీ అంటారు. కాని అటువంటివస్తువులు శరీరంలో ప్రవేశించాక, అవి 'ఎలర్జనులు' గా పనిచేసి, వాటికి రియాక్షనుగా కొం[illegible] ఏర్పడిన ఎలర్జీని "ఎనాఫైలాక్సిస్ (Anaphylaxis) అంటారు. ఈవిధమయిన ఎలర్జీ అతి తీవ్రమయినది; అతి ప్రమాదకరమైనది. పెన్సిలిన్ లివర్ సారము. ఇటువంటి ఇంజెక్షనులు పుచ్చుకోగానే ఏ దుష్ఫలితము కనుపించక, కొన్ని ఇంజెక్షనులుఅయింతర్వాతహఠాత్తుగా పెద్ద రియాక్షను రావడానికి కారణం ఎనాఫైలాక్సిస్." ఇదీఎలర్జీలోఒకరకం. ఇదిఇంజక్షన వల్లనేరాదు. కడుపులోకి మందు తీసుకున్నా అది పడకపోతే ఏర్పడవచ్చును. ఇంజెక్షన్ ద్వారా శరీరంలో ప్రవేశించిన పదార్థం ప్రొటీను అయినప్పుడు, ఎలర్జీ తరుచుగా ఏర్పడుతుంది. ప్రొటీనులు అంటే నైట్రొజన్ అనే మూలద్రవ్యం ఉన్న పదార్ధములు. అల్బ్యుమెన్, గ్లాబ్యులిన్ ఇటువంటివి. కోడిగుడ్డులోఉండే సొన అల్బ్యుమెన్ పాలలో అల్బ్యుమెన్, గ్లాబ్యులిన్ ఇటువంటివి. అందుకనే కుదరని కొన్ని క్రిమి వ్యాధులలో పాలను, మాగడతీసి, అతిస్వల్ప పరిమాణంలో ఇంజెక్షను ఇచ్చేవారు. ఇందువల్ల ఆక్రిమిని సంహరించే యాంటీబాడీలు ఉత్పత్తి అవుతవనే ఆశాభావంతో ఇల్లాచేసేవారు. ఈసమస్య ఈ పద్ధతిని డాక్టరు తరుచు ఉపయోగించడం లేదు. ఇవి యిచ్చేరోజుల్లో ఎనాఫైలాక్సిస్ తరుచు సంభవిస్తూ ఉండేది. సిఫిలిస్ వ్యాధి నివారణకూ, ఇమోసనోఫిల్ ఉబ్బసానికీ పాషాణం ఇంజెక్షనుగా ఇచ్చినప్పుడు-ఈ విధమయిన ఎలర్జీ తరుచు సంభవిస్తూ ఉంటుంది. ఇచ్చిన కొన్ని క్షణాల్లో కళ్ళుతిరిగి పడిపోయేవారు. చెమటలుక్రమ్మి, కాళ్ళు చేతులు చల్లబడి, టెంపరేచరు పడిపోయి, నెత్తురుపోటు తగ్గి, చనిపోయేవారు. పాషాణం యింజెక్షనుగా యిచ్చినప్పుడు, మెదడుమీదఉండే సున్నితము లయినపొరలు, ఇక్లేమం అయి, ముందు నిద్రపట్టి, తరవాత కన్వల్షనువచ్చి, అదే పెద్దనిద్రగా ఏర్పడడం తరుచు జరుగుతుంది. ఏ వ్యాధికి ఈ ఇంజెక్షన్లు యిస్తున్నామో, ఆ వ్యాధితో నే అనేక సంవత్సరములు జీవించడానికి వీలున్న నిండు ప్రాణాలెన్నో ఈ ఇంజెక్షనుకు బలి అయిపోయినాయి ఇలా జరిగినప్పుడు డాక్టరుస్థితి, రోగి ఆప్తుల స్థితి చాలా దయనీయమైనది. ఇల్లా జరగడానికి వీలున్నది. అది ఔషధ లక్షణమేనని తెలియక, రోగి బంధువులు డాక్టర్ని తన్నడానికీ, చంపడానికి పూనుకున్న సందర్భములున్నవి. ఇల్లా చేయక పోయినా, అతని హస్తవాసి మంచిదికాదని అతనివైద్యమే మాన్పించడం తరుచు జరుగుతుంది. కాని ప్రజలకు ఈ విషయమై తెలిసి వుంటే ఈ దురంతానికి పూనుకోరు. ఈ పరిస్థితి, పదివేలసార్లు యిస్తే ఒకసారి ఏ ఒకరిలోనో యేర్పడవచ్చును. అనేక సంవత్స

మనమూ—మనదేహస్థితి

రములుగా బాధిస్తున్న ఉబ్బసంవంటి వ్యాధి కారంరోజులలో ఇందువల్ల అంతరించి పోవచ్చును. అత్యధిక సంఖ్యాకులకు ఉపయోగకరమైన ఔషధం ఒకరికి ప్రాణాపాయం తేవచ్చును. కాని గంటల్లో ప్రాణమోసం తెచ్చే ఔషధములు బహు స్వల్ప సంఖ్య కలవి. ఆసన్నమృత్యువునుండి రోగిని తప్పించడానికి, ఏ అఘాయిత్యం చేసినా ఫరవాలేదు. వెయ్యిపాళ్లలో ఒకపాలు అవకాశంవున్నా ఆ చర్య తీసుకోవలసిందే. కాని, ప్రాణాపాయం కలిగించని వ్యాధులలో, అతి సకృతుగా ప్రాణాపాయం కలిగించడానికి వీలున్న ఔషధముల నయినా ఇంజక్షనులుగా ఇవ్వడం, అంత వాంఛనీయమైన పని కాదు. బాధపడలేక, "చస్తే చస్తాను. ఇవ్వండి" అని రోగే కోరతాడు. అప్పుడయినా ఇవ్వడం మంచిది కాదు. మార్గాంతరములన్నీ విఫలమయినప్పుడు విధిలేనప్పుడు, రోగి ఆప్తులకు చెప్పి అల్లా జరిగితే ఏంచెయ్యాలో, అందుకు కావలసిన సన్నాహం అంతా ఏర్పరచుకుని, రోగిని తన పర్యవేక్షణలో ఉంచుకుని, ఇవ్వడం వైద్యుడి ధర్మమూ విధీ కూడా. ఎప్పుడోప్పుడు ప్రతివారు చచ్చిపోవలసిన వారే! కాని హఠాత్తుగా, ఒక పని చేసినందున, జీవితం అంతం అయితే, ఆ క్రియను 'హానీ' అంటాము. ఎంత మూర్ఖుడయిన వైద్యుడయినా, రోగికి అపాయం కలిగించే పని కావాలని తలపెట్టడు. సత్సంకల్పంతోనే ఏపని అయినా చేస్తాడు. కాని లక్షలో ఒక సారి అయినా మరణం కలిగించడానికి హఠాత్తుగా ఏం చెయ్యాలో ఆలోచించుకోటానికయినా వీలు కలిగించనంత హఠాత్తుగా-ప్రాణాపాయం కలిగించే వైద్య విధానమును, విరమించడమే మంచిదేమో ప్రాణాపాయం తధ్యమూ, సన్నిహితమూ అయినప్పుడు తప్ప ఇటువంటిచర్యలు అవలంబించకూడదు. ఏ మందయినా నోటితో తీసుకొన్నప్పుడు, అది పడకపోతే అనేక రియాక్షన్లు రావచ్చును. కాని గంటల్లో మరణించడం సంభవించదు. వాంతులు, భేదులూ చర్మం ఇన్ఫ్లేం అయి పెట్లిపోవడం, వంటి మీద దద్దుర్లు, కళ్ళు తిరగడం, చెవులు వినిపించకపోవడం. తల తిరగడం, కామెర్లు, శరీరమంతానో, అందులో ఒకభాగమో, దురదతోనో బాధతోనో వాచిపోవడం ఇటువంటివి జరగవచ్చును. కాని వీటిని తేలికగా నివారించవచ్చును. తాత్కాలికమైన అసౌకర్యమే తప్ప వీటివల్ల ప్రాణమోసం రాదు. ఈ తాత్కాలిక అసౌకర్యమును భరించగలిగితే బహుకాలంగా వేధిస్తున్న ప్రమాదకరమైన వ్యాధి నివారణ చేయడం జరుగుతుంది. ★

(సశేషము)

కథ కాని కథ

మంచినీళ్ళ కోసం గాడిదలు...

(మొదటి బహుమతి రు. 10 లు)

కర్నూలులో మా అన్నయ్యగారి ఇల్లు ఎలిమెంటరీ స్కూలుకు దగ్గరలో వుంది. రోజూ రీసెస్‌లో స్కూలు కుర్రాళ్లు మంచి నీళ్ళు కావాలని వచ్చేవారు. మా వదిన పనిలోవుంటే నేనే నీళ్ళు పోసేదాన్ని. ఏమనుకున్నారో ఒకరోజు బాత్ రూమ్ గోడమీద మసిబొగ్గుతో పెద్దగా "ఇక్కడ మంచినీరు దొరకును" అని వ్రాసిపెట్టారు. తెల్లటిగోడ ఖరాబు చేసారని, చలివేంద్రం బోర్డుమీదలా వ్రాసారని ఒళ్ళుమండి బ్రాకెట్‌లో "గాడిదలకు మాత్రమే" నని వ్రాశాను. మర్నాడు మామూలుగా తలుపు గుద్దేస్తున్నారు. నేను ఏదో పుస్తకం చదువుకొంటున్నాను. అందుకని వదినే తపేళ తీసుకెళ్ళి తలుపు తీసింది. తీసిందే తడవుగా గట్టిగా కేకేసింది. కంగారుగా వెళ్ళి చూద్దునుగదా, వరుసగా 6 గాడిదలు నిలబడి వున్నాయి. నలుగురూ చూస్తే అపహాస్యమని నవ్వాలో ఏడవాలో తెలియక గట్టిగా నవ్వేశాను. అసలు విషయం తెలియక తనూ నవ్వుతూ 'నీళ్ళడిగిన వెధవలేరీ, గాడిదలున్నాయి పైగా' అని నన్ను చూస్తుంటే గోడమీద చూపెట్టా. కుర్రాళ్లు చేసిన పనికి నవ్వుకుంటూ గాడిదలనుతోలేసి తలుపు వేసింది మా వదిన.

ఎం. వి. రత్నమ్మ (రాజమండ్రి)

* * *

వేషధారణ

(రెండవ బహుమతి రు. 5 లు)

ఎప్పటినుంచో వస్తాడనుకొన్న మామయ్య ఒక రోజున వచ్చాడు. ఆయన లక్షాధికారి, ఆరువేలనియోగి అయివుండియూ వచ్చి విరుద్ధంగా పరమ లుబ్ధావధాన్లు. 20 నెంబరు ధోవతి, అతుకుల చొక్కా ఆయన శాశ్వత అలంకరణ. మరునాడు ఉదయము మా నాన్నగారు ఊళ్ళోలేని కారణమున మా అమ్మగారు సంచీ ఒకటి యిచ్చి మామయ్యను మార్కెట్టుకు వెళ్ళి కూరగాయలు తెమ్మంది. మామయ్య సంచీ చాలదంటూ అక్కడ వున్న జల్లెబుట్ట తీసుకుని, అక్షాంత కొత్త అవుటచే నన్నుకూడా రమ్మనుట మూలాన మామయ్య, నేను మార్కెట్టుకు బయలుదేరాము. మార్కెట్టులోనికి 10 గజాలు ప్రవేశించామో లేదో, ఒక్క సిల్కు జుబ్బా, గ్లాస్కో ధోవతి కళ్ళజోడు పెట్టుకొన్న ఒక పెద్దమనిషి మా మామయ్యను సంబోధిస్తూ "ఏయ్! కూలీ! అంకమ్మ చెట్టుకు ఏమి తీసుకుంటావు?" అని అడుగగా, మా మామయ్యకు వొళ్లు మండి, కటాలున "జోడు తీసుకుంటాను" అని అనగానే ఆ పెద్దమనిషి తిరిగి చూడకుండా తన బుట్ట నెత్తిమీద పెట్టుకొని అదేపోత పోయినాడు. నేను నవ్వు ఆపుకోలేక నాలో నేనే వేషధారణలో యింత మహత్వమున్నదా అని అనుకుంటూ మామయ్యా, నేనూ కూరలు తీసుకొని యింటికి వెళ్ళాము.

పర్వతం దుర్గాసీతామహాలక్ష్మి (రేపల్లె)

* * *

క్రొత్తరకం టీ

(రెండవ బహుమతి రు. 5 లు)

మా నానిగాడి సంగతి అందరకు తెలిసిందే. వాడు మంచి మాటకారి. బలేబలే తమాషాలు చేసి కడుపుబ్బ నవ్వించుతాడు. ఒక రోజున నేను, మా నాని శేషయ్య గారి కొట్టు దగ్గరకు వెళ్లాము. "ఏమండీ శేషయ్యగారు, యస్. యస్. కృష్ణన్ టీ ఒక పొట్లం ఇవ్వండి" అని అడిగేడు నాని. శేషయ్యగారు నిర్ఘాంతపోయారు. అది క్రొత్తరకం టీ "కాబోలు ననుకొని" బ్రుక్ బ్రాండ్, ప్లాంటర్స్ టీలు ఉన్నాయిగాని ఈ క్రొత్తరకం టీ మాదగ్గర లేదు" అన్నారు శేషయ్యగారు. "మరి ప్రకటన ఎందుకు చేశారండీ? అంటూ కొట్టుమీద అతికించి ఉన్న కాగితం చూపించాడు మా నాని. దానిమీద యస్. యస్. కృష్ణన్ టి. ఎ. మధురం అని వుంది. ఇక్కడ యస్. యస్. కృష్ణన్, టి. ఎ. మధురమైనదని ప్రకటనచేసి, సరుకు లేకుండా చేస్తారని ఎవరు అనుకొంటారు అన్నాడు మా నాని. శేషయ్యగారు నిజంగానే అది క్రొత్తరకం టీ అనుకొని "అది ఎక్కడ దొరికేదిరా బాబూ?" అని నానిని అడిగారు. అది క్రొత్తరకం టీ కాదండీ "సినిమా వాల్ పోస్టరు చిక్కిన కాగితం అంటించి ఉంటారు. పోగా ఈ యస్. యస్. కృష్ణన్ టి. ఎ. మధురం అన్న పేర్లు మిగిలాయి. వారిద్దరు ప్రఖ్యాత హాస్య అరవజంట" అంటూ నవ్వాడు నాని.

ఢిల్లీ కృష్ణారావు (శ్రీకాకుళం)

చల్లారిన వాంగీబాత్

(రెండవ బహుమతి రు. 5 లు)

ఆరోజు ఆదివారం. అందులో మా వాడు నారాయణ ఊరినుంచి వచ్చినాడు. ఇక వాడు ఉన్నాడంటే అంతా రభసగా ఉంటుంది. కాస్త పనివుంది మా వాళ్ళ ఇంటికి వెళ్ళివస్తాము రండర్రా తోడుగా అన్నాడు. సరే నేను, మూర్తి, నారాయణ బయలుదేరాము. ఇల్లు దూరమగుటచే కాస్త అలసిపోయాము.

ఇంటిదగ్గర మేముకనిపించగానే ఇంటాయన చాలా ప్రీతితో వాడిని పలకరిస్తూ, మమ్మాహ్వానించి, లోపలికి తీసుకెళ్ళి, రేడియో పెట్టి, కుర్చీల్లో కూర్చోమని లోపలికెళ్లాడు. మనవాడంటే వారికి గౌరవము, ప్రేమా అని తెలిసినదిమాకు. సరే ఇంటాయన హంగామా అంతా చూస్తూవుంటే ఏదో టిఫిన్ మస్తుగా పడవేస్తాడనుకున్నాము.

అంతలో చిన్నపాప వాంగీబాత్ లాంటిదేదో ప్లేటులోపట్టుకుని బయటకువస్తున్నది. అమ్మాయిని చూడగానే మనవాడు "పాపా చిట్టీ ఇటురామ్మా" అని పిలిచాడు. ఆ అమ్మాయి సిగ్గుపడి ప్లేటు మనవాడిదగ్గర పెట్టి బయటికి తుర్రుమని పారిపోయింది.


"బలే సిగ్గులే" అంటూ ప్లేటు నాకందించబోయాడు మనవాడు. బలేవాడివే బంధువు అని నీకిస్తే మాకిస్తా వెందుకు. ముందు నువ్వు కానియ్యి తర్వాతవస్తే చూద్దాంలే, అని మేము అన్నాము. ఏడ్చావ్లేవోయ్ అంటూ మనవాడు తినటం మొదలుపెట్టి "అబ్బ! చల్లగావుంది నాకొద్దు" అని అన్నాడు. మండినట్టేవుంది నీ తెలివి. ప్రొద్దుటచేసింది ఇంకా ఎక్కడ వేడిగా ఉంటుందిరా అని మూర్తి అనగానే. మనవాడు తప్పేటుందా అంటూ ప్లేటు ఖాళీచేశాడు అయిష్టంతోనే.

ఇంతలో బయటనుంచి అడుక్కునే కంఠం "ఏం స్వామోయ్! గంటసేపు నుంచి బయటఅరుస్తున్నా పిడికెడుఅన్నం వసేయరేం స్వామీ" అంటూ గోలపెట్టింది.

ఏడ్చినట్టేవుంది. ఏమిటే రాత్రి పులిహోర ఉంటే మా అమ్మాయి ఇప్పుడేగా వేసింది. అది ఇంకా ఇంటోకన్నా రాలేదు అంటూ ఉప్మా మాడు ప్లేటుతో మాముందుకొచ్చాడు ఇంటాయన.

— డి. నారాయణప్ప (కడప)

★



ఓ బస్ స్టాప్...

ఓ అందమయిన అబ్బాయి...

'మరింత అందమయిన అమ్మాయి...

అమ్మాయి అబ్బాయిని చూసింది—"చాలబాగున్నాడు స్మీ" అనుకుంది.

అబ్బాయి కూడా అదేటైములో చూశాడు— "చాలా చాలా బాగుందిసుమా" అనుకున్నాడు.

అమ్మాయి అబ్బాయి వంక, అబ్బాయిఅమ్మాయివంక తీక్ష్ణ మాత్రం చూసుకున్నారు. అమ్మాయి సిగ్గుపడిపోయింది. తల వంచుకుంది. అబ్బాయి సిగ్గుపడాలి కావల్ను అనుకున్నాడు, వోలెడు సిగ్గుపడి పోయాడు.

"కోటేరేసిన ముక్కు, కవ్వించే కళ్లు...నూనూగు కోర మీసం...సన్నంగా...పొడవుగా చాలా బావున్నాడు..." వర్ణించుకుంటుంది మనస్సులో.

సంపెంగ పువ్వులాంటి ముక్కు, చిలిపికళ్లు, ఎర్రటి పెదవులు, సన్నంగా...పొడవుగా...అబ్బే! మరీ అంత పొడవు కాదు— ఒక సెంత్రరు పొడవని సవరించుకొని మనసులో గట్టిగా ఆనందపడి పోయాడా అబ్బాయి.

అబ్బాయి చేతిలో పుస్తకాలు, జేబులో పెన్నూ చూసి "చదువుకుంటున్నాడు కాబోలు" అనుకుంది అమ్మాయి.

అమ్మాయి చేతిలో పుస్తకాలు, వేనిటీబ్యాగు చూసి కాలేజి విద్యార్థినై వుంటుందని రెండుకో తృప్తిగా చిన్నగా నవ్వుకున్నాడు తనలో తనే.


ఇంతలో చాలమంది అమ్మాయిలు వచ్చారు. ఆమె వాళ్లలో కలిసిపోయింది. వాళ్లు బెంగాలీలో మాట్లాడుకుంటూ మధ్యమధ్య నవ్వుకుంటున్నారు-అబ్బాయికేమీ బోధపడలేదు.

* * *

ఆ అందమయిన అబ్బాయి పేరు కృష్ణమోహన్. కలకత్తాలో యం. బి. బి. యస్. చదవటానికిగాను వచ్చాడు. వచ్చి వారం కూడా కాలేదు. నగరం క్రొత్త. భాష కొత్త. నివాసం సౌత్ కలకత్తా రాష్‌బిహారీ ఎవెన్యూలో. కాలేజి దూరమైనా సౌత్ ఇండియన్సూ...సాంబారు హోటల్సూ అచటనే హెచ్చుగా ఉండటంచేత తప్పని సరిగా-ఉండక తప్పక-ఉంటున్నాడు.

పదిగంటలకు ఐదు నిముషాలు ఎగస్ట్రా అయింది. నెంబర్ టెన్ బస్సు గరియా హాట్ రోడ్ బస్ స్టాప్ వద్దకు వచ్చి ఆగింది. కొద్దిమంది దిగారు. చాలమంది ఎక్కారు. ఆ అబ్బాయి అమ్మాయిలమధ్య పడ్డాడు. తన ప్రయత్నం లేకుండగనే వాళ్ళ త్రోపులకు బస్సులోకి వెళ్ళిపోయాడు.

నలిగిపోయాడు పాపం అబ్బాయి. మడత నలుగని తెల్లనిబట్టలుకూడా నలిగిపోయాయి. ఉంగరాల క్రాఫింగు గింగురులెక్క చిందర వందరగా నాట్యంచేసింది. ఛీ...ఛీ...అని విసుక్కున్నాడు. "కొంకోజిత బట్టలు పాడు. ఈ వెధవబస్సులకు కెపాసిటీ... 'క్యూ' సిస్టమని...ఏమైనా ఏడిస్తే కనుకనా...అనీ యీసడించుకుంటూంటూండగా...ఉండగా...అమ్మాయిల స్పర్శ సుఖంవలన కలిగిన మధురానుభూతులు విపినకోణాల్లో కన్పించేసరికి... రనాలేగుయీా పద్ధతేభా...వుంద" నుకున్నాడు.



క్రిందభాగంలో ఖాళీ లేకపోవటంవలన పై అంతస్తులోకివెళ్ళి కూర్చున్నాడు. తన లాగే, ఖాళీ లేకపోవటంతో, కొంతమంది అమ్మాయిలు పైడెక్ లోకివచ్చి కూర్చున్నారు.

ఆ చిలిపి కళ్ళమ్మాయి కూర్చోటానికి సీటులేక నిలబడివుంది. ఆమె అలావూచ పట్టుకొని నిలబడ్డంచూచి – సహించలేక, తనలో తనే...తన మనస్సులోనే కొట్టు మిట్టాడుకపోయాడు.

అబ్బాయి గుండెల్లో అభిమానమో – ప్రేమో ... జాలో ... మరేదో చెప్పలేము గాని—కలుగుటచేత తను కూర్చున్న సీటు నుంచి లేచిపోయాడు. ఆ జాలిగుండెల అబ్బాయి లేవటంతోనే, ప్రక్కనేవున్న మరొక బెంగాలీపర్టుకూడా లేవక తప్పింది కాదు. కాస్త సీటయిన అమ్మాయిలు కనిపిస్తే చాలు యీ కాలేజీ కుర్రకారుగుండెల్లో 'గేలంట్రీ' ప్రవేశించేస్తూ వుంటుంది యిటువంటి సమయాల్లో – ఇదేం బాగులేదు, నన్ను అనవసరంగా నిలబెట్టివేశావురా భిషవా" అన్నట్లు ఆ బెంగాలీ పర్టులోనుంచి పైకి పొడుచుకొచ్చిన గ్రద్దముక్కు ముఖంపై తిష్టవేసిన సులోచనాలలోనుంచి చూచాయి చూపులు మిగ్రున. కోపాన్ని భరించలేక జ్రగన పొడుంకాయలాగి ఒక చిటికెడు, మరో అర...బర్రునపీల్చేశాడు గ్రద్దముక్కులోకి గ్రద్దముక్కుగల ఆసామి.

అబ్బాయి సన్నగా నవ్వుకున్నాడు.

అమ్మాయి మరీ సన్నగా నవ్వుకుంది.

ఇద్దరూ వేరువేరుగా నవ్వుకోవటం ఏమంత బాగుండదని ఒక్కసారే నవ్వేశారు అతన్ని చూస్తూ.

ఆ నవ్వుకు తట్టుకోలేక 'బ్రూట్స్' అనుకుంటూ క్రిందకు దిగిపోయాడు.

ఆ మాటకు అబ్బాయి తెల్లటి ముఖం మరింత తెల్లబడిపోయింది.

అంతకుముందే పాలిపోయిన అమ్మాయి ముఖం మరింత పాలిపోయింది అబ్బాయి తెల్లబోయిన తెల్లముఖం చూడ్డంతోనే.

పాలిపోయిన ముఖంగల అమ్మాయి వెంటనే తేరుకొని 'కూర్చోండని' తనప్రక్క గ్రద్దముక్కు ఆసామీ ఖాళీ చేసిపోయిన సీటు చూపించింది.

గుండెలు గుభేలుమన్నాయ్ 'కృష్ణమోహన్' అని వ్యవహరింపబడే ఆ మెడికల్ స్టూడెంటు గుండీల వెనుక నున్నగుండెలు. అయ్యబాబో! కూర్చోవటమే ఏవిటీ !!! ఒక అమ్మాయి ప్రక్కన!! అందు నా కాలేజీవిద్యార్థిని ప్రక్కన!!! మరీ చిలిపిగాచూచే ఆ చిలిపికళ్ళ అమ్మాయి ప్రక్కన... తను...

కూర్చోవటమా!!... అబ్బే! యిది ఎన్నటికీ జరుగనిపని...ఆంధ్రదేశంలో పుట్టి పెరిగినతను ...అమ్మాయిలంటే అల్లంతదూరాన నిల్చునే అబ్బాయిలు ... అబ్బాయిలంటే మరింత అండే మరొక యింతదూరంగా నిల్చునివుండే అమ్మాయిలుగల మనుష్యలోకంనుంచి మనిషిగా వచ్చినతను ఈ అమ్మాయిప్రక్క నిస్సంకోచంగా ఎలా కూర్చోటం అబ్బా! అనుకుంటూండగా "ఈ వారం రోజుల్లో... యీ బెంగాలీ మనుష్యులమధ్య మనిషిగా మసలిన తను కూర్చోవచ్చునని...కూర్చోగలనని" కూర్చుండబడిపోయాడు.

'థేంక్స్' చెప్పాలికదాని...చెప్పబోయే సమయంలో కాకీగుడ్డల కండక్టరు 'టిక్కట్టు' ఎదురుగా నిలబడ్డాడు.

అమ్మాయి వేనిటీ బాగు తెరచింది.

ఈలోనే అబ్బాయి ఒక రూపాయి కాగితంతీసి కండక్టరు చేతిలో వుంచాడు.

కండక్టరు 'కొథాయ్' అన్నాడు.

ఎవ్రడా యీ కొకతాయి–చటుక్కున అనేశాడు.

చటుక్కున నవ్వేసింది అమ్మాయికూడా. ఆ నవ్వుకు ఆమె చెవులనున్న బెంగాలీ రింగులుకూడ ఆనందం యిముడ్చుకోలేక ఊగిపోతూ తెగనవ్వేస్తున్నాయ్.

అబ్బాయిమాత్రం నవ్వకుండాసీరియస్ గా తెగఆలోచించేస్తున్నాడు 'కొథాయ్' అనేపదాన్ని అర్థంకారకు. ఆకీమన 'ఎక్కడకు' అని తట్టేయటంతో 'చిత్తరంజన్ హాస్పిటల్' అనేశాడు గభగభా.

కండక్టరు రెండు టిక్కట్లు మిగతా చిల్లర డబ్బులు యిచ్చిపోయాడు.

కుర్రాడు 'స్టన్' అయిపోయాడు.

కుర్రది అంతకుముందే 'స్టన్' అయిపోయింది.

వెనుకనుంచి ఆమె స్నేహితురాండ్రు కావించే గుసగుసలు...పకపకలు...వికవికలు వినిపిస్తున్నాయ్.

కృష్ణమోహన్ సిగ్గుగా ఆమె కళ్ళలోకి చూచాడు. ఆమె కూడ సిగ్గుతో అతని కళ్ళలోకి చూచింది. అతనికవ్వించే కంటి, క్రింద రెప్ప పైనున్న పెద్దచారనుచూసి ఏమిటో ఏమిటో అనుకుంది మనస్సులో.

కృష్ణమోహన్ అమ్మాయివడిలో నున్న పుస్తకాలు చూశాడు. అట్టపై వ్రాసింది ఘట్టిగా మనస్సులో యిలా చదువుకున్నాడు "బాణి...ఇంటర్ మీడియట్...ఫస్టియిర్ లేడీ బ్రాబగెన్ కాలేజ్"—అంతటితో సంతృప్తిచెందక ప్రత్యేకంగా 'బాణి' అనే మాటను పదిసార్లు అనుకున్నాడు. చాల తియ్యగావుందని యింకో పదిసార్లు మింగేశాడు. పదికి పదిసార్లు మింగేయటంచేత లోన యిముడ్చుకోలేక పైకి కక్కేశాడు... మృదువుగా...మధురంగా మెల్లదిగా...ప్రియురాలు ప్రేయసిని తన్మయత్వంతో పిల్చినవిధంగా 'బా...ణీ' అన్నాడు.

బాణీ అని పిలువబడ్డ ఆ పాలబుగ్గల అమ్మాయిబుగ్గలు సొట్టపడేలా నవ్వింది. ఆ నవ్వు దొంతరలు కృష్ణమోహన్‌గుండెల్లో ఘటిగా...ఘాటుగా నాటుకున్నాయి.


'మీరు బెంగాలీయులేనా' సంశయంగా అడిగాడు ఇంగ్లీషులో యితరులకు వినిపించకుండా.

"ఎందుకంత సందేహం కలిగింది. తెలియటంలే" ఇంగ్లీషులోనే సమాధానమిస్తూ సన్నగా ఇంగ్లీషులోనే నవ్వింది.

పోనీ తెలుగుభాష ఏమైనా తెలుసునా... తెలియదు.

మరి యింతకు క్రితం తెలుగులో ఏదో అంటే అంత చటుక్కున ఎందుకు నవ్వేశారు. ఆమెకు తెలుగు తెలుసుండీ తెలియనట్లు నటించుతుందని భావించి అడిగేశాడు.

ఓహో ! అదా ! ఆ మాటల తీరును మీ ముఖకవళికనుబట్టి మీరేదో 'జోక్' లాంటిది పారేసుంటారని వూహించి నవ్వాను–చిన్నగా సన్నగా నవ్వింది.



'కొంపతీసి మన మైండ్‌లో చెలరేగే ఊహాల్ని పూహించేయదుకదా' అని కొస్త జంకి, మైండ్‌ని కొస్త అదుపులో పెట్టుకోటానికి ప్రయత్నించి మరలా ఏమనుకున్నాడో - ఏమో "ఎందుకులే...మన ఊహాల్ని గ్రహించేసినందువలనవచ్చిన నష్టమేమిటుంటుంది పైగా. ఆమెకు తెలియటం వలన మనకు కొంచెం శ్రమయినా తగ్గుతుందని" మరీ హెచ్చుగా పూహించేస్తున్నాడు.

మీ దేవూరు- బాణి ప్రశ్న యిది.

విశాఖపట్టణం కృష్ణమోహన్ సమాధానం.

అలాగా ఆమె ఆశ్చర్యం.

ఏమిటే! అతని ఉత్సుకతో కూడిన ప్రశ్న.

"అబ్బే! ఏంలేదు. మీ రిక్కడ మెడికల్ కాలేజీలో చదువుచున్నారా?" స్వీట్‌గా అడిగింది అతని పుస్తకంపైనున్న-"కృష్ణమోహన్-ఫస్ట్ యం, బి. బి. యస్. నేషనల్ మెడికల్ కాలేజ్"-అనే లిఖితాన్ని చూసి.

'ఊ' అని తెలుగులో అనబోయి ఆమెకు తెలుగు తెలియదుకదా అని ఇంగ్లీషులోనే 'యస్' అన్నాడు.

మీ ఆంధ్రాలో మెడికల్ కాలేజీలు లేవా? ఆశ్చర్యంగా కండ్లు తాటిస్తూ అడిగింది బాణి.

ఇన్‌సల్ట్—షేమ్ యిన్‌సల్ట్...ది గ్రేట్ యిన్‌సల్ట్ అనుకున్నాడు మనస్సులో "ఎంత మాట లేకేం...వున్నాయ్ - ఆ మాటకొస్తే మీ వెస్టు బెంగాల్ లో వున్న మెడికల్ కాలేజీలకంటె మావే హెచ్చు. ఈమధ్యనే మరొకటి వెలిసిందికూడ" అన్నాడు కొంచెంరొప్పుతూ హృదయంలో పేరుకుపోయిన ఇన్ 'సాల్ట్'ని భరించలేక.

మరయితే ఇచ్చట కెందుకొచ్చారు అమాయకంగా అడిగింది బాణి.

"ఒహ్! అదంతా చెప్పాలీఅంటే చాలా టైము తీసుకుంటుంది. వినాలని కుతూహలం వుంటే చెప్పండి. మీకు ఖాళీగావున్నప్పుడు చెబుతాను. అదుగో మీ బస్ స్టాప్ వచ్చేస్తుంది" "కొంత ఆలస్యమైతే దానిపుట్టి మునిగిపోతుందికొవల్ను" బస్‌స్టాప్‌ని తిట్టుకున్నాడు.

సాయంత్రం నాలుగున్నర గంటలకు మా కాలేజి విడిచిపెడతారు. మీకు వీలయితే ఆ ఎదురుగావున్న పార్కులో నా కోసం వెయిట్ చేయ్యండి వస్తా" అంటూ చిలిపి చూపులతో టా టా చెప్పి దిగిపోయింది.

బస్సుకదిలింది. కృష్ణమోహన్ మైండ్‌లో కూడ ఎన్నో ఆలోచనలు కదిలాడాయి— "ఈ బెంగాలీ అమ్మాయిలందరూ యింతే కొవల్ను" కొత్తాపాతా అనేభేదమే లేనట్లుంది...ఎంతఫ్రీగా మాట్లాడింది...అదే ఆంధ్రాఅమ్మాయి అయితే...అమ్మో! ఇంకేమైనావుందీ...వీళ్లకు మగవాళ్లతోమాట్లాడే

బస్ స్టాప్

టప్పుడు భయమేయదు కాబోలు వాళ్ళలా... అన్నట్లు అడగటం మరచాను.

"వురే! ఏంచేస్తున్నావురా? కొంపతీసి అమ్మాయిమీదకుకాని నీ మనస్సు పోలేదు కదా!!" అని ప్రశ్నించాడు తన మనస్సులో వున్న మడిసిని.

అరెరే...రె...రే కృష్ణా...రే...కృష్ణమోహనా! ఏమిట్రా! నీ చవటమాటలూ నీవూనూ...అందమయిన అమ్మాయి తారసిల్లి హృదయమిచ్చి పలుకరించి ప్రేమను చిలుకరిస్తే ఏవెధవాయన్నా ప్రేమించకుండా వుంటాడురా! ప్రేమించావేంరా" అని యిప్పుడట్రా అడుగుతా...ఇరవై యుగాల క్రితం ప్రేమించానురా!" అని ఉత్సాహంగా చెప్పుకుపోయాడు కృష్ణమోహన్‌లో ప్రేమించటమే పనిగా పెట్టుకొన్న మడిసి కృష్ణమోహన్‌తో.

కొయ్‌రా కొయ్...ఆఅమ్మాయి కన్పించి ఇంకా ఇరవై నిముషాలైనా అయిందో లేదో యుగయుగాలక్రితం...అదీ ఇరవై యుగాల ముందే ప్రేమించానని వాగుతావేంట్రోయ్. ఆ కోసేదేదో కొస్త వెనకాముందూ చూసుకొని కొయ్యరా కుంకా" అబద్ధం ఆడినందుకు భలే కొప్పడిపోయాడు కృష్ణమోహన్.

ఆ...ఆ...ఎంతమాటనేశావు నోటికొచ్చినట్లు తిట్టేయడమే ... వురేయ్ ఫూల్ ... ప్రేమంటే కొద్దిగానైనా అనుభవంలేని వెధవ సన్నాశీ నీ కేమిట్రా తెలుసు - ప్రేమికుల చూపులు...ఆ చూపులకుండే శక్తులూ ... వాళ్లు మాట్లాడే భాషా...ఆ భాషకు ఉండే భాష్యంగుటించీ కొస్త కాకపోతే కూస్త

> సినిమా హాలులో వెనుక వరుసలో యిద్దరు ఒకేతీరున గుసగుసలాడుతున్నారు.
>
> ముందు వరుసలో మనిషి:- ఒక్కముక్కకూడా వినుపించడంలేదు చస్తున్నాను.
>
> వెనుక వరుసలో ఆయన:- నేనూ! నాభార్య ఏదో మాట్లాడుకుంటుంటే మీరు వినవలసిన పనేముంది.
>
> రొండ్ల వెంకటరెడ్డి (హనుమకొండ)

యినా తెలుసురా...ప్రేమవాఙ్మయములో "నిముషమొక యుగమన్న మాట" కపడ్దార్! యిక ముందిలా వాగావంటే చంపేస్తా" కోపంతో కసిరేశాడు మడిసి.

ఉలిక్కిపడిపోయి ఈ లోకంలోకివచ్చాడు కృష్ణమోహన్. చూస్తే యింకేముంది — ఆ తర్వాత బస్‌స్టాప్‌లో దిగవలసిన తను—అది కాక మరొకటి...ఆ మరొకటికాక మరొక స్టాప్‌వరకూ వచ్చేశాడు.

*　　　*　　　*

సాయంకాలం నాలుగుగంటలకే పార్కులోకి హాజరయిపోయాడు కృష్ణమోహన్... కొంతసేపు అటూ ఇటూ తిరిగి వాచి చూసుకున్నాడు. నాలుగూ అయిదు నిముషాలు అయింది. ఒకసారి పార్కంతా సర్వే చేసి వచ్చాడు. నాలుగుంపావె అయింది. కొంతసేపుపోయాక మరలా చూసుకొన్నాడు. ఒక నిముషంమాత్రమే ముందుకు చూపించింది వాచీ...వెధవ్వాచీ ఇంక 'స్లో'గా తిరుగుతుందేటి చెమ్మా' అనుకున్నాడు. వాచీమీద ఛా...డ్డ కోపం వచ్చింది. విసిరి కొడదామనుకున్నాడు. కాని ఉదయం తనలోనున్న ప్రేమికుడు—క్షణమొక యుగం సుమీ ప్రేమికులకు—అన్నది జ్ఞాపకానికి రావటంతో ఊరుకున్నాడు.

అన్న టైముకు ఒకటిన్నర అండ్ పావు నిమిషం ముందుగానే వచ్చేసింది బాణి.

"బాణీ వచ్చేశావా ... రా అల్లక్కడ కూర్చుందాం" అని ఒక పూపొదరింటి దగ్గరికి తీసుకువెళ్లాడు.

బాణీ అనే అమ్మాయి కృష్ణమోహన్‌అనే అబ్బాయినిచూచి సిగ్గుతో తల క్రిందకుదింపేసుకొంది. ఉదయం చూసినంత ధైర్యంగా చూడలేకపోతుం దతన్ని.

"ఇదేంటి ప్రొద్దుటకూ ఇప్పటికీ యీమెలో యింత తేడా వచ్చేసింది" అనుకుని అదేదో తెలుసుకుందామని ప్రేమ'కాల్' రావునీ పిలచి—"అరేయ్! ప్రేమకాల్ రావు ఏరా! అమ్మాయి అంత యిదయి పోతుం"దని అడిగాడు కృష్ణమోహన్.

"ఉష్!!! ఉండరా పానకంలో పుడకలా నీవొకడివి. అది ప్రేమ తాలూకూ మొదటి ఘట్టంలోని మొదటి నటనరా భాయ్... ప్రేమాస్వాదనలోనున్న నన్ను...నీవు చీటికీ మాటికీ డిస్టర్బ్ చేస్తూంటే, మరెప్పుడూ యీ అమ్మాయి నీచెంతకు రాకుండేటట్లు శపించెయ్యగల్ను. జాగ్రత్త...హుం... ఏమనుకుంటున్నావో" హుంకరించాడు ప్రేమకాల్ రావు...తారెక్కిపోయి వూరుకున్నాడు కృష్ణమోహన్.

అమ్మాయి కొద్దిగా తల పైకెత్తింది.

అబ్బాయి కొద్దిగా తల కిందకు దించాడు.

అమ్మాయి కనుగొనల్లోంచి సిగ్గుగ చూచింది.

అబ్బాయికూడ అలాగే యిమిటేట్

చేశాడు. అమ్మాయి చూపులు అబ్బాయిదగ్గరకు వెళ్ళక ముందే అబ్బాయి చూపులు అమ్మాయి దగ్గరకు వెళ్ళాలనుకొని—వెళ్ళలేక మధ్య దారిలో ఒండొకటి పరామర్శించుకొని...హత్తుకొని...

ముద్దు పెట్టుకొని వెనక్కు తమ తమ స్థానాల్లోకి వెళ్ళిపోయాయి.

ఉదయం నుంచీ రిహార్సల్స్ చేసుకొన్నదంతా ఆమె ముందు ధారాళంగా గొప్ప వక్చాతుర్యం గల వాడిలా వక్తలా మాట్లాడేద్దామనుకున్నాడు కుర్రాడు. కాని నోరు విడివడందే. ఇదీ ప్రేమ ఘట్టాలలో ఒకటై యుంటుందని తలంచి, అది ఎన్నో ఘట్టంలోని సంఘటనో...దాని వివరాలేంటో కనుక్కుందామని నోరు తెరచి మరల మూసేసుకున్నాడు-ఒకవేళ ప్రేమ కాల్ రావుమాంచి 'మూడ్'లో లేకపోతే గుండెలపై తంతాడనే భయంతో.

ఆ సంపెంగ ముక్కు అమ్మాయి కూడ క్లాసులో కూర్చొని ఏవో ఏవో ఆలోచించేసింది. ఏమడిగినా విడమర్చి చెప్పేసే వాటంలో వున్నాడా వుంగరాల జుత్తబ్బాయను కొని ఉన్న సంశయాలకు మరికొన్ని సంశయాలను కల్పించేసుకొని మరీ వచ్చింది. తీరా యిప్పుడు చూస్తే "నోరు పెకిలి రావటం లేదేమిటబ్బా" అనుకుంది.

క్షణాలు....నిముషాలు....కాదు కాదు యుగాలు యుగాలే దొర్లిపోతున్నాయి మూగపోయిన ఆ రెండు హృదయాంతరాంతరాళాల మధ్య.

ఇదేమిటబ్బా వీళ్ళిద్దరూ ప్రేమ భాష మాట్లాడుకుంటూ తనను పలుకరించక...విస్మరించినట్లున్నారనుకొని - అనుకోవటం వలన కలిగిన ఉడుకు మోత్తనం...నిస్పృహ...నిరాశలతో గభగభాపోయి గభుక్కున పశ్చిమ దిక్కునున్న నభోమండలంలో ఎర్రటి అగ్ని మంటలు రేపుకుని గభీలున ఉరికి ఆత్మహత్య చేసేసుకున్నాడు-ప్రతి జీవిని పలుకరించటమే పనిగా పెట్టుకొన్న లోకసంచారి సూర్యారావు.

విశ్వరూపం గల ఓ కాంత-పేరు సంధ్యాదేవనుకుంటా—ఆకుపచ్చ, బూడిదరంగు, నలుపు, నీలం వగైరా రంగుల సమ్మిళితంతో అద్దకం చేయబడిన సన్నని నూలు చీర కట్టుకొనివచ్చి ఆ మూగ జీవులను చూసి — చూడలేక, సుదీర్ఘమయిన, సువిశాల మయిన తనచీర చెంగుతో వాళ్ళను కప్పేసింది. త్రుళ్ళిపడి చూసుకొన్నాయి ప్రేమ పక్షులు...ప్రక్కను...పదిగజాల దూరంలో నిల్చుని చూస్తున్న 'దీపికా'రాణి తనను ప్రేమించలేదనే కోపంతో వ్రిక్రుగున చూసింది మెడికల్ విద్యార్థి కళ్ళలోకి.

మెడికల్ విద్యార్థుల్లో ఏముందని యీ విశ్వంలోనున్న ప్రతివస్తువు - ముఖ్యంగా అమ్మాయిలు-వాళ్ళ తండ్రులుకూడ యిలా ప్రేమించేస్తుంటారు" నొచుకున్నాడు మెడికల్ విద్యార్థి.

ఇద్దరూ బయలుదేరారు...బస్సెక్కారు...దిగారు...కొంతదూరం నడచి వెళ్ళారు...అబ్బాయిగది పలుకరించింది "ఏకాంతంగా వుండలేక నీ కోరకే ఎదురు చూస్తున్నా'నని.

రేపు మీరేమి చేస్తారు-బాణి అడిగింది.

మామూలే కాలేజీకి వెళతాను.

బాణి నవ్వింది. ఈ అమ్మాయికి ఎంతసేపూ నవ్వటం తప్ప మరేమీ తెలియదు కాబోలు"నుకున్నాడు.

కుర్రాడేదో మా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడని బహుశా తన నవ్వుగుతించే ఐ యుంటుందని "రేపు ఆదివారం కదండీ" అంది యిక అట్టే బాధ పెట్టటానికి యిష్టంలేక.

"ఓ! ఐయామ్ సారీ!" ఇంగ్లీషులోనే ఆశ్చర్యపడిపోయి ఇంగ్లీషాల్లలాగే భుజాలు రెండూ ఒకసారి పైకెగేసి క్రిందకు కుదేశాడు.

"రేపు మా యింటికి తీసుకువెళతాను. వస్తారా?" జవాబుకొరకు ఎదురు చూసింది.

'యా' అనబోయి అలవాటుగా 'ఊ' అనేశాడు.

* * *

ఘూర్కావాని సలామ్ రిసీవ్ చేసుకొని ఇద్దరూ పెద్ద బంగళాలోకి ప్రవేశించారు. ఆ బంగళా ఉంగరాల జట్టబ్బాయి ప్రేమించిన అమ్మాయి తండ్రిగారిది. బాణి డ్రాయింగ్ రూములోకి తీసుకవెళ్ళింది అతణ్ణి. స్పెన్సర్ సిగార్ పొగలు గ్రక్కుతూ రింగులు వదలుతుంది. ఆ రింగుల్లోంచి చూసేసరికి ఒక మానవాకారం కన్పించింది కృష్ణమోహన్‌కు.

"డాడీ! ఇతనిగురించే రాత్రి మీకు చెప్పాను" అని ఒకరికొకరిని పరిచయం చేసింది.

'గుడ్ మార్నింగ్ సార్'అని నమస్కరించి కొద్దిగా తలవంచాడు వినయాన్ని ఒకపాలు అతి వినయాన్ని నాలుగుపాళ్లు ప్రదర్శించాలనే ఉద్దేశ్యంతో—తలవంచేసరికి ఓ మాంచి విషయం జ్ఞాపకానికివచ్చేయటంతో, ఆయన పాదధూళి తీసుకోవటానికి వంగి, వాటకి 'బూట్సు' వుండటంచేత-నాటిధూళే తప్పని సరిగాతీసుకొని శిరస్సుపై రాసేసుకున్నాడా వుంగరాలజుత్తబ్బాయి వుంగరాలు చెదిరిపోకుండా.

ఆయన బలే ఆనందపడిపోయి "ఏయ్, బోయ్!...వాటె నైస్ గై యు ఆర్!" అని ఆచారప్రకారం కౌగలించేసుకున్నాడు ఘట్టిగా తన అభిమానాన్ని "ఎక్స్‌ప్రెస్" చేయాలనే ఉద్దేశంతో - "ఇదేం బాగులేదు' నేనుమాత్రం ఎందు కూరుకోవా"లని కుర్రాడి తలపై ముద్దు పెట్టేసుకొంది తనూ 'లైక్,

చేసినట్లు తెలియపరచటానికిగాను స్పెన్సర్ సిగార్.

కొంతసేపు అవీయివీ మాట్లాడుకున్నారు ముగ్గురూ "డాడీ! మీరెక్కడికో వెళ్లాలన్నారు కదూ!!"

అన్నట్లు మర్చిపోయాను మీరు మాట్లాడుతూ వుండండి... బాణీ అతనికి ఈ నగరం క్రొత్తకదూ చూడవలసిన ప్రదేశాలు చూపించకూడదు" చిన్న సలహా ఒకటి పారేశారు పళ్ళమధ్యనున్న సిగార్ ప్రక్కనుంచి.

అయితే మాకు కారు వదలేసి మీరు 'టేక్సీ'లో వెళ్ళండి" ఉత్సాహంగా అంది.

ఛీఛీ! వెధవసలహా యివ్వక పోయినా బాగుణు నాకేముప్పు తెచ్చిందని కోపంతో కసక్కని సిగార్‌ని కొరికిపారేసి పైకి సంతోషంతో" ఆల్ రైట్ అని వెళ్లిపోయారు.

సిగార్ బాధగా మూల్గింది.

డాడీకారు కాళీఘాటువద్ద ఆగింది. స్టీరింగుముందున్న పాలబుగ్గలమ్మాయి క్రిందకు దిగింది. ఇద్దరూ విడివిడిగా తర్వాత ఒకే మారుగా కాళీమాతను మనస్సులో ప్రార్థించుకొని విడివిడిగా తర్వాత ఒకేమారుగా కాళీమాత ఆశీర్వాదాన్ని పుచ్చుకున్నారు.

విక్టోరియా మెమోరియల్ హాలు వద్దకు వెళ్ళేసరికి 'కాస్త రెస్టు తీసుకుంటా' నని కోరింది కారు. అరగంటకు పైగా విశ్రాంతితీసుకొని 'కర్...గుర్' అని శబ్దం చేసుకుంటూ బయలుదేరి దారిలోనున్న మ్యూజియంతో ముచ్చటలాడిందిముప్పావు... మరో ముప్పావుగంటసేపు, రెక్కసలుపుగా వుందని గ్రాండుహోటలు ఘూర్ఖావాడు రెక్కఝుడాయించి లాగి బాధ పోగొట్టగలడనే ఉద్దేశ్యం కలగటంతో అక్కడ ఆగిపోయింది గత్యంతరంలేక అందున్న అందమైన అబ్బాయి మరింత అందమైన అమ్మాయి హోటలులోకివెళ్లి ఆ త్మారాముళ్ళను సంతృప్తిపరచుకొని తిరిగివచ్చారు.

రైటో! అని బయలుదేరిందికారు. డమ్‌డమ్ విమానాశ్రయంవైపు విమానమంత వేగంతో పరుగెడుతూ దారిప్రక్కనున్న జైన్ టెంపుల్ని (పరశురామ మందిరం) చూడటంతోనే ఒక్కసారే ఆగిపోయి ఒక అడుగు ముందుకువేసి మరోఅడుగు వెనక్కువేసి మరళా రెండడుగులు ముందుకువేసి ఆగిపోయింది. అరగంటవరకూ తేరిపారజూచి ఆఖరుసారిగా ప్రదక్షిణం చేసుకొని బయలుదేరింది విమానాశ్రయం వైపు.

ఆగినచోటల్లా వివిధకోణాల్లో...మాంచి

పోజుల్లో అమ్మాయికి ఫోటోలు తీశాడు అబ్బాయి—రోలీ ఫ్లెక్సు కెమేరాతో—అమ్మాయిమాత్రం తక్కువతిన్నదా తనకు నచ్చిన ఏంగిల్సులో అబ్బాయికి 'స్నేప్సు' లాగేసింది. ఇద్దరిచేతులమధ్యా పడినలిగి నాలుగురీళ్ళు తమరూపాల్ని వివిధ రూపాల్లోకి మార్చుకున్నాయి.

* * *

ఒక ఆదివారం—ఉదయం పదిగంటలయింది. అమ్మాయిరాకకై అబ్బాయి ఎదురు తెన్నులుచూస్తున్నాడు. ఇండియన్ పంక్చుయాలిటీ మెంటైన్ చేయకపోతే 'యిన్సల్టు' గావుంటుందని ఓపదినిముషాలు లేటుచేసి పదీ పది నిముషాలకు కృష్ణమోహన్ గదిలో ప్రత్యక్షమయింది వాణి.

అబ్బాయికళ్ళుకాగడాల్లా వెలిగాయి.

అమ్మాయికళ్లు మిలమిలలాడాయి.

కూర్చో 'వాణీ' కుర్చీ చూపించాడు. వాణీ కూర్చుంది.

"ఒరేయ్! కృష్ణమోహనా" ఏంచేస్తున్నావురా కుర్రనాగమ్మ అంటూ దభాలున తలుపు తోసుకుని గభాలున రూములోకి ప్రవేశించాడు- అతని స్నేహితుడు క్లాస్మేట్ అయినరత్నం. ఆ విసురుకు బోర్ల పడబోయి, ఎదురుగానున్న అమ్మాయిని అదే క్షణంలో చూసేసి ఆబ్బాయిప్పుడు పడ్డం మరీ అంతమంచిది కాదని... నెమ్మదిగా కాళ్ళు నిలద్రొక్కుకొని, నడ్డిమీద చెయ్యివేసి రెండోచేయి ఫేంటు జేబులో వుంచేసి, ఒకకాలు బెంచన్ గా మరొకటి లూజ్ గా వదిలి-నిలబడి పోయాడు. కనుగ్రుడ్లు గిరగిరా త్రిప్పేస్తూ.

"వీడెవడురా: సాతాని శవంలా సమయానికి ఎదురయ్యాడు"- పైకి అనలేక మనసులో అనుకుంటూంటూనే పైకనేశాడు.

"అరేయ్! వురేయ్!!...ఏమిట్రా అంత మాట నేశావ్" అమ్మాయి ఎదుట ఛెడామడా తిట్టేస్తున్నందుకు సిగ్గు పడిపోయాడు రత్నం.

"ఎడిశావ్ కానీ వెధవాయనం నోరు మూసు కూర్చో" అంటూ "వీడు స్నేహితుడు...ఈమె మిస్ వాణి, స్నేహితురాలు" అని ఒకరికొకరిని పరిచయం చేశాడు.

'లక్-టు-మీట్-యు' అని చేయి ముందుకు చాసింది. 'షేక్ హేండ్' ఈయటానికి గాను ఆ అబ్బాయి స్నేహితురాలు.

అబ్బాయి స్నేహితుడు పొంగిపోయి చేయి ముందుకు చాచబోయి-అది వణికే పరిస్థితిలో వుందని కాస్త ముందుగా తెలిసుకొన్న వాడవటం చేత-'హిందూయిజం' నిపాటిస్తూ నమస్కారం పెట్టేశాడు కాస్త చిరునవ్వు జోడిస్తూ.

వురే! 'చాపపిల్ల' (కలకత్తాలో ఆంధ్ర విద్యార్థులు బెంగాలీ అమ్మాయిలని ముద్దుగా పిల్చుకునే మాటయిది) లావుందిరా!" రత్నం తెలుగులో అడిగేశాడు మదిలో కలిగిన సంశయాన్ని భరించలేక.

ఒరే! సపవా!...ఒరే సపవాయనం "లావుందిరా" అంటావేమిరా, కన్పించటంలే...నీవు నీ వెధవ సంశయాలూను"

ఆరి నీ చవట...తిట్టబోయి ఊరుకున్నాడు ఆ అబ్బాయి స్నేహితుడు తన స్నేహితుణ్ణి "వురే! ప్రేమించావేమిత్రా! అహా మనలో మనమాటస్మీ...నాకు తెలియకడుగుతున్నా." నడ్డిమీద చేయి వేసుకొనే అబ్బాయి నెమ్మదిగా అడిగాడు.

ప్రేమించటం ఏమిట్రా సీతలకాయ్ ఆపని చూసిన క్షణంలోనే అయిపోయింది. ఇక మిగిలింది కూడ త్వరలో.

నడ్డిమీద చేయి అబ్బాయి ఉండబట్టలేక "ఏట్రోయ్-పెళ్ళా" అని అడిగేశాడు అర్జెంటుగా.

అవునన్నట్లు తలవూపి, కాలరెత్తి చిన్న పోజుయిస్తూ ఆమెదెస తిరిగాడు. అమ్మాయి ఏమిటీ 'బోరు' అన్నట్లు కళ్లు చిట్లించింది.

ఓరినీ చవటా మీ బాబొప్పుకుంటాడ్రా? ఇది జరుగని పని అన్నట్లు తల అడ్డంగా త్రిప్పాడు రత్నం.

"ఒరేయ్ వధవాయనం చవటాయనం సపవాయనం. నిన్నే (నారత్నాకరం ... ఖరం "నీలా నీబాబు ఉహు నీతాత తాత్తాత. తాత ముత్తాతలు ఒప్పుకోలుతో పనిలేదురా మనకు" ఛెళ్ళున నడ్డిమీదకొడుతూ భళ్లునవ్వేశాడు. నడ్డిమీద చేయి క్రిందకు దిగజారి పోయిందా అమాయకరావు పాండే రత్నాఖరం అని పిలువబడ్డ రత్నాకరంకు.

అమ్మాయి తెగబోలెడు నవ్వేసింది.

ఉడుకు మోత్తనం వచ్చి వెళ్లిపోతాడని ఎక్స్పెక్టు చేసిందేమో యింకా బోలెడు నవ్వేసింది,

ఇదరూ అంత యిదిగా అంత అదిగా తెగ తెగా తెగా తెగ నవ్వేస్తుంటే తనునవ్వకపోతేభా...వుండదని తెలతెలపోయేముఖంలో వెలవెలబోయే నవ్వు కొంత నవ్వేసి...రక్తిగా లేదని మానేసి-తపీలున నడిమీద చేయివేసుకొని యిక అచ్చటుంటే వున్న మర్యాద కాస్త వూడేలా వుందని స్నేహితునికి 'టా...టా' చెప్పి తనస్నేహితుడు చెప్పే 'తా...తా'ను రిసీవ్ చేసుకోకుండానే వడివడిగా వెళ్లిపోయేడు—రత్నాఖరం సారీ...కరం.

వాళ్ళమధ్య జరిగిన సంభాషణంతా ఇంగ్లీషులోకి ట్రాన్స్లేట్ చేసి చెప్పాడు కవ్వించే కళ్ళుగల అబ్బాయి చిలిపికళ్ళ అమ్మాయికి.

ఇద్దరూ నవ్వుకున్నారు. వాళ్ళలా నవ్వుకుంటూంటూంటే - కిటికీ వూచల్లోంచి

(54-వ పేజీ చూడండి)

హరివంశము

మధురాపర్వము — 14

ఆలోన నయ్యదు వీరుండు—
మణులు రాలగ జారుమకుటంబు పడదన్ని
నడివెంట్రుకలు పట్టి వ్రాలదిగిచి
నడుతల యంద పిడికిట మొదళులు

గలగంగ బొడిచి మోకాల నురము
దాకింప నొక్కచేతయు చేయలేక ని
శ్చేష్టుడై రోజు విద్విష్టు బెలుచ
హారముల్ ద్రెవ్వ గర్ణావతంసములూడ

నంతరీయోత్తరీయములు వీడ
నోరముక్కున జెవులను ఘోరరుధిర
మొలుక గ్రుడ్డులు వెలుపలి కుబుక మేడ
డిగ్గద్రోచుచు దోడన డిగ్గిప్రగ్గ
గ్రుమ్మెనుసురుపోవంగ సక్రోధలీల

—హరివంశము

అనుకొని కంసుడు తన ఉన్నతతమగం మీదకు దూకుతున్న శ్రీ కృష్ణహర్యక్షాన్ని చూచినాడు. అతనిని అంటివున్న దేవిని చూచినాడు. కంసునకు ఆ ఇద్దరు తప్ప తక్కిన సమాజవాటం ఏమీ కన్పించడంలేదు. సమాజవాటంలో ఎవరు ఏమి అనుకుంటున్నారో పట్టడంలేదు. అతని చూపు, బుద్ధి, మనస్సు, అంతఃకరణము, ఆత్మ, వారిని వదలి బాహిరపోవడంలేదు. సభలో కంసుని ఆ ఉనికి అర్థమైనవారులేరు. వారికి శ్రీ కృష్ణుని విక్రమవ్యాపారమే కన్పిస్తున్నదిగాని, కంసునిలో ఏమి జరుగుతున్నది కన్పించడములేదు. శ్రీ కృష్ణుని ఆ లంఘనవేగం వారికి దిగ్భ్రాంతి కారణమైంది. వారు ప్రాన్పడిపోయినారు. వారి ఇంద్రియములు పనిచేయడమేలేదు. శ్రీ కృష్ణదేవుని పరమకోపనమూర్తిని చూడగా వారికి వ్రేగైపోయింది. వారికి అక్కడ ఏమి జరుగుతున్నది ఎరుకకు అందడములేదు. కంసుడు ఏమి చూడగల్గుతున్నాడో, ఏమి వినగల్గుతున్నాడో, ఏమి అనుభవించగల్గుతున్నాడో, వారు చూడలేకపోతున్నారు. వినలేకపోతున్నారు. అనుభవించలేకపోతున్నారు. కంసుడు దేవిని చూస్తున్నాడు. దేవదేవుణ్ణి దర్శిస్తున్నాడు. అతనిలో ఇప్పుడు భయము భయము కాదు. అది ఏదో ఇదమిద్ధమనరాని అనుభవ పరమార్థమై ఒప్పుతున్నది. కంసుడు దేవిని చూస్తున్నాడు. దేవదేవుణ్ణిచూస్తున్నాడు. ఆ దేవి అంతలో ఇంతవరకువలె లేదు. అంతలో ఆమె మారిపోయింది. కంసునకు భయము వేయలేదు. ఇప్పుడు అతనిలో భయములేదు. క్రోధము లేదు. ఏమీలేదు. తాను తానైవున్నాడు. తాను దేవిని చూస్తున్నాడు. ఆ దేవి ఇప్పుడు దివ్యస్రగనులేపన. హారశోభిత సర్వాంగి. మకుటోజ్జ్వల భూషిత. కన్య. దివ్య. దేవతలచేత అభిష్టుత. నీలపీతాంబరధర. గజకుంభోపమ స్తని. రథవిస్తీర్ణజఘన. చంద్రవక్త్రి. చతుర్భుజ. విద్యుద్విస్పష్టవర్ణాభ. బాలార్కసదృశేక్షణ. పయోధర స్తనవతి. సంధ్యవలెసపయోధర. శ్రావణబహుళ అష్టమినాటి అర్ధరాత్రి వేళ తనకు మునుపు ఇచ్చిన దర్శనం తిరిగి ఇప్పుడు ఇస్తున్నది. భూతగణాదులమై నృత్యంచేస్తున్నది. నవ్వుతున్నది. విపరీతంగా ప్రకాశిస్తున్నది. రౌద్రియై అనుత్తమపానాన్ని సేవిస్తున్నది. మహాహాసం చేస్తున్నది. రుషితభాషణం చేస్తున్నది: కంస! ఆత్మనాశంకోరినవానివలె నీవు నన్ను అభిపాధితనుచేశావు. శిలాతలంమీద వేసి కొట్టబోయినావు. నేను నీచేతఅభిపాధితను కాలేదు. నీశత్రువు ఇప్పుడువచ్చినాడు. నీకు అంతకాలం సమీపించింది. నీ శత్రువు నిన్ను భూపతితుణి చేయబోతున్నాడు. కంస! నీ రక్తం నేను ఆస్వాదించబోతున్నాను. అదుగో భగవంతుడు. తన కరణములతో నిన్ను విపాటితుణ్ణి చేయబోతున్నాడు.” అని ఆమె మహాహాసం చేసింది. ఆ మహాహాసాన్ని పోలి శ్రీ కృష్ణదేవుడు రౌద్రప్రకారమూర్తియై, జాతవిక్రముడై, సత్యపరాక్రముడై, రంగమధ్యంనుండి రాజుదెసకు వేగస్ఫూర్తితో ఉరుకువెట్టగా సమాజవాటంలో ఒక్కరుడు గూడా ఆ మూర్తిని కానలేక ఇది యేమి కనుమాయయో అనుకున్నారు. భువిమీద ఒక కృష్ణుడు, దివియందు వేరొకకృష్ణుడుగా భగవంతుడు, ఒక్క అదటున కంసుని తమగంమీద వ్రాలినాడు. కంసుడు తలకినాడా! అవయవములు సడలినాడా? ప్రచలితాననుడైనాడా? ఏదో మహాఘనాఘనం ఉద్ధతవాయుక్షిప్తమై ఆకాశంలోనుండి తనమీద ఊడిపడుతున్నదనుకున్నాడా! అప్పుడు అక్కడ ఏమి జరిగిందో ఎవ్వరు చూడలేకపోయినారు. అందరు ఆ మూర్తి వ్రేగుకు విసంజ్ఞులైనట్లు స్తబ్ధతను భజించారు. శ్రీకృష్ణదేవుడుమాత్రం కంసునియందు ఒక్క సంగతిని చూడగలిగినాడు. అది అతని ముఖమునందలి అనిర్వచనీయమైన మందహాసము. ఆ మందహాసమును తారకామయ సమయంలో ప్రభువు కాలనేమి ముఖమునందు మాత్రము చూచినాడు. ఆ మందహాసమును చూడగా భగవంతునకు తిరిగి తారకామయసమరం ఇప్పుడు కంసుని సమాజవాటంలో జరుగుతున్నట్లు అనిపించింది. ఆ దేవతలు, ఆ రాక్షసులు అంతా భువియందు అవతరించినట్లు అవభాసించింది. ఆ రాక్షసులను తాను తునిమినట్లు, తునుముతున్నట్లు, ప్రభువు విక్రమ వ్యాపారాన్ని ప్రదర్శించినాడు. కంసుని మకుటాన్ని మణులుజారగా తన్నినాడు. కాళికీదేవి నవ్వులు ముక్కరకాంతులలో ఎఱ్ఱబడి వ్యాప్తిని పొందుతున్నట్లు, ఆమణులు జారిపడి, జలజలారాలి గలగలా మ్రోతలు చేసినవి. భగవంతుడు కంసుని వెంట్రుకలుబట్టి వ్రాలగా తిగిచినాడు. కంసుడు ప్రతిఘటించలేదు. మందహాసం చేస్తూ తన ఉత్తమాంగాన్ని భగవంతుని చేతులలో మెసలనిచ్చినాడు. భగవంతుడు తన పిడికిటి పోటులతో కంసుని నడుతలను మొదళులు కదలగా బొడిచినాడు. కంసుడు చేతులతోగూడా ప్రభువును వారించలేదు. తాను

విడో ఉగ్రశిరస్కుడు, వేయి తలలను విచ్చి, కౌశికీదేవి ఉద్ధతనాట్యములకు ఆ తలలను రంగభూములనుగా దిద్దుకొన్నట్లు భావించాడు. శ్రీకృష్ణదేవుడు మోకాటితో కంసుని ఉరము అదిమివేసినాడు. కౌశికీదేవి తన్ను చషకముగా చేసుకొని రక్తపానాపేక్షతో బింబఫలములనుపోని తన పెదవులతో నాక్కుతున్నట్లు కంసుడు విచిత్రానుభూతినిపొందినాడు. చూపరకు కంసుడు నిశ్చేష్టుడు. భగవంతునకు కాదు. వాడు నిండు తెలివి. ఆ తెల్వితో కంసుడు భగవంతుడు తన్ను హారవిహీనుణ్ణి చేస్తుంటే మందహాసం చేశాడు. హారాలు త్రెంచుతూవుంటే మందహాసం చేశాడు. కర్ణావతంసములు శ్రీకృష్ణదేవ పరిఘాత వేగవశమున ఊడిపోగా మందహాసం చేశాడు. అంతరీయో త్తరీయములు వీడగా మందహాసంచేశాడు. నోరను, ముక్కులను, చెవులను రుధిరములు ఒలుకగా మందహాసం చేశాడు. కౌశికీదేవి కాళికయై ఆ నెత్తుటి యేరులను ఒక బొట్టు నేలమీద పడనీయలేదు. మహిషుని నెత్తురును గ్రోలినట్లు గ్రోలింది. శ్రీకృష్ణదేవుడు కంసుని కన్నులు వెలుపలికుబుకగా తిగిచినాడు. కంసుడు మందహాసం చేసినాడు. కంసుణ్ణి భగవంతుడు ఉన్నతతమగంమీదనుండి క్రిందకు దిగ త్రోచినాడు. తానును వానితో డిగ్గ ఉరికినాడు. కంసుని మేను ప్రగ్గగా క్రుమ్మినాడు. కంసుడు మందహాసంచేసినాడు. భగవంతుడు కంసుని ఉసురుపోవగా క్రోధలీలతో వధించాడు. కంసుని ముఖమున మందహాసము మాత్రము చెడిపోలేదు.

ఆ అనంతరం అంతా పరమఘోరంగా జరిగిపోయినది. భగవంతుడు విగతప్రాణుడైన కంసుని శరీరాన్ని రంగద్వారందాకా కేశపరామృష్టంగా తిగుచుకు వచ్చినాడు. అక్కడ ఆ శరీరాన్ని పరిఘాకారంగా అడ్డంగా పెట్టివేసినాడు. భగవంతుడు ఇట్లా ఎందుకు చేశాడు? గతాసువు అయినవానిని ఇట్లా ఎందుకు అవమానపరిచినాడు? మిత్రులకు సంతోషం కల్గడంకోసం చేసినాడు. దేవతలకు సంతోషం కల్గడంకోసం చేసినాడు. కంసునియందు తనకు కోపము ఏమిటి? అతడు తనలో కలిసిపోయినాడు. అతని ఆత్మద్రవ్యము అనంతమైన తన ఆత్మలో విలీనం అయిపోయింది. ఎచ్చటినుండి వచ్చినదో, అచ్చట కంసుని ఆత్మ కలిసిపోయినది. భగవంతుడు అచ్చట పడివున్న కంసుని ముఖము చూచినాడు. ఆ ముఖమునందలి చిరునవ్వు చెదరనిదై మొదటనెట్టులో ఇప్పుడును అట్టులనే నిల్చివున్నది. 'భగవన్! నేను నీకోసము వైరియోగినైనాను. భయముతో సాధనచేసినాను. ప్రభూ! ఇప్పుడు నేను నీవైనాను. నీలో కలిసినాను.' అంటున్నట్లు ఆ మందహాసం భగవంతుని దృష్టిలో అవభాసించింది. ఆ కాలంలో అంతర్ధానగతమైవున్న కౌశికీదేవి మరల తన సౌమ్యరూపాన్ని ధరించింది. సర్వలోకసంతోషణకారి మధుర లాస్యహేలావేలయై తేలిపోయింది. భగవంతుడు తల పైకి ఎత్తి మిన్నును దర్శించినాడు. దేవతలు, ఋషులు ఆనందలహరీతరంగితులై వట్లు ఆడిపోతున్నారు. వారిని చూచి భగవంతుడు మృదుమధుర మందహాసం చేసినాడు. దేవతలు తలపెట్టిన మహాకార్యములలో ఒకటడు ఇప్పుడు పూర్తియైనది.

అప్పుడు శ్రీకృష్ణదేవుడు సమాజవాటాన్ని నవ్వుతున్న కన్నులతో తిలకించాడు. అప్పుడు ఆయనను చూచి సమాజవాటం అంతా అద్భుతం పడిపోయినది. కంసుని మరణమును చూచి అద్భుతం పడినది. ఒక్క నెత్తురుచుక్క కన్పించదు. కంసుడు విచిత్రమైన చావు చచ్చినాడు. ఆ చావు వారి అద్భుతమునకు విషయమైనది. ఆ అద్భుతపరాక్రమాన్ని చూచి యదువృష్ణ్యంధక గణక్షత్రియప్రకరం జయజయధ్వానాలుచేసింది. తనబిడ్డ ఏమిఅయినాడా అని తహతహను పొందిన దేవకి ఆనందమే ఆనందము. యశోద ఆనందమే ఆనందము. రోహిణి ఆనందమే ఆనందము. వారు కన్నులలో ఆనందముగా శ్రీకృష్ణదేవుని తిలకించారు. కంసమాత దుఃఖములో ఆనందమును పొందినది. ఆనందములో దుఃఖమునుఅనుభవించినది. శ్రీకృష్ణదేవుడు ఆ అంధ్యుని చూచినాడు. వసుదేవుని చూచినాడు. ఉగ్రసేనుని చూచినాడు. ఉగ్రసేనుని దుఃఖము ఘోరమై కన్పించింది. అంతలో శ్రీకృష్ణదేవుని చూపులు సునాముడు మొదలైన కంసుని సోదరులపై నిల్చినవి. వారు పొందిన దిగ్భ్రాంతి విడిపోగా శ్రీకృష్ణదేవునిమీదకు రాగా ఉంకిస్తున్నాడు. శ్రీకృష్ణదేవుడు బలరాముని దిక్కై చూచినాడు. తాను ప్రహర్ష ద్విగుణప్రభంగా వసుదేవుని దిక్కై నడచినాడు. ఆయన పాదములకు నమస్కరించినాడు. బలరాముడు సునామాదులను ఎదుర్కొనినాడు. శ్రీకృష్ణదేవుడు దేవకీదేవి వున్నయెడకు నడచినాడు. ఆమెపాదములకు శిరము అంటగా నమస్కరించినాడు. యశోదనుచూచి గలగలా నవ్వినాడు. "దేవకీ అమ్మగారు! మా యశోదను మీరు ఎరుగుదురా! వట్టి వేల" అన్నాడు. ఆ యశోదచుబుకమును పట్టియెత్తి "యశోదే! నీవు యెవ్వరుతకవు. వ్రేపల్లెలో పాలు, పెరుగు చేసికొనెడిదానవు. జానపదురాలవు. మేము నాగరికులము" అన్నాడు. రోహిణి నవ్వినది. "నవ్వండి! రోహిణీ తల్లీ! నవ్వండి! మా యశోదను చూడగా మీకు నవ్వు రానిది ఎప్పుడు?" అన్నాడు. "దేవకీ అమ్మగారు! మీరు ఈ జానపదురాలిని ఒకకంట కని పెడుతూవుండాలి. లేదో, నన్ను శిక్షిస్తుంది" అన్నాడు. యశోదకు యమళార్జునభంగోదంతము జ్ఞప్తికి వచ్చినది. "తండ్రీ! నీవు నన్ను మరిచిపోవు" అన్నది. ఆమె కండ్లలో నీరు నిలిచినది. రోహిణి కిలకిలా నవ్వింది. బలరాముడు సారంగయూథాన్ని పొదవిన సింహాన్ని పోలి సునామాదులను వధించివేసినాడు. కంసమాత "అయ్యో!" అన్నది. కన్నులను మూసికొన్నది. శ్రీకృష్ణుడు అప్పుడు ఆమెను చూచినాడు.

"తాత! నేను కంసునకు మాత్రమే శాపమును పెట్టినాను."

శ్రీకృష్ణుడు మందహాసం చేసినాడు.

"అవ్వా! బలదేవుడు సునామానాదులను సంహరించినాడు."

ఆమె మరి మాట్లాడలేదు.

సమాజవాటము కంసయోషితల దుఃఖాలాపవిలాపములతో నిండిపోయినది.

రామకృష్ణులమీద త్రిదశకరవిముక్తమైన కుసుమవర్షం కురిసింది. దివంలో దేవదుందుభులు మ్రోగాయి. మునుల ఆశీర్వాద నాదముల చేత, సిద్ధుల జయవచోనాదములచేత రోదసి అంతా మేదురం అయిపోయింది.

★



...ని"నిదానంగా పనులుచేయడం, నాకు అసహ్యం"

చిత్రకారుడు: ఎగ్గోని శ్యామసుందర్ (గుత్తి)



"నమస్కారమండీ" అని ఇద్దరూ ఒకే సారి అన్నారు. [illegible] రూములోనున్న రాజుగార్ని చూసి, కేశవరావు, కృష్ణారావు లిద్దరూను. రాజుగారు కుర్చీలోంచి [illegible] చూస్తున్నారు. ఎదురుగుండా నుంచున్న కృష్ణారావుని చూస్తున్నారు. ఒక్కసారి తప్పి [illegible] మీద కృష్ణారావు [illegible] చూస్తున్నారు.

రాజుగారు [illegible] కేశవరావుని [illegible] లేదు.

కృష్ణారావు, కేశవరావు, [illegible] [illegible] బయలుదేరుతున్నారు. [illegible] మీదంటున్నా, [illegible] వాళ్ళు.

రాజుగారు కృష్ణారావుకి [illegible] కంట్రాక్టరు. కంట్రాక్టు పనిమీద మద్రాసు వెడుతూ, పిల్లను చూచిపోదామని చూడటానికి వచ్చేరు.

"పనేమిటి, ఇలా [illegible]?" అన్నారు రాజుగారు.

ముగ్గురూ బాగానే [illegible] న్నారు.

"[illegible] [illegible] కదా. [illegible] [illegible]?"

"[illegible] [illegible] [illegible]" అన్నారు [illegible] [illegible] వాళ్ళు.

"[illegible]" అంటూ రాజుగారు కుర్చీలోంచి లేచి, "ఓకేయ్" అన్నారు. [illegible] విద్యావినయవిధేయతలతో వచ్చి కృష్ణారావు, [illegible] మాస్టరు [illegible] [illegible] [illegible] నిలబడ్డాడు.

రాజుగారు ఏదో ఆలోచిస్తూ [illegible] [illegible] కృష్ణారావు కేసి, "[illegible] [illegible] [illegible] పెళ్లి [illegible] [illegible] [illegible] [illegible] పెళ్లి సంబంధం [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] పెళ్లి [illegible] అమ్మాయిని [illegible] [illegible]. [illegible] [illegible] పనిపున్నమూలాన [illegible] [illegible]. [illegible], [illegible] [illegible] ఇంటికి వచ్చేస్తాను. అమ్మాయి వచ్చి వట్టి



యితే మేము పెద్ద వాళ్ళం మిగిలిన పనులు చూసుకుంటాం." అన్నారు.

రెండు నిమిషాలుండి ఏదో ఆలోచించి "మీరిద్దరూ కూడా వెళ్ళండోయ్" అని ఆజ్ఞ జారీ చేసేరు.

"అలాగే" అన్నట్లు తలలూపేరు, గిరి, రావులు.

"తిన్నగా వెళ్ళాలి సుమా" అంటూ, ఎందుకైనా మంచిదని, "మీరొచ్చేలోగా, నేనో వచ్చింతరువాత కనుక్కుంటాను," అన్నారు, వీరి ముగ్గురి సంగతీ తెలిసిన రాజాగారు, చిరుకోపంతో.

"అలాగేనండీ" అన్నారు.

రాజాగారు ప్రయాణసన్నద్ధులై వెళ్ళిపోయారు.

వీరి ముగ్గురికీ రాజాగారంటే ఓ విధమైన భయమూ, గౌరవమూను. వంటచే గదిలో మూడు పెద్ద నిట్టూర్పులు వినిపించేయి. గదిలో నిశ్శబ్దం ఆవరించింది. రావు, గిరి ఇద్దరూ ఏదో ఆలోచిస్తూ మంచంమీద కూర్చున్నారు.

ఓ పెద్ద మూలుగు.

గిరి, రావు లిద్దరూ కృష్ణకేసి చూసేరు.

మళ్ళీ ఓ నిట్టూర్పు.

"ఏరా, ఒంట్లో బాగో లేదంట్రా?" అన్నాడు రావు.

గిరి అన్నాడు "మంచి నీళ్లు పుచ్చుకుంటావా?"

ఇవేమీ తనను కాదన్నట్లు ఆలా శూన్యంలోకి చూస్తూ మళ్ళీ ఓ మూలుగు మూలిగి "ఓకేయ్, కొంచెం మంచం ఖాళీ చేసి యివ్వండ్రా. విశ్రాంతి తీసికోవాలి" అన్నాడు కృష్ణ తన బెడ్డింగు పరచుకోలేక.

గిరీ, రావు లిద్దరూ మంచంమీదనుండి లేవకుండా కృష్ణముఖం వంక ఒకసారి చూసి, మళ్ళీ కళ్లు మూసుకున్నారు.

"రారా, నా చిట్టితండ్రీ; వచ్చి పడుకో. విశ్రాంతి తీసికోవచ్చుగాని. నేను జోలపాట పాడతాను, నువ్వు నిద్రపోదువుగాని" అన్నాడు రావు కళ్లు మూసుకునే.

"ఓకేయ్, మీకు పుణ్యముంటుంది యీ స్థితిలో నన్ను చంపకండ్రా" అన్నాడు కృష్ణ, క్రిందపడబోతూ తలుపు పట్టుకొని నిలబడి.

రావు, గిరిలు పాకి తిన్నట్లు మంచంమీద నుండి లేచి కూర్చున్నారు.

"ఒరే! డాక్టరుగార్ని తీసుకు రమ్మంటావా?" అన్నాడు గిరి, కృష్ణ రావు

ఇంటర్వ్యూ

వాలకం చూసి.

"ఏమిట్రా ఆముఖం లంకణాలు చేసినవాడిలాగ! నిక్షేపంలా వెళ్ళి పిల్లను చూసి రారా అంటే, ఏడుస్తావేంట్రా?" అన్నాడు రావు.

"ఇది వేసవికాలం కాబట్టి ఏడుద్దామన్నా కళ్ళ వెంట నీళ్లు రావు. నీరు చెమట రూపంలో, ఆవిరి ఐపోతుంది గనుక, వీడి ముఖంబట్టి ఏడుస్తున్నట్లే లెక్క. ఏమంటావురా, రావూ?" అన్నాడు గిరి తనొక పెద్ద సైన్టిస్టులాగ.

"కరెక్ట్" అని "ఏమిట్రా నీ బాధ?" అనడిగేడు రావు.

తనబాధ చెప్పటం ప్రారంభించాడు కృష్ణ.

"ఒరేయ్. నా కిప్పుడు రెండు సమస్యలెదురయ్యాయిరా. ఫస్ట్ పాయింటు; నా కిప్పుడు పెళ్లి చేసికోవాలని లేదు. సెకండు పాయింటు; మా ఫుట్ బాల్ టీము కలకత్తా టోర్నమెంటుకి వెళ్లుతుంది, యీ వేళ సాయంకాలమే. నీకు తెలుసుగా. నేను దానిలో సెంటర్ ఫార్వర్డ్ని. అందుచేత నేను తప్పని సరిగా వెళ్లాలి. అందులోకీ కలకత్తా వెళ్లే ఛాన్సు యింక లైఫ్‌లో ఎప్పుడూ రాదు. వచ్చినా యింత హేపీగా వెళ్లటం జరగదు. ఈ రెంటిలో ఏదీ మానడానికి వీల్లేదురా. అన్నయ్య పెళ్ళి రారా అంటే వెళ్లాల్సిందే. చావరా అంటే చావాల్సిందే. పైగా కలకత్తా టోర్నమెంటుకి వెళుతున్నానంటే పబ్లిక్ పాత్‌లో పెట్టి అక్షింతలవర్షం కురిపిస్తాడు. ఇంక కలకత్తా ఛాన్సు వదులుకోడానికి వీల్లేదు. ఏం చెయ్యాలిరా, రావూ?"

"మహా, మహా ఈశ్వరుడే అనుభవించేడు యిటువంటి పరిస్థితుల్ని. హాలాహలాన్ని మింగలేక, బైటకు క్రక్కలేకనూ. మానవమాత్రుడైన, నీకొచ్చిందా! అందుచే నువ్వు కలకత్తా వెళ్ళొద్దు. విశాఖపట్నంవెళ్ళొద్దు. హాయిగా రూములోనే ఉండిపో నీకే గొడవా వుండదు" అన్నాడు గిరి, కృష్ణ ముఖంవంక చూస్తూ, నా సలహా బాగుందా అన్నట్లు.

"నువ్వూరుకోరా బాబూ! పుణ్యముంటుంది. కలకత్తా వెళ్ళొచ్చి నీకు కొబ్బరికాయ కొడతాను."

"ఈ ఆపదనుండి నువ్వే కాపాడాలిరా. నీకన్న ఆప్తులెవరు?" అన్నాడు కృష్ణ, రావు ఏదైనా ఉపాయం చెప్తాడా అని. ఇటువంటి సమయాల్లో రావు బుర్ర బ్రహ్మాండంగా పనిజేస్తుందని కృష్ణారావుకి నమ్మకం.

గిరి, కృష్ణ ముఖం వంక "నేనేం ఆప్తుణ్ణి కానా?" అన్నట్లు చూసేడు.

"అబ్బ వెధవ ఎండలు. దాహం మరీ ఎక్కువయిపోతుంది. ఈ ఎండలమూలాన," అన్నాడు రావు.

అనడమే తరువాయి కృష్ణ బైటకు పరుగెత్తాడు రావు దాహం తీర్చేందుకు. వాణ్ణి చూసి రావుకి నవ్వొచ్చింది. అవును మరి వాడవసరం. ఏం చేయమన్నా చేస్తాడు ఈ పరిస్థితిలో. ఆఖరుకి కాళ్లు పట్టమన్నా పడతాడు.

మూడు నిమిషాల్లో రెండు కూల్ డ్రింక్స్‌తో తయారయ్యాడు కృష్ణ. రావు మంచంమీదనుండి లేచి కూర్చుని కూల్ డ్రింకుని గుటకలు వెయ్యసాగాడు. మంచం మీద పడుకొన్న గిరి, గుటకల శబ్దం విని, ఓ కన్ను తెరచి గిరి వంక చూసేడు. నోటిదగ్గరనున్న కూల్ డ్రింకును చూడగానే రెండవ కన్ను వెంటనే తెరచుకుంది.

"నాకు కూడా ఏమైనా తెచ్చేవట్రా?" అన్నాడు గిరి రెండవ కూల్ డ్రింకును చూస్తూ.

కృష్ణ, సమాధానం చెప్పకుండా, రావు ముఖం వంక జాలిగా చూస్తున్నాడు.

రెండవ డ్రింకును కూడా ఖాళీ జేస్తాడేమోనని, "ఆలస్యం అమృతం విషము కాని" గబగబా రెండు గుటకలలో ఖాళీ చేసేడు గిరి.

మంచం మీద కూర్చున్న రావుకి, ఓ నోటుబుక్కు తీసికొని విసరటం మొదలుపెట్టేడు కృష్ణ. పావు గంట ఆలోచించాడు రావు. కాని ఏ ఉపాయమూ దొరకలేదు.

"ఒరేయ్! యీ అయిటమ్సులో ఏదో వకటి ఎగ్గొట్టేయ్" అన్నాడు రావు, ఏ ఉపాయమూ లేక.

"ఏదీ వొదులుకోడానికి వీల్లేదురా బాబూ. నీకు తెల్సుగా. బాబ్బాబు నీకు పుణ్యముంటుంది. వచ్చే జన్మలో నీకు ప్యూనుగా పనిజేస్తానులేరా. నీ ఋణం వుంచుకోనులేరా. ఆపద్బాంధవా, అనాథరక్షకా, ఈ దీనుణ్ణి రక్షించరా" అన్నాడు, నీవే నాకింక గతి అన్నట్లు.

"నీ భక్తుని మొరాలకించరా" అన్నాడు గిరి కళ్లు మూసుకునే.

"పోనీ కలకత్తా వెళుతూ విశాఖపట్నంలో రైలును దిగి పిల్లను చూసి, మళ్ళీ మీ టీముతో వెళ్ళిపో" అన్నాడు రావు.

"టోర్నమెంటుకి బయలుదేరుతూ, విశాఖపట్నంలో దిగి, మిగతా ప్లేయర్సుతో "నేను పెళ్ళికూతుర్ని చూసొస్తాను. అందాకా మీరిక్కడ వుండండి" అంటే అంచరూ కలసి నన్ను తన్నుతారు. అందులోకీ వేళగాని వేళ పెళ్ళిపిల్లను చూడ్డానికి వచ్చేను, చూపించండంటే వాళ్ళు మరీ తంతారు. అందుచేత ప్రయాణంలో లాభం లేదురా" అన్నాడు కృష్ణ.

"ఆ అమ్మాయి తరఫువారెవరైనా నీకు తెలుసునా?" అన్నాడు రావు.

"తెలీదు. వాళ్లెవరో నాకు తెలీదు. నేనెవరో వాళ్లకు తెలీదు."

రావు "ఊహూ" అని మంచం మీద పడుకొని - ళ్లు మూసుకొని ఆలోచిస్తున్నాడు. కృష్ణ విసరుతూనే వున్నాడు. ఒక పది నిమిషాలు పోయిన తరువాత, తను విసిరిన చల్లగాలికి, రావు నిద్రపోయేడేమోనని కృష్ణకు అనుమానం వచ్చింది. ఎందుకైనా మంచిది లేపితే అని "ఒరేయ్ రావూ!"

"ఊఁ" అన్నాడు రావు.

ఫరవాలేదనుకొని యింకా గట్టిగా విసరటం మొదలుపెట్టేడు కృష్ణ.

రావు ఒక్కసారి మంచం మీద లేచి కూర్చోవడం చూసి, ఏదో ఐడియా స్ట్రైక్ అయిందని, కొంచెం ముందుకు వంగాడు కృష్ణ, ఐడియా చెబుతాడని. అలా వంగిన కృష్ణ వీపు మీద తపీసుని ఒక్కటి కొట్టేడు రావు.

"ఏమిటో చెప్పరా?" అన్నాడు కృష్ణ వీపు తడుముకుంటూ.

"ఒరేయ్; నువ్వు కృష్ణారావుగాడివి" అన్నాడు రావు గిరి నుద్దేశిస్తూ.

విపరీతంగా ఆలోచించిన మూలాన రావుగాడి బుర్ర గిరెక్కిందనుకున్నారు యిద్దరూను.

ఎందుకైనా మంచిదని "నేను గిరిని, వీడు కృష్ణ, నువు రావువి" అన్నాడు గిరి రావు వంక చూస్తూ.

"ఏడిశావ్. ఆమాత్రం తెలివి నాకూ తగలడింది. వెధవల్లారా! ఆ మాత్రం ఐడియా లేదేంరా మీకు!" అన్నాడు రావు యిద్దరి వంకా చూస్తూ.

గిరి, కృష్ణలు వకరి ముఖం వకరు చూసుకున్నారు. వీళ్లకు తన ప్లాను దెలియలేదనుకొని చెప్పడం ప్రారంభించేడు రావు.

"ఒరేయ్! కృష్ణా నువ్వు మామూలుగా ఫుట్ బాల్ టోర్నమెంటుకి కలకత్తా మా టీముతో బయలుదేరి వెళతావు. మన గిరి విశాఖపట్నం వెళ్ళి పెళ్ళికూతురిని చూచి వస్తాడు. ఎలా వుంది మన ప్లాన్?" అన్నాడు రావు.

కృష్ణ ముఖం పద్మంలాగ వికసించింది.

"బ్రహ్మాండంగా వుందిరా ఐడియా. టు బర్డ్స్ ఫర్ వన్ షాట్" అన్నాడు కృష్ణ సంతోషంతో, "తరువాత ఓ కార్డు మీద నాకు యీ పిల్ల నచ్చలేదని, ఓ గీత గీసి పారేస్తే, యీ పెళ్ళి సమస్య తెంపరెరీగా తీరిపోతుందిరా" అన్నాడు మళ్ళీ.

"ఒరే నాన్నా! తగ్గరా తగ్గు. అప్పుడే నీ తరపున పెండ్లి చూపులకు వెళ్ళినట్లు, అంతా అయిపోయినట్లే మాట్లాడుతున్నావ్!" అన్నాడు గిరి.

"ఒరే బాబ్బాబు. నీకు పుణ్యముంటుందిరా. నీఋణం వుంచుకోనులేరా. అందాకా నా నామధేయం తగిలించుకోరా" అన్నాడు కృష్ణ.

ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు ముఖం పెట్టి "నాయనా! నాకిప్పుడు పెళ్ళి చేసికోవాలని లేదురా" అన్నాడు గిరి.

"ఒరేయ్ చిట్టి తండ్రీ! ఇప్పుడు యీ పోర్షను నీ పెళ్ళి గురించి కాదులే. అయినా నువ్వు ఏకన్యకామణికీ నచ్చవు. ఒక వేళ ఏ అమ్మాయి అయినా నీకు నచ్చినట్లతే, ఆ అమ్మాయిని నీ కివ్వరు, నీ అందం చూసి" అన్నాడు రావు గిరిని.

"నాకు ఒరిజినల్ బ్యూటీలేదా? పర్సనాలిటీలేదా! అంత యిదిగావున్నానా?" అనుకున్నాడు గిరి.

క్రిందపడవేసిన నోటుబుక్కు తీసుకొని మళ్ళీ గిరికి విసరటం మొదలుపెట్టేడు కృష్ణ.

"శిష్యా! నాలో ఒరిజినల్ బ్యూటీగాని, పర్సనాలీగాని లేవా?" అన్నాడు గిరి, కృష్ణవంక చూస్తూ.

"లేకేంగురూ. తమకన్నీ వున్నాయి. మీ కన్న యీ పదునాల్గు లోకంబులలో సుందరాకారుడెవరూ లేరు గురూ?" అన్నాడు కృష్ణ విసరుతూనే.


"అవును శిష్యా, ప్రౌను. లెస్స బలికితివి" అన్నాడు గిరి.

గదిలో కొంచెంసేపు నిశ్శబ్దం ఆవరించింది.

గిరి ఏదో ఆలోచిస్తున్నాడు. కృష్ణ విసరుతూనే వున్నాడు.

"విసరుతూ "ఒరేయ్ గిరీ! చిన్నప్పటి నుండీ నువ్వూ నేను జతకాదూ?"

"కాదు. చిన్నప్పుడే నన్ను కొట్టేవు ఇదిగో చూడు మచ్చ" అని గిరి తనచేతిమీద



చిత్రకారుడు: సోము శేఖర్ రెడ్డి (ఆదోని)

చిన్న మచ్చను చూపించేడు.

తన ఫస్ట్‌పాయింటే ఫలించలేదని కొంచెం కంగారు పడ్డాడు కృష్ణ.

"బోర్డు స్కూల్లో చదువుతున్నప్పుడు, ఒక కారు డ్రైవరుని నువ్వు రాయిపుచ్చుకొని కొట్టినప్పుడు వాడు, నిన్ను తరుముకొస్తుంటే, నిన్ను మా యింట్లో దాచి వాడినుండి కాపాడేను కదట్రా!"

"ఏం! అయితే."

"ఒరేయ్! నువ్వు హై స్కూల్లో ఒకమ్మాయి జడపట్టుకొని లాగినప్పుడు, ఆ అమ్మాయి హెడ్‌మాస్టరుతో కంప్లయింట్ చేయడానికి వెళ్తుంటే, నే నామెకు ఏదో సర్ది చెప్పి పంపించేసేను కదరా!"

"అ.యి.తే"

"ఒకసారి నువ్వు, మీయింట్లో కోపగించి వచ్చినప్పుడు మా యింట్లో వున్న వారం రోజులూ, నేను నీకు భోజనం పెట్టించి జతగా వున్నాను కదూ. కోపం తగ్గిపోయిన తరువాత మీ నాన్నా అదీ పిలవకుండానే పిలవకుండానే నువ్వు వెళ్ళి పోయేవనుకో!"

"అ...యి...తే"

గిరి పూర్తిగా మెత్తబడ్డాడు. ఇది గ్రహించిన కృష్ణ తన ఆఖరు అస్త్రం ప్రయోగించాడు.

"ఒరేయ్! మనం మొన్న నావ షికారు కెళ్ళినపుడు, నువ్వు క్రికెట్ బాల్ తో కొంగను కొడితే పడిందని నావమీద గంతులు వేస్తే, నావ వరిగి మనమందరం నీటిలో పడినప్పుడు నువ్వు దమ్ము వచ్చి యీదలేకపోతే, నేను హెల్పు చేసి నిన్ను రక్షించేను కదరా!" అన్నాడు.

"స్టాప్! స్టాప్! ఆగు. ఆగమన్నాను కదరా. వప్పుకున్నాను. ఇంక నీ దండకం చాలు" అన్నాడు గిరి లొంగిపోయినట్లు.

"ఘనకార్యం సాధించేను కదా" అని ఒకసారి గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు కృష్ణ.

"ఒరేయ్! నేను చేయవలసిన పనేమిట్రా?" అన్నాడు గిరి, యింతకుముందేమీ తను వినుపించుకోనట్లు.

ఏం చేయవలసిందీ అంతా చెప్పేడు రావు, గిరికి.

"నేను ఒక్కడనే వెళ్లనురా" అన్నాడు గిరి.

"నేనుకూడా వస్తానులే" అన్నాడురావు, నేనుండగా నీ కొచ్చిన భయమేమిటన్నట్లు.

తను బ్రతిమాలకుండానే వెళతానన్నందుకు 'ఎంత త్యాగమూర్తివిరా' అన్నట్లు చూసేడు కృష్ణ, రావుముఖం వంక.

"అయినా, పెండ్లి చూపులకు వెళ్తేమంటే, ముసలమ్మల దగ్గరనుంచి, ఒకటో క్లాసు చదివే కుర్రాడి దాకా సవాలక్ష ప్రశ్నలు

 మార్గశిరంబున  మామిడిపళ్లా

ఇది కాదుర మంత్రం 

ఐతే మిడ్‌లాండ్  తంత్రం

ఐస్‌క్రీమ్ 

లేదాసుష్లే  మిశ్రమభాగ్యం

రసభరితంబౌ

రుచి మిక్కిలి భోగ్యం 

Midland

మిడ్‌లాండ్—రుచికరమైన 28 రకముల, పళ్లు, కాయగూరలు. జామ్‌లు, జెల్లీస్, అండ్ కెచప్.

తయారు చేయువారు: మిడ్‌లాండ్ ఫ్రూట్ అండ్ వెజిటబుల్ ప్రాడక్ట్స్ (ఇండియా) మథురా

MIDLAND

సోల్ డిస్ట్రిబ్యూటర్లు : కార్న్ ప్రోడక్ట్స్ కొ. (ఇండియా) ప్రైవేట్ లి., బొంబాయి

భారతదేశంలో ఏజెంట్లు : ప్యారీ అండ్ కంపెనీ లిమిటెడ్.

వేస్తారు. వాటిన్నిటికీ ఎవరు సమాధానాలు చెప్తాడు?" అన్నాడు గిరి విసుగ్గా.

గిరికి ప్రశ్నలూ, జవాబులంటే (ఇటువంటి విషయాల్లోనే. పరీక్షల్లో తప్పవనుకోండి) చిరాకు.

"నేను నీకూడా వుంటాను కదట్రా. ఏదొచ్చినా, నే చూచుకొంటాను."

"సరే. వస్తాను కాని నేను, నీకూడా ఓ కీలుబొమ్మలాగ వుండడంవరకే. నన్ను శేషగిరి నని చెప్పినా సరే నీ యిష్టం." గిరి వప్పుకున్నందుకు కృష్ణముఖం మీద మందహాసరేఖలు చిందులు త్రొక్కేయి.

అన్నగారిచ్చిన అడ్రసు కాగితం రావుకిచ్చి, కృష్ణ ఆ వేళ సాయంత్రమే కలకత్తా ఫుట్ బాల్ టీముతో వెళ్ళిపోతాడు, తను తిరిగివచ్చే వరకూ, విశాఖపట్నం వెళ్ళొచ్చి తమ రూములో వుండాలని షరతు పెట్టి.

ఆ మర్నాడు వుదయమే గిరి, రావులు విశాఖపట్నం బయలుదేరేరు. ట్రైనులో ప్రయాణం చేస్తున్నంతసేపూ గిరి గుండెలు దడదడ కొట్టుకుంటూనే వున్నాయి ఏం జరుగుతుందోనని. తిన్నగా తమ దగ్గరనున్న అడ్రసు ప్రకారం మూర్తిగార్ని కలుసుకొన్నారు. మూర్తిగారు వుభయులనూ మర్యాదచేసి, కుశల ప్రశ్నలు వేసేరు.

"నీవేనా, నాయనా రాజుగారి తమ్ముడువి?" అన్నారు మూర్తిగారు గిరినిచూస్తూ.

"ఔనండీ" అన్నాడు గిరి.

ఈలోగా పెళ్ళి కూతురి తండ్రి అయిన ఇంజనీరుగారింటికి కబురు పంపించారు మూర్తిగారు, పిల్లను చూడ్డానికి వస్తున్నారని. మధ్యాహ్నం భోజనాలు మూర్తిగారి యింటివద్దే అయ్యేయి. సాయంకాలం మూర్తిగారు, గిరి, రావులు ముగ్గురూ ఇంజనీరు గారింటికి బయలు [illegible] ఎదురు చూస్తునని

"అయితే యిప్పుడు మనం యింటర్వ్యూల్లో జరపడానికి వెళుతున్నామన్నమాట" అన్నాడు గిరి మెల్లగా రావుతో మూర్తిగార్కి వినిపించకుండా త్రోవలో.

"అవును" అన్నాడు రావు నవ్వుతూ.

ప్రయాణాలకి ముందువచ్చే యీ ఎదురుల గురించి మూర్తిగారు యింజనీరుగారింటికి వెళ్ళేవరకూ లెక్చరు కొడుతూనే వున్నారు.

గిరిమాత్రం చాలా నీటుగా డ్రెస్ చేసుకుని టిప్‌టాప్‌గా తయారయ్యేడు, తను ఇంజనీరుగార్కి కాబోయే అల్లుడనని.

ఇంజనీరు గారింట్లో తమకోసం ప్రత్యేకింపబడిన కుర్చీల్లో గిరి, రావులు కూర్చున్నారు. ఇంట్లో వాళ్లు వేసిన ప్రశ్నలకన్నిటికి ఓపిగ్గా జాగ్రత్తగా జవాబు లిస్తున్నాడు రావు. గిరిమాత్రం తనకివేమీ సంబంధంలేనట్లు దిక్కులు చూస్తూ గదినంతటినీ పరిశీలిస్తున్నాడు. ఔను మరి. నిజానికి వప్పందం అంతేగా.

ఇంటర్వ్యూ

ఇంతవరకు ఒక్క మాటైనా మాట్లాడని గిరిని చూసి ".ఏమండి కృష్ణారావుగారూ" అన్నారు ఇంజనీరుగారు.

గిరి జవాబు చెప్పలేదు. తన పేరైతే నే కదూ వెంటనే జవాబు చెప్పడానికి.

"ఒరేయ్ కృష్ణా నిన్నేరా!" అన్నాడు రావు మెల్లగా గిరివంక చూస్తూ, గిరి వులిక్కిపడి "ఆ! నన్నేనా!! ఏమండీ?" అన్నాడు.

"ఏమి టాలోచిస్తున్నావు నాయనా?" అన్నారు ఇంజనీరుగారు.

"ఈ మేడమీదేనా? ఈ రేడియో మీదేనా లాంటివి" ఏమైనా అడిగితే, సమాధానం చెప్రుదామని.

"ఆ! ఆ! ఏమీ లేదండి" అన్నాడు గిరి.

ఇంతలో ఒకమ్మాయి కాఫీ, ఫలహారాలతో ప్రత్యక్షమయింది. గిరీ, రావు లిద్దరూ ఒకేసారి చూసేరు ఆ అమ్మాయిని.

ఇదిచూసి యింజనీరు గారు "ఈమె మా రెండో అమ్మాయి, స్కూలు ఫైనలు చదువుతోంది" అన్నారు.

"అలాగాండీ!!" అన్నాడు గిరి, తనకు తెలీదే అన్నట్లు చిరునవ్వుతో.

కాఫీ, టిఫిన్లు తీసికోవడం పూర్తయ్యేయి.

ఇంతలో ఒక అమ్మాయిని, ఆమె తల్లి కాబోలు మెల్లగా తీసికొచ్చి సోఫాలో కూర్చొబెట్టి ప్రక్కన కూర్చుంది.

"అమ్మాయిల్ని క్రిందకూర్చొపెట్టే రోజులుపోయి, సాగరికతా చిహ్నంగా సోఫాల్లో కూర్చొబెడుతున్నారన్న మాటని" అనుకున్నాడు గిరి మనసులో.

గిరి, రావులు ఆమెను చూసేరు. చాలా అందంగా వుంది. చాలా ఏమిటి. అప్సరసలా వుంది. గిరి ఆమెవంక రెప్పవేయకుండా, తనకళ్ళను, ఎంత పెదవిగా చేయగలడో అంత పెద్దవిగానూ చేసి ఆమెను చూస్తున్నాడు:

ఆమె అందానికి గిరి మూర్ఛపడిపోతాడేమో ననీను, లేక ఆ అమ్మాయిని చూసి "దాహం? దాహం?" అంటాడేమోననీను, ఎందుకైనా మంచిదని, రావు ఒక మంచినీళ్ల గ్లాసును తనదగ్గర పెట్టుకున్నాడు గిరివాలకం చూసి.

రెండు నిమిషాలు పోయిన తర్వాత "ఏమైనా ప్రశ్నలడగండి" అన్నారు. ఇంజనీరుగారు గిరితో.

గిరి నోటమ్మటమాట రావటం లేదు.

గిరిస్థితి గ్రహించి రావు "ఆ, అవేమీ అక్కరలేదు లెండి" అన్నాడు.

ఈ మాటలను మాత్రం గిరి వినిపించుకొన్నాడు. "ఇంత అందమైన అమ్మాయితో ఒక్కమాటైనా మాట్లాడాలనుకొన్నాడు" గిరి మనసులో అయినా యిటువంటి చాన్సు మళ్లీవస్తుందో, రాదో అని.

గిరి ఒకసారి గొంతు సవరించుకొన్నాడు.

రావుకి భయమేసింది. ఒకవేళ గిరి పరాగ్గా "నువ్వు ఏకాలేజీ కుర్రాడినైనా ప్రేమించేవా?" అని అడుగుతాడేమోనని. గిరికి ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనే సిద్ధాంతం కొంచెంవుంది.

"మీ పేరేమిటండీ?" అన్నాడు గిరి ఆ అమ్మాయివంక చూస్తూ యింటర్వ్యూ జరిపే ఆఫీసరులాగ ముఖంపెట్టి.

ఆ అమ్మాయి ముఖంవున్న పొజిషన్ లోంచి కొంచెం క్రిందికి దిగింది సిగ్గుతో.

"కాలేజీ కుర్రాళ్లకేసి మహాధైర్యంగా చూసే యీ అమ్మాయిలు, యిటువంటి పరిస్థితులలో యింత సిగ్గుపడతారేమిటి? ఇది కూడా ఒక అభినయం కాబోలు" అనుకున్నాడు గిరి మనసులో, బైటకు అంటే తంతారేమోనని.

"చెప్పమ్మా". అన్నది ప్రక్కన కూర్చున్నావిడ.

"సర్వసారు" అన్నది ఆ అమ్మాయి మృదుమధుర స్వరంతో మెల్లగా.

"సర్వసారు. సర్వసారేంటి సాంబారులాగ. సరే పెళ్లి చేసుకున్న తరువాత పేరు మారుద్దాంలే" అనుకున్నాడు.

"వీడికి యింతధైర్యం ఎక్కడెనుండి వచ్చింది? చెప్మా" అని ఆశ్చర్యపడ్డాడు రావు. అయినా ఏ అసందర్భ ప్రశ్న లడుగుతాడో అని భయపడుతూనే వున్నాడు.

"అమ్మాయితో మాట్లాడేసేను. చాలు" అనుకొన్నాడు గిరి తృప్తిగా.

కెప్టెను సముద్రంలో మునిగిపోతూంటే ఒకనావికుడు అతణ్ణి రక్షించాడు. "థ్యాంక్స్! రేపు పెరేడ్‌లో అందరిముందూ నా కృతజ్ఞత తెలుపుకొంటాను." అన్నాడు కెప్టెను కృతజ్ఞతతో.

"బాబ్బాబు! యీ సంగతి మాత్రం చెప్పకండేం! మీరిలా చెప్పారంటే వాళ్ళంతా కలసి ముందు నన్ను సముద్రములో పారేస్తారు" అన్నాడా నావికుడు.

బి. శ్రీనివాసులురెడ్డి (తిరుపతి)

మిగిలిన విషయాలు వీళ్లుఅడక్కపోయినా ఇంజనీరుగారే, చెప్పేరు. తమ అమ్మాయి ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషను గురించి వగైరా, వగైరా.

అమ్మాయిని లోపలికి తీసి వెళ్ళిపోయేరు.

"ఏం నాయనా. అమ్మాయి నచ్చినట్లేనా?" అన్నారు ఇంజనీరుగారు గిరిని.

"ఓ నచ్చింది" అనబోయిన గిరి కాలుకి "నోగు ముయ్యరా" అని సౌంజ్ఞ చేసింది రావుబూటుకాలు జేబుల్రకింద.

కాలుతాపుకి "అమ్మో" అనబోయి నోటికి జేబుగుమాలు అడ్డం పెట్టుకున్నాడు గిరి.

ఇంటర్వ్యూ

"అవన్నీ యింటికెళ్ళిన తరువాత పెద్దవాళ్ళతో వ్రాయిస్తాము కదండీ" అన్నాడు రావు ఇంజనీరుగారివద్ద, మూర్తిగారివద్ద శెలవు తీసికొంటూ.

ఇద్దరూ తిరిగి తమరూములోకి వచ్చేసేరు.

అమ్మాయిని చూసిందగ్గరనుండి, ఆ అమ్మాయి అందంగురించే వర్ణిస్తూ వచ్చేడు గిరి, రావుతో.

"వీడికి ప్రేమపిచ్చి పట్టేందికాబోలు" అనుకున్నాడు రావు.

ఒక వారంరోజులలో కలకత్తానుండి తిరిగి వచ్చేడు కృష్ణరూముకి. ముగ్గురూ కలసి వాళ్ల వూరికి వెళ్ళిపోయేరు. అమ్మాయి నచ్చలేదని కృష్ణ అన్నగారితో చెప్పాడు.

నాలుగురోజులు తిరక్కుండానే గిరి చిన్నాన్నగారి అబ్బాయి పెళ్ళికి రాజమండ్రి వెళ్ల వలసి వచ్చింది. ముగ్గురూ బయలుదేరేరు సకుటుంబ సమేతంగా. మూర్తిగారు, ఇంజనీరుగారుకూడా పెళ్లికి వచ్చేరు ఆడపిల్ల తరఫున. మూర్తిగార్కి గిరితండ్రి రెడ్డిగారు తెలుసును. మూర్తిగారు యింజనీరుగార్కి,

రెడ్డిగారిని పరిచయం చేసేరు. కొంతసేపటికి ముగ్గురూ లోకాభిరామాయణంలో పడ్డారు.

ఇంతలో కృష్ణ, గిరిఇద్దరూ గదిలో కాలు పెడుతూ, వీళ్లను చూడగానే గిరి గుండె ఒక క్షణకాలం పనిజేయడం మానేసి, మళ్లీ యధావిధిగా పనిజేయడం మొదలుపెట్టింది. కృష్ణమాత్రం ధీమాగా ముందుకు వడిచేడు, ఎదురుగుండా వున్నవాళ్లలో రెడ్డిగారు తప్ప మరెవరూ తనకు తెలియకపోవటంవల్ల.

గిరి 'వెనక్కు వెళ్ళిపోదామా' అనుకుని వెనక్కు తిరిగేడు.

"ఒరేయ్" అన్న రెడ్డిగారిపిలుపు విని, అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి కృష్ణ ప్రక్కన నిలబడ్డాడు. కృష్ణకు పీడిచేష్టలు ఏమీ అర్థంకాలేదు.

ఇంజనీరుగారు గిరి ముఖంవంక చిరునవ్వుతో చూస్తూ, "ఏమండీ కృష్ణారావుగారూ, కులాసాయేనా?" అన్నారు.

గిరి, ఇంజనీరుగార్కి, ఏడుపుకాని నవ్వొకటి పారేసేడు.

"మా అబ్బాయి మీకు తెలుసునాండీ?" అన్నారు రెడ్డిగారు ఇంజనీరుగార్ని.

"అదేమిటండీ. యితను రాజాగారి తమ్ముడు కృష్ణారావు కదండీ!" అన్నారు యింజనీరుగారు, గిరి నుద్దేశిస్తూ.

"ఇతను మా అబ్బాయి. పేరు శేషగిరి," అన్నారు రెడ్డిగారు గిరివంక వ్రేలుపెట్టి చూపిస్తూ. "ఇతనూ రాజాగారి తమ్ముడు. కృష్ణారావు" అన్నారు రెడ్డిగారు కృష్ణారావుని చూపించి.

కృష్ణకి, గిరికిపైన చొక్కాలు తడవలేదుగాని, లోపల బనీన్లుమాత్రం పూర్తిగా తడిసిపొయినయ్.

ఇంజనీరుగారు, మూర్తిగారు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ఆశ్చర్యంతో.

రెడ్డిగారికి కిదేమీ అర్థంకాలేదు.

"మొన్న అమ్మాయిని చూడటానికి వచ్చినప్పుడు, యితనే కృష్ణారావునని చెప్పుకు వచ్చేడు" అన్నారు మూర్తిగారు, గిరిని చూపిస్తూ.

అప్పుడర్థమైంది కృష్ణారావుకి వీళ్ళెవరో, గిరి కంగారుపడడానికి కారణమేమిటో?

"వీళ్లేదో ఘనకార్యం చేసే"రనుకున్నారు రెడ్డిగారు.

ఇంతలో రావు, గదిలోకి అడుగుపెడ్తూ, వెనకజేసివున్న కృష్ణ, గిరిలను, ఎదురుగుండా వున్న వాళ్లనుచూసి రైట్ ఎబౌట్ టరన్ కొట్టి మెల్లిగా బైటకు జారుకున్నాడు.

"ఏమిట్రా యిది? నిజమేనా?" అన్నారు రెడ్డిగారు కోపంతో.

ఒక్కడికీ నోటమ్మట మాట రావటంలేదు. ఇటువంటి సమయాల్లో 'ఆ రావుగారైనా వుంటే బాగుండును రా' అనుకున్నారు యిద్దరూ మనసులో.

రావు బైటకువెళ్ళి, ఓ చిన్నవుపాయం ఆలోచించుకొని, మళ్లీ గదిలోకి అడుగుపెడ్తూ "నమస్కారమండీ" అన్నాడు యింజనీరుగార్ని చూస్తూ.

"ఇతను కూడా మీ అబ్బాయితో కలసి వచ్చేడండీ" అన్నారు యింజనీరుగారు రెడ్డిగారితో.

"ఏమోయ్, మా శేషగిరి; కృష్ణారావు పేరుతో వీరమ్మాయిని చూడటానికి వెళ్ళేడా?" అన్నారు కోపంగా.

"మీరిలా ఓమారు రండి. అంతా వివరంగా చెబుతాను" అన్నాడు రావు కోపంగా ఒకసారి రావు ముఖంవంక చూచి, లేచివచ్చేరు రెడ్డిగారు.

"ఏం కొంప మునిగిపోతుందోనని" కృష్ణ, గిరిలుభయపడుతూనే వున్నారు.

ఈ ఆపదనుండి కాపాడమని గిరి మనస్సులో ఏడుకొండలవాడ్ని తలచుకొంటున్నాడు.

గది బైటకు తీసికొచ్చిన రెడ్డిగారితో, రావు "మీరిలా కోప్పడరాదు. నే చెప్పేది కొంచెం సావధానంగా వినాలి." అని ఒక్క విసుక్కుం...

"అసలు, అమ్మాయిని చూద్దామనే మేం ముగ్గురం కలసి విశాఖపట్నం వెళ్ళేము. విశాఖపట్నం వెళ్ళిన ఒకగంటకు కృష్ణకు కడుపులో విపరీతమైన నొప్పివచ్చింది. వాడిని హాస్పిటలుకి తీసికెళ్ళి, వాడినొప్పి తగ్గేంతవరకూ అక్కడే వున్నాము. తరువాత ముగ్గురం కలసి బయలుదేరదామనుకున్నాము. కానీ డాక్టరు 'ఇప్పుడు పేషంటు కదలడానికి వీల్లేదనీ, కనీసం ఒక రోజయినా కదలకూడదనీ, అలా కదిలినట్లయితే మళ్లీ నొప్పివస్తుందనీ" అన్నాడు. దానికి కృష్ణారావు "ఒకే మీరిద్దరూ వెళ్ళి పిల్లను చూసిరండి. ఎలాగూ నాకిప్పుడు పెళ్లి చేసికోవాలని లేదు. తరువాత ఎలాగూ యీ పిల్ల నాకు నచ్చలేదని మా అన్నయ్యతో చెప్పేస్తాను. అలా వెళ్ళి నేను పిల్లను చూసినట్లు హాజరుపట్టీలో గీత గీయించుకోకపోతే, మా అన్నయ్య దగ్గరనుండి మంగళహారతులు వస్తాయి. రేపూ, ఎల్లుండి కూడా మంచిదిలేదు. అందుచేత పిల్లను చూడనివ్వరు. ఈలోగా మా అన్నయ్యవచ్చి మనం వెళ్ళిందీ లేందీ కనుక్కుంటాడు. ఇలా నాకు నొప్పివచ్చి వెళ్ళలేకపోయేమని, నిజం చెప్పినా, మీరు వెళ్లకుండా నాటకమాడుతున్నారంటాడు. అందుచే యివాళే మీరిద్దరూవెళ్ళి చూసిరండి" అన్నాడు. సరే అని మనగిరి, నేనువెళ్లి ఆ అమ్మాయిని చూసేము. "అందులోకీ యిప్పుడు మీరు గిరికి పెళ్లిచేసే వుద్దేశంలో కనబడుతున్నారు. ఈ అమ్మాయి మనగిరికి నచ్చింది. కాబోయే మామగారు, ఇంజనీరుగారు బోలెడంతఆస్తి వుంది. పైగా, మనవాడి స్టడీస్ అయిపోగానే వారే స్వయంగా వుద్యోగం యిప్పిస్తామన్నారు. మన సంబంధమంటే కళ్లకద్దుకొని చేసుకుంటారు. ఇటువంటి సంబంధం మనకు మళ్ళీ ఎప్పుడోగాని దొరకదు. ఆలోచించండి" అంటూ ఏకధాటిగా గుక్క త్రిప్పుకోకుండా లెక్చరిచ్చాడురావు తన వాగ్ధాటికి తనే ఆశ్చర్యపోయేడు "భేష్; ముందుముందు పెద్దపెద్ద సభలలో ఉపన్యసించవచ్చు" అనుకున్నాడు.

ఇదంతా రెప్పవేయకుండా వింటున్న రెడ్డిగారు ఐదు నిముషాలసేపు ఆలోచించి "సరేరా అబ్బాయ్! మేము, మేము పెద్దవాళ్లం అన్నీ ఆలోచించుకుంటాము. అయినా ఇటువంటి వెర్రివేషాలు ఇంక ముందెప్పుడూ వెయ్యకండి. వీలైతే సంబంధం స్థిరపరచుకొంటాను" అన్నారు.

"ఆల్ రైట్" అన్నాడురావు రెడ్డిగారంతటివారినే బుట్టలోవేసేననే గర్వం కొంచెంవచ్చి.

వీళ్లు యింతసేపటినుండి ఏం మాట్లాడుకుంటున్నారో కృష్ణకి, గిరికి అర్థంకాలేదు. ఒకవేళ రావునిపట్టుకు తిడుతున్నారేమో. తమకుకూడా వీళ్ళదరి సముఖాన చివాట్లు వస్తాయేమోనని భయపడుతున్నారు.

"వెధవ నీమూలాననేరా యింతగొడవ జరిగింది" అన్నట్లు కోపంగా కృష్ణముఖంవంక చూసేడు గిరి.

"నేనేం చేసేనురా? ఆరావుగాడే చేసేడిదంతాను నాతప్పేమీలేదు." అన్నట్లు ముఖంపెట్టేడు కృష్ణ.

రెడ్డిగారు, రావుయిద్దరూ కలసివచ్చేరు గదిలోకి. వస్తూనే "ఏదో కుర్రతనంగా ప్రవర్తించేరు వెధవలు. మీరు క్షమించాలి" అంటూ "చేసినపని చాలు. ఇకమీరు బైటకు పొండి" అన్నారు రెడ్డిగారు, రావు ముఖంవంక చూస్తూ, పెళ్లివిషయాలు మాట్లాడటానికి.

"బ్రతికేంరా బాబూ" అంటూ బైటపడ్డారు ముగ్గురూ.

"నీయింటర్వ్యూ సక్సెస్‌రా" అన్నాడు రావు గిరితో.

"అంటే" అన్నాడు గిరి అమాయకంగా తనకేమీ అర్థంకానట్లు ముఖంపెట్టి.

"అంటే నువ్వు ప్రతిరోజూ స్మరించే ఆకోమలాంగి, నీఅర్ధాంగి కాబోతున్నదిరా" అన్నాడు రావు.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు కృష్ణ గిరివద్ద షేక్‌హేండు తీసికుంటూ నాచాన్సు నీకిచ్చేసేనన్నట్లు చూస్తూ.

మందహాసంతో చిందులు త్రొక్కింది శేషగిరి ముఖారవిందం. ★

తండ్రి: ఏమిటిరా గోపీ! మీఅమ్మతో అదేపనిగా గంటల తరబడి వాదిస్తున్నావ్?

గోపి: అదే నాన్నా... పెద్దవాళ్ళతో అదేపనిగా వాదించకూడదనే...

మిస్టర్ జోరావ్ (విజయనగరం)

చీకటి జారింది.

గాలి నిలిచిపోయింది ఎందుకో! ఆఫీసుకు వెళ్ళిన జనం ఏనాడో ఇళ్ళకు చేరుకున్నారు. ముష్టి డెబ్బై రూపాయలకోసం, సీతాకోక చిలుక లాంటి మనసును చంపుకున్న యంత్రాలు మాత్రం బరువుగా అడుగులు వేస్తూ, ఏదో గొణుక్కుంటూ, పిచ్చిగా చేతి వేళ్ళతో గాలిలో గీతలు గీస్తూ, కదలి పోతున్నాయి.

ఆ గుంపులో వెంకట్రావుకోసం కళ్ళు పెద్దవి చేసుకుని సీత వెదికింది. తన్ను కూాప గించి దృష్టిపథంనుండి ఎలా తప్పించుకో గలడు? లోతుకుపోయి ఎర్రబడ్డ కళ్లు – నిర్ల క్ష్యంగా పెరిగిన గడ్డం– అసహ్యంగా వంక రలు తిరిగి ఎముకల్ని వెదికే శరీరం. సాను భూతిగా సన్నబడ్డ కాళ్లు చేతులు – అలా కృంగి కృశించిపోయిన వెంకట్రావు సీతకంట బడకుండా ఎలా తప్పించుకోగలడు?

సీత నిట్టూర్చింది తనకు జ్ఞాపకశక్తి కంటూ వుంటే, వెంకట్రావు ఏడు గంటలు దాటినా ఇంటికి రాకపోవటం ఇదే మొదటిసారి. ఏమైందో ఏమో!...ఒకవేళ సూపరింటెం డెంటు మరో రెండు గంటలు వుండి పొమ్మ న్నాడేమో! ఇంటో నూరువంతుల నరకం అనుభవించే దానికంటె, ఆఫీసులో సగం రుచి చూడటం మరుగని గుమాస్తాలు సంతో షంతో పడేనంటారు. కాని వెంకట్రావు అలా కాదు. ఈ జీవితానికి హృదయాన్ని దూరంగావుంచి భార్యనూ, పిల్లల్నీ ప్రేమిం

చాడు. ప్రతి అణ
సృష్టించాడు. కా
వుండదు.

చీకటి భూమిని
లక్ష్మి కెవ్వుమంది.
లుగా ఒకటే జ
కొనేందుకు ముం
చేయాలి. వైరాగ్
యివ్వకపోతే డా
వెంకట్రావు సాయ
నన్నాడు. మరీ మ
మతిమరుపు ఇంక
విషాదంగా నవ్వుత

సావిత్రి అరుగు

'అమ్మా! నాని
గింది. సీత మరో
చూసింది. ఒం
బాధగా నవ్వింది
వచ్చు. హిమాలయ
కాని రామం?...

సైకిలుగంట
కుంది. సీత వుల



మారిన మనసులు

ఆర్.యం.చిదంబరం

...కరిగించి జీవనగంగ
...అరదులో నీరుమాత్రం

...వుచ్చులా బిగించింది.
దానికి మూడురోజు
...ం. మంచి మందులు
...ఆలోచనలు
...చిట్కాలు ఫలితం
...వంక చూడాలి.
...తం మందు తీసుకొస్తా
...పకంచేస్తే 'అంతటి
...రాలేదు' అన్నాడు

...మీద కొచ్చింది.
...కా రాలేదా?' అనడి
...వీధి చివరిదాకా
...రిగావున్న దీప స్తంభం
...అన్నింటినీ సహించ
...మీద విరిగిపడ్డాసరే—
...పెద్ద సమస్య—
...(మోగి, వూరు
...లేచి నిలబడింది.

వెంకట్రావు మిత్రుడు నర హరి సైకిలు దిగి రెండు మెట్లెక్కాడు.

'వెంకట్రావు ఏదో పని వుండి అర్జంటుగా బెజవాడ వెళ్ళాడు. సాయంత్రం బీచి దగ్గర కనపడి, ఈ సంగతి మీతో చెప్పమన్నాడు. అనుకోకుండా వెళ్ళవలసి వచ్చింది కనక ముందుగా మీతో చెప్పలేకపోయాడు. అతను ఎప్పుడు వచ్చేదీ తెలియదు.'

సీతముఖం నల్లబడింది. బెజవాడలో తనవారెవరూ లేరే?

'ఏదైనా ఆఫీసు పనిమీద వెళ్ళారా?' అనడిగింది. చీకట్లో ఆమెముఖాన్ని చూట్టానికి ప్రయత్నిస్తూ 'అబ్బే! అలాంటి దేమీలేదు. అవునుసుమండి, ఆపనేమిటో నేను అడగనూ లేదు. అతను చెప్పనూలేదు' అన్నాడు సైకి లెక్కి పదిగజాలు వెళ్ళాక తిరిగి వచ్చాడు.

'మర్చిపోయాను సుమండి. ఈకవరు మీ కిమ్మన్నాడు! అంటూ ఏదో కవరందిచ్చాడు.

'ఏదైనా వుత్తరమై వుంటుంది' అనుకునేలోగాఅతనే చెప్పాడు.

'తిరిగి వచ్చేదాకా అవుసరానికని యాభై రూపాయలున్నాయి అందులో. అతను వెళ్లి పోయిన పదినిమిషాలక్కాని ఆ కవరుచించి చూడాలన్న ఆలోచనకలగనేలేదు. గుడ్డిదీపం వెలుతుర్లో చూస్తే అయిదు పదిరూపాయలనోట్లు వాటిని చుట్టేసుకున్న తెల్ల కాగితం ముక్క. అందులో పదిపంక్తులు. సీత చదువుకుంది.

'నేను చేస్తున్నపని ఎంత ప్రమాదకరమైందో—తెలివితక్కువైనదో — నాకంటె ఎవరికీ తెలియదు. కాని ఈ పరిస్థితుల్లో మనిషన్న వాడు ఏం చేయగలడో అదే చేస్తున్నా. ఏవేవో జరుగుతాయనుకున్నా- నిజం-ఏవేవో జరిగాయి. కాని అనుకున్నట్టు కాదు. రామం బాగుపడతాడను కున్నా. అతన్ని మనిషితో ఎలా పోల్చటమో అర్థం కాకుండా వుంది. వాడి భవిష్యత్తు నన్ను బాధిస్తోంది. నేను ఆత్మహత్య మాత్రం చేసుకోను. భయపడకు—మంచిభవిష్యత్తు కోసం వెదుకుతున్నా - అదిక్కడ దొరకదు - దొరకగానే తిరిగి వస్తాను. అందాకా ధైర్యంగావుండు. నువ్వేడుస్తానని తెలుసు- కాని ఏం చేయను?'

అదీ వెంకట్రావు చేసిన ఘనకార్యం — సీత నీడను చూశాననుకుంది. కానది, నీడకాదు — నిజస్వరూపం! సావిత్రిని లక్ష్మినిచూడగానే గుండె తరుక్కుపోయింది. ఏడుపు గొంతుచించుకొని వస్తోంది. కూతుళ్ళిద్దరికి వెలుగు చూపించాలి. ఎలా? పుట్టింటి వారెవరూ లేరు. వేలువిడిచిన తమ్ముడున్నాడు. అతనికి తను జ్ఞాపకం వుండక పోవచ్చు. ఉత్తరప్రత్యుత్తరాలు లేవు. రెండేళ్ళనుంచీ కాకినాడలో వున్నాడు. ఇప్పుడెక్కడున్నాడో!

దీపం కాంతి తగ్గిపోయింది. కిరసనాయిలు పోసి వత్తి పెద్దదిచేసింది.


'అమ్మా!అన్నయ్యయినారాలేదే?'...అని వాపోయింది సావిత్రి. లక్ష్మి మళ్ళీలేచి కొంతసేపు ఏడిచి నిద్రపోయింది. గోడువినే వారెవరూ లేరు.

వెంకట్రావుతో సీత పెళ్ళై సరిగ్గా ఇరవై సంవత్సరాలైంది. అప్పటికి ఆమెవయసు పధ్నాలుగు సంవత్సరాలు. ఏళ్ళతరబడి కట్టుకున్న గాలిమేడలు తళతళ మెరిశాయి. లోపలంతా చెత్తా చెదారం. వెంకట్రావు జీతం డెబ్బైరూపాయలు- దాన్నే ఏడువందలుగా భావించుకున్నారు. రామం పుట్టాడు. చూట్టానికి బాగుంటే చాలా మరి?...గారాబంతో మొదట్లో వూరుకున్నా, అతని అల్లర్లు అవధిదాటాయి. తిట్లు, దెబ్బలు మితాయుండలు — కొంతమందికి అతనంటే భయం. కొందరికికోపం, కొందరికిఅసహ్యం, కొందరికి జాలి-కాని జాలిపడేవారు తక్కువ—

'ఇకముందు ఏం చేయాలి?' అనిసీత ఆలోచిస్తూకూర్చుంది.భర్త ఎప్పుడువస్తాడో- అసలు వస్తాడో రాడో తెలియదు. రామం మీదే ఆశలు పెట్టుకోవాలి. అతన్ని మంచి దారికి తీసుకురాటానికి యత్నించాలి. అతను తల్చుకుంటే ఇలాంటి వంద కుటుంబాల్ని పెంచగలడు. కాని ఆతలపు మొక్క వేయాలికదా!

రాత్రి పదైంది. చీకట్లో నక్షత్రాలు దీపాలు పట్టుకుని చందమామకోసం వెదకుతున్నాయి. లక్ష్మి మరి లేవలేదు. సావిత్రి నాన్నకోసం ఎదురుచూసి నిద్రపోయింది. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ రామం వచ్చాడు. అమ్మను చూడగానే ఆగిపోయాడు.

అయిదున్నర అడుగులఎత్తు. నిర్లక్ష్యంగా వదిలేసిన చింపిరిజుత్తు - భయంలేకుండా చూసేకళ్ళు - మాసిపోయిన పంట్లాం - చొక్కా - చొక్కాకు అక్కడక్కడ చిరుగులు.



'రామం!...ఇలారా!' అంది సీత.

రామం మౌనంగావచ్చి ఆమె కెదురుగా కూర్చున్నాడు. అమ్మముఖం వుబ్బి, కళ్లు రెండూ ఎర్రబడి, చెంపలమీద నీటిచారలుండటం అతను గమనించాడు. కాని అందుకు కారణం అడిగేందుకు వ్యవధి లేదు. రేపటి కార్యక్రమంగురించి రాత్రంతా ఆలోచించుకుని పథకం వేసుకోవాలి. అందుకేవున్న కాలం చాలిరాడక చస్తోంది.

'వేళకు ఇంటికి రమ్మని నీకెన్నిసార్లు చెప్పాను? పొద్దున్న పదింటికి వెళ్ళావు—ఇంతసేపూ ఎక్కడ తిరిగావ్? చెప్పరేం జా ఇదే ప్రశ్న, నేనూ, మీ నాన్నా వేస్తున్నాం- ఒక్కనాడైనా నువ్వు జవాబివ్వలేదు'

'అమ్మా! నాన్న కనిపించరేం?' అన్నాడు ప్రశ్నకు జవాబివ్వక.

నాన్నవుంటే ఈపాటికి కుంభవృష్టి అవును.

సీత ధైర్యం దిగజారింది, వెక్కి వెక్కి ఏడుస్తూ ఆ వుత్తరం అందిచ్చింది. ఆ వుత్తరం చదువుకున్న అతనిముఖంలో ఎలాంటిమార్పు కలగలేదు.

'అమ్మా! ఈమాత్రందానికి ఏడుస్తున్నావా...నాన్న ఏం రాశాడనుకున్నావ్? ఇక్కడ జీతం చాలటంలేదు కనక ఎక్కడికో వెడుతున్నానన్నాడు. డబ్బు దొరకగానే తిరిగి వస్తానన్నాడు. అంతేగా! నువ్వు వట్టి పిచ్చిదానివి.'

'నిజమేకావచ్చు!...కాని అందాకా మనల్ని ఎవరు పోషిస్తారు? డబ్బెక్కడిది? కష్టాల్లో ఆదుకునే బంధువులూ, స్నేహితులూ ఎవరూ మనకులేరు. ఈ స్థితిమాచి నవ్వేందుకుమాత్రం కోట్లకొలది జనంవున్నారు.'

రామం లేచి నిలబడ్డాడు...

'అదేమిటమ్మా!... ఇలా చూడు! నేను లేనూ? నీ కొడుకు రామంవుండగా ఎందుకు దిగులు? అంతా నేను చూసుకుంటాను. నువ్వేం భయపడకు. నాకు బుద్ధొచ్చింది. ఇంతకాలం ఏం తెలియకుండా తిరిగినందుకు సిగ్గుపడుతున్నా- నన్ను క్షమించమ్మా!'

సీత అతనికేసి ఆశ్చర్యంగా చూసింది. అతనిమాటలు నమ్మాలో, నమ్మకూడదో ఆమెకు తెలిసిందికాదు.

ఉన్నట్టుండి లక్ష్మిలేచి ఏడుపు సాగించింది. ఎంత సముదాయించినా ఊరుకోలేదు. సావిత్రికూడా మేలుకుంది.

'అన్నయ్యా!... త్వరగా దయచేసినట్టున్నావు!' అంది ఆవులిస్తూ.

'రామం? ... ఇలా వూరుకుంటే లాభంలేదు - వళ్ళు చురుక్కుమంటోంది. ప్రమాదిస్తే ఏం చేసేది? వెంటనే వెళ్లి ఆ డాక్టరుగార్ని పిల్చుకురా. ఆయన రానంటే సరేనని తిరిగి రాకు. నాన్నగారు వూళ్లోలేరని, పరిస్థితి ప్రమాదించిందని బతిమాలు- తెలిసిందా?"

రామం సరేనని బయలుదేరాడు. వీధి గుమ్మందాకా వెళ్లి తిరిగివచ్చాడు.

'అమ్మా! ఒకవేళ ఆయనేదైనా ఇంజక్షనుమందు కొనమంటే ఏంచేయటం? డబ్బు లేదుగా!"

'పదిదాటాక మందుల షాపులు మూసేస్తారు. ఆ సంగతి నీకు తెలియకపోయినా ఆయనకు తెలుసు. ఆయనే మందు తెస్తారు. తరువాత బిల్లు చెల్లించవచ్చు" అంది సావిత్రి అతన్ని అనుమానిస్తూ.

"అబ్బ!...ఈ డాక్టర్ల సంగతి నీకు తెలియదు సావిత్రీ! ఏదైనా వంక బెట్టి రానంటారు. అర్ధరాత్రయినా సరే! మందుల దుకాణం తెరిపించేశక్తి నాకుంది. అదంతా నేను చూసుకుంటాను" అంటూ ఓ పది రూపాయలకాగితం తీసుకునివెళ్లాడు. సీత నిట్టూర్చింది. సావిత్రి ఏమిటో గొణుక్కుంది. గడియారంముల్లు చకచకా కదిలిపోయింది. రెండుగంటలదాకా చూశారు. రామం రాలేదు. పొరపాటు అనుకున్నదంతా పొరపాటు.

* * *

ఉదయం ఏడుగంటలకు రామం తిరిగి వచ్చాడు.

"అమ్మా! రాత్రి నేను వెళ్లేసరికి ఆయన ఇంటిదగ్గరలేడు. ఎక్కడికో వెళ్ళారుట. రాత్రంతా అక్కడ జాగరంచేశాను. పదిగంటలకు వస్తానన్నారు. ఎలావుంది చిన్నిచెల్లాయికి?" అంటూ ఆప్యాయంగా నుదుటిమీద చేయుంచి ఛటుక్కున వెనక్కి తీశాడు. నిప్పుకణికెలా వుంది.

"అన్నయ్యా!...ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. ఎలా?" అనడిగింది సావిత్రి.

రామం అనుకోకుండా ఆమెకేసి చూశాడు. పధ్నాలుగేళ్లునిండినా యౌవనం వికసించలేదు. ముఖంమీద విషాదమే కాని ఆనందంలేదు. చిరిగి కుట్లుకొడుక్కున్న బట్టలు. వెంకట్రావు సంపాదన దేనికి సరిపోతుంది? పోషణవుంటే చెల్లాయి ఎంత అందంగా వుంటుందో రామం వూహించగలడు.

"దానికేం? నాన్న ఇచ్చిన డబ్బులో నలభైరూపాయలున్నాయిగా!"

సీత వంటింటోంచి బయటకువచ్చింది.

'నిన్నటి పదిరూపాయలు ఏమయ్యాయి? సావిత్రి సామాన్లు చెబుతుంది కొనుక్కురా' రామం నవ్వుకున్నాడు. వెర్రివాళ్ళు కాకపోతే ఆపదిరూపాయ లింకా కూర్చున్నాయనుకుంటున్నారు.

"అరెరె!...చెప్పటం మర్చిపోయాను సుమా! నిన్నరాత్రి డాక్టరుగారింటి అరుగుమీద కునికిపాట్లుపడుతూకూర్చుంటే ఎవరో చెక్కేశారు. నాసొమ్ము దొంగ తన్నుకు

పోవటం ఇదే మొదటిసారి. మీకసలు ముఖం చూపకూడదనుకున్నాను..."

మరో పదిరూపాయలు తీసుకుని సావిత్రి చెప్పిన సామానులు గుర్తుంచుకుని వెళ్లాడు.

"అమ్మా! వాడిమాటలు నమ్మవద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను? వాడిమీద నీకెందుకింత ప్రేమ? అసలు రామం చెడిపోటానికి నువ్వే కారణం. నాన్న వాడికి జడిసే పారిపోయాడు. ఓపికతో సరిదిద్దాలని చూశాడు. మనిషన్న తరువాత కాస్తో, కూస్తో సిగ్గంటూ వుండక్కర్లేదూ? అదీ లేదు-తిండికిమాత్రందున్న పోతులా తయారు" సావిత్రి ఆవేశంగా చెప్పుకుపోయింది.

'సావిత్రీ! నోరు మూసుకో! నీకంటె నాకు బాగా తెలుసు. ఏదో ఒక నాడు వాడు బాగుపడతాడన్న ఆశ నాకుంది.' సీత కళ్ళు నీటితో నిండిపోయాయి.

ఇది సావిత్రికి కొత్త కాదు. వెంకట్రావు వున్నప్పుడు రోజూ ఇదే రభస. రామం చదువు సెకండుఫారంలో ఆగిపోయింది. ప్రతి రోజూ ఎవరో ఒకరు అతన్ని గురించి ఫిర్యాదు చేసేవారు. మేష్టరు చేతులు వాచేలాగ బెత్తంతో కొట్టేవారు. స్కూల్లో ప్రతి పిల్లాడితోనూ జగడాలు. ఒకటి రెండుసార్లు చిన్న దొంగతనాలు చేసేసరికి స్కూల్లోంచి 'డిస్‌మిస్' అయ్యాడు. దాంతో అతని భవిష్యత్తు తలుపులు మూసుకుంది. ఏదైనా పని చేసుకు బతుకుదామన్న ఆలోచన అతనికెన్నడూ కలగలేదు. ఎవరికీ తెలియకుండా ఇంట్లోంచి డబ్బు తీసుకుపోవటం అతనికి కరతలామలకం. వెంకట్రావు తను నేర్చిన విద్యలన్నీ ప్రయోగించి చూశాడు. లాభం లేకపోయింది. పొద్దున్నే లేవగానే వుంటే కాఫీ తాగి పూరంతా తిరిగి ఏ ఒంటిగంటకో ఇల్లు చేరుకోటం - అన్నం తినిపోతే మళ్లీ రాత్రి పది - పన్నెండుకో రావటం. అదీ అతని దైనందిన కార్యక్రమం. ఎక్కడకు వెడతాడో - ఏం చేస్తాడో ఎవరికీ తెలియదు.

'బాధ్యత నెత్తిమీద పడితే బాగుపడతాడనుకున్నా - ఇంతేనా?' అనుకుంది సీత.

కాకినాడలో వున్న తమ్ముడికి సంగతులు వివరిస్తూ సీత వుత్తరం రాసింది. అయిదు రోజుల తరువాత జవాబు వచ్చింది. జరిగిన దానికి సానుభూతిగా పది పంక్తులు - తన కష్టాల సారాంశం అయిదు పంక్తులు. అంతే వుత్తరం. మర్నాడు పాతిక రూపాయల మనియార్డరు వచ్చింది. సమయానికి రామం హాజరయ్యాడు.

'అన్నయ్యా! కిందటిసారి వెచ్చాలు తెమ్మని పది రూపాయలిస్తే, సొమ్ము స్వాహా చేసి కోమటి కొట్లో అప్పు తెచ్చావా?'

రామం సావిత్రికేసి చిరాగ్గా చూశాడు.

'ఎవరు చెప్పారు నీకు? అంతా శుద్ధ అబద్ధం.'

'అవును. నువ్వు చెప్పింది అబద్ధమే! నిన్న నేను వెడితే షావుకారే అంతా చెప్పాడు.'

'అమ్మా! నాకో ఇరవై రూపాయలు అర్జంటుగా కావాలి.' అన్నాడు సావిత్రి కేసి చూడకుండా.

'దేనికి? ఇదేమన్నా రాజాగారి ఖజానా అనుకున్నావా?'

'మనియార్డరు రావటం కళ్లారా చూశాడు కదే అమ్మా!' అంది సావిత్రి.

'అబ్బే! నాకు మాత్రం కష్టసుఖాలు తెలియవా ఏమిటి? అలా ఎందుకడుగుతాను? ఇంత కాలం చదువు-సంధ్య, పని - పాటా లేకుండా తిరిగానా మరి! ఇప్పుడు బుద్ధొచ్చింది.'

'అసలు నీకు బుద్ధిరానిదెప్పుడు?' అని ఖండించింది సావిత్రి.

'అడ్డుపుల్ల వేయకు. ఇలా ఎంత కాలం మీకు భారంగా ఉంటాను? హైస్కూల్లో వైర్‌లెస్ కోర్సు మొదలుపెట్టారు. ఆరు నెలలు ట్రెయినింగ్ మొదట్లో ఇరవై రూపాయలు కట్టాలి. ఆ తరువాత ఫీజులేదు. చదివి ప్యాసవుతే వందరూపాయలు జీతం-అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలి?'

'వంద దమ్మిడీలు సంపాదించలేవు!' అంది సావిత్రి.

'నీ మాటలు నేను నమ్మను!' అంది సీత.

రామం రుజువు చేయటానికి పూనుకున్నాడు. ఆ కోర్సుకు సంబంధించిన పుస్తకాలు చూపించాడు. సావిత్రివద్దంటున్నా సీత ఇరవై రూపాయలిచ్చింది.

అంటే, ఆరునెలలదాకా రామం సంపాదిస్తాడన్న ఆశను దూరంగావుంచాలి. ఇరుగు పొరుగు అమ్మలక్కలు ఆమె పరిస్థితి చూసి జాలిపడి ప్లీడరుగారింట్లో వంట పని కుదిర్చగా. నెలకు ముప్పైరూపాయలు జీతం. తను ఎవరికోసం జీవిస్తున్నదో ఆలోచించి తేల్చుకో లేకపోయింది. సావిత్రికి చదువులేదు. తెలివితేటలుంటేమాత్రం డబ్బులేనప్పుడు పెళ్ళెలా చేయటం? ఇల్లు కదలి ఎరుగని సీత తల వంచుకుని పనికిపోతుంటే చూడలేక సావిత్రి కుమిలి కుమిలి ఏడ్చింది. రామం తనకేమీ పట్టనట్లు ఏవో పుస్తకాలతో తిరిగేవాడు. దైనందిన కార్యక్రమంలో ఎలాంటి మార్పు లేదు.

ఆ రాత్రి రామం వుషారుగా వచ్చాడు.

'అమ్మా!...శుభవార్త!' అన్నాడు.

పనిచేసి అలసిపోయి వచ్చిన సీత ఏమిటన్నట్లు చూసింది.

'చెల్లాయికి మంచి సంబంధం తీసుకొచ్చాను. రాజాలాంటి సంబంధం.'

సీత మౌనంగా వుండిపోయింది.

'అదేమిటమ్మా! నీకు సంతోషంగా లేదూ?'

'ముందు వివరాలు చెప్పు.'

'గ్రేట్!...నాన్న పనిచేసే ఆఫీసులో హెడ్‌క్లార్క్. చాలా మంచివాడు. డెభ్భై వంతులు అంతా సిరపడిపోయింది. నువ్వు సరేనంటే పదిరోజుల్లో పెళ్ళి. అబ్బ! ఇన్నాళ్ళుగా ఎంత బాధపడ్డాననుకున్నావ్? ఇప్పుడు కొంత మనశ్శాంతి.'

'ఛీ! నోరుముయ్! అతనికి యాభై ఏళ్ళు దాటాయి. నాకు బాగా తెలుసు. చెట్లలా ఎదిగిన కొడుకులు. కూతుళ్ళు, సావిత్రిలాంటి చిన్నపిల్లను ఆ ముసలాడికివ్వాలని ఎలా అనగలిగావ్? నీకు సిగ్గులేదూ? ఈ పెత్తనం నిన్నెవరు నెత్తిన వేసుకోమన్నారు? నీ దారి నువ్వు చూసుకుంటే మాకు పదివేలు-నువ్వు చెప్పేలా చేసే దానికంటె పీక పిసికి అవతల పారేస్తాను. ఇకముందెప్పుడూ నా ముందు ఇలాంటి మాటలనకు' అని కసిరికొట్టింది సీత.

రామం ఛటుక్కున లేచి వీధిలోకి వెళ్ళిపోయాడు.

సీత గతుక్కుమంది.

'వీడు కూడా మీ నాన్నలా...' అంటూ ఆగిపోయింది.

'ఊరుకోమ్మా!...ఆకలవుతే అతనే తిరిగి వస్తాడు.' అని వూరడించింది సావిత్రి. కాని అలా జరగలేదు.

రామం రెండురోజులదాకా ఇంటి ముఖం చూడలేదు. సీత ఆందోళనపడసాగింది. మూడోనాడు మధ్యాహ్నం నరహరి వచ్చాడు.

'వెంకట్రావు సంగతేమైందో తెలిసిందా?' అనడిగాడు.

'లేదు...మీకు?' అంది సీత.

'ఏమీ అంతు చిక్కటంలేదు. ఆఫీసుకూడా ఏ సంగతీ తెలియజేయలేదు. ఉద్యోగం రాజీనామా చేశాడేమోనంటే, అందుకు ఆధారాలులేవు. మిమ్మల్నడిగితే ఏదైనా తెలుస్తుందనుకున్నాను నేనూ

వరాలమూట

పి. గణపతిశాస్త్రి

చిలకా! ఒకపరి చెప్పరాదటే
చెలువునితో ఈ మాట!
కలకాల మ్మెదలో దాచినదీ
తళుకుల వరాల మూట!
చెలితో కులికెదు గాసి వినుమొక
పలుకే! మాట! మాట!
పులకండము పెట్టెదనే ముద్దులు
గులికే కెంపుల నోట!
చిలకా! ఒకపరి చెప్పరాదటే!
చెలువునితో ఈ మాట!

ప్రయత్నిస్తున్నా...'

నరహరి ఏదో అనటానికి ప్రయత్నిస్తూ రెండు నిమిషాలు గడిపాడు.

'ఒక్క సంగతి చెప్తాను. మీ మనసుకు బాధ కలిగిస్తుందని నాకు తెలుసు. అయినా దాచిపుంచటం శ్రేయస్కరం కాదు. మీ రామం ఏం చేస్తున్నాడో తెలుసా?' ఎందుకో భయపడుతూ ఆగాడు.

'తాగి తందానా లాడుతున్నాడు. నా కళ్ళతో చూశాను. పేక, జూదం కూడా ఆడుతున్నాడని విన్నాను. చెప్పి చూడండి. వింటే అదృష్టం-పాపం! వెంకట్రావు మనసు విరిగింది-ఫలితం చిక్కలేదు-'

సీత అలాగే గుమ్మానికి జారబడి కళ్ళు మూసుకుంది. నరహరి అన్నదంతా ఆమె ముందే వూహించుకుంది. కళ్ళు తెరిచి చూసేసరికి అత నక్కడలేదు. సావిత్రితో ఈ మాట చెప్పకూడదనుకుంది. రాత్రి పన్నెండు.

గడ్డ కట్టుకుపోయిన నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఎవరో తలుపుతట్టారు. రెండు నిమిషాలకు నలుగురైదుగురు మనుష్యులు రామాన్ని మోసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టారు.

'తాగి ఎవరితోనో తగాదా పెట్టుకున్నట్టున్నాడు. తన్ని నేల పడేశారు. దిక్కులేకుండా పడుంటే మోసుకొచ్చాం-' అని వచ్చిన మనుష్యులు వెళ్ళిపోయారు. సీత పరీక్షగా చూసింది. బట్టలనిండా మట్టి. బురద-నుదుటిమీద-మోచేతులమీద గాయాలు-రక్తపు జీరలు ఎర్రగా, భయంగా కనిపించాయి. మత్తులో ఉన్నాడేమో, పరిసరాల్ని గుర్తించే స్థితిలో లేడు. సావిత్రి దూరంనుండి చూస్తూ నిలబడింది. సీత 'టపీ టపీ' మని తల నాలుగుసార్లు మంచానికేసి కొట్టుకుంది. ఆమె చేయగలిగినదంతే.

* * *

అలవాటులేని పనిచేస్తే శరీరం తిరగబడుతుంది. బండచాకిరీ చేస్తూవచ్చిన సీత రెండు నెలల్లో జ్వరంతో మంచం పట్టింది. సరైన పోషణ లేక కృశించిపోయిన శరీరం దాంతో

మారిన మనసు

మరీ బలహీనమైపోయింది. ఇంటో లేచి పదడుగులు తిరిగేందుకూడా ఓపిక లేకపోయింది. వంటపనే ఆధారం-ఎన్నాళ్ళు వెళ్ళకుండా వుండగలదు? రామం ఏది పట్టించుకోడు - చివరకు తెగించి సావిత్రే వెళ్లింది. అలా సవ్యంగా సాగితే, కోలుకున్నాక సీతే వెళ్లేది - కాని అనుకోకుండా ఆ సంఘటన జరిగింది.

ఆ సాయంత్రం రామం ఇంటికి వచ్చేసరికి అమ్మ మంచంమీదపడి మూలుగుతోంది. సావిత్రి ఓ మూల పడుకుంది. ఆ భయంకర నిశ్శబ్దం అతన్ని ఆలోచనలోకి విసిరి వేసింది.

"అమ్మా!...ఎలా వుంది వంటో?... చెల్లాయి పనిలోకి వెళ్ళలేదా?"

"లేదు. వాళ్ళతో ఏదో గొడవైంది. మానుకుంది."

"అరె!...అలా మానుకుంటే ఎలా? మన జీవనాధారం అదేకదూ! త్వరగా లేచి వెళ్ళమను."

'ఈమాట అనేందుకు నీకు సిగ్గులేదూ? ఆడదాని సంపాదనమీద బతుకుతున్నావు. ఆ ప్లీడరు కొడుకు ఏదో అన్నాడట."

రామం పకపకనవ్వాడు.

"ఓస్! అంతేకదా!...ఆమాత్రం దానికి పని మానుకుంటారా?"

సీత గుండె కుతకుతలాడింది. ఆమెలో సహనం నశించింది. పిశాచంలా ఆవేశం ఆవరించింది. తనకొడుకు మానవత్వాన్ని కూడా మర్చి స్వార్థంతో ఒక పైపోయాడనేసరికి ఆమెవళ్ళు మరచింది. గబగబవెళ్లి చెంపలు రెండూ చెళ్లుచెళ్లు మనిపించింది.

"అంతేకదాని తేలిగ్గా అంటున్నావా? నీకు అభిమానం ఏమూలనైనా వుందా? దాని చేయిపట్టుకులాగాడు-ఇంకా ఏమేమో అన్నాడు. డబ్బిస్తానన్నాడు. చాలా? ఇంకా చెప్పమంటావా? అది ఏడుస్తూ వచ్చింది" అనరిచింది.

"నిజంగానా!...చెల్లాయిని అంతపని చేశాడా?...వుండు, వాడిపొగరు అణిచేస్తాను. తల బద్దలుకొడతాను. కసిదీర నరికేస్తాను" అంటూ లేచాడు రామం. నిద్రపోతున్న ఏవో ప్రచండశక్తులు మేల్కొన్నాయి. మహాప్రవాహంలా ముందుకురకమన్నాయి.

సీత గుమ్మానికడ్డంగా చేతులు బారచాపి నిలబడింది.

'ఆగు, అదో ఘనకార్యం కాదు. అలా చేయటంవలన ఎవరికీ లాభం లేదు. నువ్వు జైలుకు వెడతావు. మేం తలెత్తుకుని బతకలేం. అసలు మనవంశంలో ఎవరూ ఇంతవరకూ గుమ్మం దిగలేదు. ఉన్నదానితో గుట్టుగా, మర్యాదగా బతికారు. మీనాన్నగారూ నేనూ ఇరవై సంవత్సరాలు అలా జీవించాం. నీమీద ఆశలు పెట్టుకున్నాం. కాని మా నోట్లో మట్టికొట్టావు. అందుచేత నోరు మూసుకుని పడివుండు. నీమగతనాన్ని చూపటానికి ఇది సరైనమార్గం కాదు.'

రామం తలవంచుకుని బయటకు వెళ్లిపోయాడు. సీత అతన్ని అడ్డు పెట్టలేదు. తిన్నగా పార్కుకుపోయి ఒమూలగా కూర్చున్నాడు. అమ్మమాటలు చెవుల్లో పదేపదే వినిపిస్తున్నాయి. ఏడుపు ముంచుకొచ్చింది. తనివితీర ఏడ్చాడు. తల బాదుకున్నాడు. పిచ్చివాడిలా జుత్తు పీక్కున్నాడు. ఈ ఇరవై సంవత్సరాలు వృధాగా దొర్లిపోయాయి. బాధ్యతారహితంగా, ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించటంవలన తను, నాన్న, అమ్మ, చెల్లాయి అందరూ నాశనమవుతున్నారు. నాన్న అప్పుడే తెరవెనక్కి వెళ్లిపోయాడు...ఛీ! తనబతుకు ఓ బతుకు కాదు. చచ్చిపోదామనుకున్నాడు. లేచి పదడుగులు ముందుకువేసి మళ్ళీ వెనక్కి వచ్చాడు. చస్తేమాత్రం ఎవరికష్టాలు గట్టెక్కుతాయి? ఏత్యాగంచేసినాసరే, తప్పును సరిదిద్దుకోవాలి. ఏవేవో నిర్ణయాలు చేసుకున్నాడు. పథకాలు వేసుకున్నాడు.

పదిగంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. మామూలుగా గిన్నెలో వున్న అన్నం వడ్డించుకుని తిన్నాడు. దండెం మీదున్న పంట్లాం, చొక్కాలలో మంచివాటి నేరుకున్నాడు. ఉతికి ఆరేశాడు. మర్నాడుదయం చెంబులో నిప్పుకణికలువేసి ఇస్త్రీ వేశాడు. ఎవరితోనూ మాట్లాడలేదు.

అతనిలో పరివర్తన వచ్చిన మాట నిజం. అయితే ఆలస్యమైంది. చదువు లేదు. టెక్నికల్ క్వాలిఫికేషన్ ఏదీ లేదు. తను ఏ వుద్యోగానికి దరఖాస్తు పెట్టుకోవాలో తెలిసింది కాదు. మూడు రోజులు వరుసగా తిరిగి చూశాడు. ప్రతివారిని అడిగాడు. బతిమాలాడు. ప్రయోజనం లేకపోయింది. నాలుగో నాడు మధ్యాహ్నం ఆకలితో ఏదో హోటల్లో

వెళ్ళి కూర్చున్నాడు. అక్కడే అతనికోసం అవకాశం కాసుకూర్చుంది.

'మీరు ఇష్టం వచ్చినట్లు కేకలేస్తే పడుండాల్సిన అవుసరం నాకు లేదు. ఈ ముష్టి వుద్యోగం నాకక్కర్లేదు.' అంటూ సర్వరు బిల్లు పుస్తకం, పెన్సిలు టేబిలుమీద దుంచాడు. హోటలు యజమాని అతని జీతం ఇచ్చేసి దయచేయమన్నాడు. అంత క్రితం ఆ ఇద్దరి మధ్యా జరిగిన సంఘర్షణ రామానికి తెలియదు కాని, ఆ హోటల్లో ఓ సర్వరు పని ఖాళీ వుందని మాత్రం తెలుసు. తిన్నగా వెళ్లి తన పరిస్థితులు వివరించి ఆ ఉద్యోగం తనకిమ్మనడిగాడు. పది నిమిషాలు ఏవేవో ప్రశ్నలు కురిపించి, సగం మనసుతో పాతిక రూపాయలకు అతన్ని నియమించాడు యజమాని.

మర్నాటినుండి పనిలో చేరతానని రామం ఇంటికి వచ్చేసరికి సీత ఎక్కడికో బయలుదేరుతూంది.

'ఎక్కడికమ్మా? పట్టుమని పదడుగులు వేసే ఓపిక కూడా లేదు.' అన్నాడు.

'ఎక్కడైనా పని దొరుకుతుందేమోనని చూడకపోతే ఎలా? బండి నడవొద్దూ?'

'అమ్మా! ఇన్నాళ్లూ నా మాట నమ్మలేదు. ఎప్పుడూ నిజం చెప్పలేదు కనక. ఇప్పుడు నేనేం చెప్పినా నువ్వు నమ్మే స్థితిలో వుండవు. ఆ సంగతి నాకు తెలుసు. అయినా, దయచేసి ఒక్క నెల రోజులు ఓపిక పట్టు. నీ కొడుకులో ఏదైనా మార్పు వచ్చిందో లేదో తెలుసుకుంటావు. అమ్మా! నిన్ను బతిమాలుకుంటున్నా. ఇంత అవమానం చెల్లాయికి జరిగిన తరువాత నువ్వు పనికి వెళ్ల కూడదు. నన్ను నమ్మ- నేను పూర్తిగా మారిపోయాను- నువ్వే చూస్తావు.' అంటూ సీతను బలవంతంగా తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టాడు.

అతని శరీరంలో ప్రతి అణువూ గర్వంతో నిండిపోయింది. తను రేపట్నుంచి చేసే పని నలుగురూ మెచ్చుకునేది కాదని అతనికీ తెలుసు. కాని అమ్మను, చెల్లెళ్లను గడప దాటనివ్వడు. వాళ్ళు వున్నదానితో సుఖంగా వుంటారు. అదే తనక్కావలసింది. ఆ రోజంతా సావిత్రిని సముదాయిస్తూ, లక్ష్మితో ఆడుకుంటూ సరదాగా గడిపేశాడు. తనకు ఉద్యోగం దొరికినట్లు మాత్రం చెప్పాడు. సావిత్రి వివరాలు గురించి అడిగినప్పుడు నవ్వేసి వూరుకున్నాడు.

ఆ మర్నాటినుండి అతని కొత్త జీవితం ప్రారంభమైనది.

పొద్దున్న అయిదింటికి వెడితే రాత్రి ఎనిమిదింటికే తిరిగి రావటం. వచ్చేటప్పుడు ఏవైనా తినుబండారాలు తీసుకువస్తాడు. హోటలుకు దగ్గర్లో వుండే రాత్రిబడిలో చేరి మర్చిపోయిన విజ్ఞానాన్ని గుర్తుతెచ్చుకోటానికి ప్రయత్నించాడు. రామం చెప్పకపోయినా సీత అతనెక్కడ పనిచేసేదీ తెలుసుకుంది. మొదట్లో కంట తడి బెట్టినా 'మంచి రోజులు' వస్తాయని తృప్తిపడింది.

* * *

లక్ష్మికి మళ్ళీ జ్వరంవచ్చింది.

రెండు మూడు రోజులు అదే తగ్గిపోతుందని వూరుకున్నారు. నాలుగోనాడు డాక్టరుకు చూపిస్తే ఏదో ఇంజక్షను మందు కొనుక్కురమ్మన్నాడు. ఆ నెలజీతం పదోతారీఖుతో ఖర్చయిపోయింది. చేతిలో డబ్బులేదు. రామం హోటలు యజమానిని బతిమాలి పదిరూపాయలు తీసుకుని డాక్టరు గారింటికి వెళ్ళాడు. ఆయన పొరుగూరు వెళ్ళాడని, మరోగంటలో వస్తాడని తెలిసింది. ఒకవేళ తను రాకపోతే మరో డాక్టరు చేత ఇంజక్షను చేయించుకోమని చెప్పిపోయాడు. రామం ఎదురుచూస్తూ అరుగుమీద కూర్చున్నాడు. విరామంలేకుండా పనిచేసి అలసిన శరీరం అతని స్వాధీనంనుండి తప్పించుకుని సుషుప్తిలో మునిగిపోయింది. మెలకువ వచ్చేసరికి రెండుగంటలు దాటింది. పరిస్థితి అర్థమైంది. ఎలాగైనా మందుతీసుకుని, మరో డాక్టరుదగ్గరకు వెళ్ళితీరాలి. లేకపోతే లక్ష్మి ఏమవుతుందో ఏమో. గబగబ లేచి అడుగులు వేయసాగాడు. చలిగాలి శూలంలా పొడుస్తోంది. భయంకర నిశ్శబ్దత. మందులషాపు దగ్గరకు వచ్చాక జేబులో చెయిపెట్టి చూశాడు. గుండె ఆగిపోయింది. పదిరూపాయల కాగితంలేదు. ఒకటికి పదిసార్లు జేబువెదికాడు. దొరకలేదు... అవును. మత్తుగా నిద్రపోతున్నప్పుడు ఎవరో దొంగిలించివుంటారు. అతనికి ఏంచేయాలో తెలిసిందికాదు. యజమాని



చిత్రకారుడు : జి. రామకృష్ణ
(హైదరాబాదు)

మరి అప్పివ్వడు. ఎవర్నన్నా అడుగుదామంటే నిశిరాత్రి. బరువుగా అడుగులు వేసుకుంటూ ఇల్లుచేరుకున్నాడు. తలుపులు తెరిచేవున్నాయి. అరుగుమీద ఎవరో నలుగురైదుగురున్నారు. గుండె గబగబ కొట్టుకుంది. అతని చూడగానే పక్కకు తప్పుకున్నారు.

'పాపం!...కష్టాలమీద కష్టాలు!... అన్నీ వాళ్ళకేరావాలా?' అని సానుభూతి విసిరారు ఎవరో.

రామం తిన్నగా ఇంట్లోకిపోయాడు. సీత, సావిత్రి గొల్లుమన్నారు. లక్ష్మి ప్రశాంతంగా నిద్రపోతోంది. రామం ఎవర్నీ, ఏమీ అడగలేదు. అడిగేందుకేమీ లేదు. అయిదేళ్ళ లక్ష్మి చిన్నినోరు, పెద్దకళ్ళు, కృశించినా చిలిపితనం పోని చెక్కిళ్ళు- అన్నీ అతనికి నిజాన్ని చెప్పాయి. ఇంకా ఎవర్ని. ఏముడగాలి! గబగబ దొడ్లో చీకట్లోకి పోయి కూర్చున్నాడు.

'లక్ష్మి చచ్చిపోయింది. కాదు. నేనే చంపేశాను.' అంటూ కుమిలి కుమిలి ఏడ్చాడు.

ఆరు నెలలక్రితం లక్ష్మికిలాగే జ్వరంవచ్చింది. మందుకోసమని అమ్మనడిగి పదిరూపాయలు తీసుకు వెళ్లాడు. డాక్టరు దగ్గరకు వెళ్లకుండా ఆ డబ్బుతో తాగి మత్తుగా నిద్రపోయి, మర్నాడు ఆ సొమ్ము ఎవరో దొంగిలించారని ధైర్యంగా అబద్ధం చెప్పాడు. భగవంతుడు అవే పరిస్థితుల్ని మళ్ళీ సృష్టించి అబద్ధాన్ని నిజం చేశాడు. కాని లక్ష్మిని తీసుకు పోయాడు.

'నాకీ శాస్తి జరుగవలసిందే!' అని నెత్తి బాదుకున్నాడు.

* * *

మూడేళ్లు గడిచాయి.

ఓనాడు మధ్యాహ్నం రెండుగంటలు.

సీత ఏదో పనివుండి అరుగుమీద కొచ్చింది. నెమ్మదిగా మెట్లెక్కివస్తున్న ఆ వ్యక్తిని చూసి రాతిబొమ్మలా నిలబడిపోయింది. అతను కూడా ఆమెనుచూస్తూ ఏం చెప్పాలో తెలియక ఆగిపోయాడు.

'సీతా!...అలా తెల్లబోయి చూస్తావేం? నేను వెంకట్రావుని' అన్నాడు చివరకు. సీత గబగబ లోపలికి వెళ్ళి వెక్కి వెక్కి ఏడువసాగింది. సావిత్రి కూడా నాన్నను చూసి తెల్లబోయింది.

చేతిలోవున్న మాసిన సంచి, గొడుగు గోడవారగా వుంచాడు. అతనిలో శారీరకంగా ఎలాంటి మార్పూలేదు. మూడేళ్ల క్రితం ఎలా వున్నాడో ఇప్పుడూ అంతే. కళ్ళు మాత్రం మరి కొంచెం లోతుకు పోయాయి.

'సీతా!...మన ఇల్లంతా పూర్తిగా మారిపోయింది సుమా! ఇంటికి ఎలక్ట్రిక్ దీపాలు

చేయించారే?...ఈ గోడమీద ఫోటోలు ఎప్పుడు చేయించారు? సావిత్రి, రామం— అన్నట్టు లక్ష్మి కనపడదే? రామం కులాసాగా వుంటున్నాడా?...' అంటూ ఏదో చెప్పబోయాడు వెంకట్రావు.

'మీరు స్నానంచేసి భోంచేయండి అంతా వివరంగా చెప్తాం' అంది సావిత్రి.

భోజనం చేశాక ముగ్గురూ ఒక చోట కూర్చున్నారు.

లక్ష్మిపోయిన సంగతి విని వెంకట్రావు చాలా బాధపడ్డాడు. సీత రామం ప్రవర్తన ఎలా మారుతూ వచ్చిందో వివరించి అతను హోటల్లో చేరేదాకా చెప్పింది.

'అంటే ప్రస్తుతం హోటల్లోనే వుంటున్నాడా?' అనడిగాడు వెంకట్రావు.

'పూర్తిగా వినండి మరి. వీడు రాత్రిళ్ళు బళ్ళో చదువుకునేవాడు. బట్టలకు రంగులు వేయటం నేర్చుకున్నాడు. ఎక్కడో, ఎప్పుడో మరి. బట్టల మిల్లులో పనిదొరికింది. అక్కడ వీడిపని చూసి మెచ్చుకుని జీతం ఎక్కువచేశారు. వాడికింద నలుగురైదుగురు పనిచేస్తున్నారు కూడా. వాడికేదేదో పేరు... ఎన్నిసార్లు చెప్పినా మర్చిపోతూంటాను.'

'డైయింగ్ మాస్టర్' అంది సావిత్రి నవ్వుతూ.

'ఆ...అదే! వాడికి రెండువందలు జీతం.'

'ఇప్పుడు తెలిసింది నాకుసీతా! నరహరి అప్పుడప్పుడు చెబుతూండేవాడు. ప్రతిమనిషి ఏదో వొకరంగంలో పైకి

మారిన మనసులు

వస్తాడని, భగవంతుడు అందర్నీ సమానంగా సృష్టించాడని, అప్పట్లో నమ్మేవాడినికాదు. కాని మన రామం సంగతి విన్నాక నమ్ముతున్నా— ఏ వ్యక్తికి, ఏదిసమో తెలుసుకునేంతవరకే బాధలు, మనస్పర్థలు. తరువాత అంతా ప్రశాంతతే!...ఇంతకూ నేను వెళ్ళిపోవడం మంచిగా ముగిసింది!' అని నవ్వాడు వెంకట్రావు.

'అలా అనకండి!...మీకోసం మేంపడిన పాట్లు పరమాత్మకే తెలుస్తాయి. ఎలాగూ తిరిగివచ్చారు. అదే పదివేలు— పడుకుని విశ్రాంతి తీసుకోండి. రామంవచ్చాక మాట్లాడుకుందాం.' అందిసీత.

* * *

సాయంత్రం ఐదుగంటలకు పడుకున్నచోట వెంకట్రావులేడు— తల్లీ కూతుళ్ళు అతనికోసం ఇల్లంతా వెతికారు— సంచి, గొడుగు వున్నచోటే వున్నాయి.

'అమ్మా! ఈ వుత్తరం చదువు— నాన్న పడుకున్నచోటవుంది' అంది సావిత్రి.

వణుకుతున్న చేతుల్తో అందుకుంది.

'సీతా,

ఈ వుత్తరం చదువుకుని నువ్వు కంటతడిపెట్ట నవసరంలేదు. మూడేళ్ళక్రితం నేను ఎవరికీ, దేనికీ జడిసి పారిపోలేదు. బతుకునె తినపడితే రామం బాగుపడతాడనే వెళ్ళిపోయాను. నా వూహ నిజమైంది. ఎందుకో, నేనున్నంతకాలం వాడు చిద్విలాసంగా, ఏమీ పట్టించుకోక తిరిగాడు. నేను దూరంకాగానే మీ అందర్నీ ఆనందంలో ముంచెత్తాడు— మళ్ళీ నేను కనిపిస్తే యథాప్రకారమవుతుండేమో!... నే వున్నా, లేకపోయినా మీరు సుఖంగావుండాలి. ఈ పరిస్థితుల్లో నేను వుద్యోగం వెతుక్కోటం అంత తేలికైంది కాదు. ఒకవేళ నాకు జీవనాధారం దొరక్కపోతే రామం బాధపడతాడు. వాడింతవాడయ్యాడని ముందుగానే తెలిస్తే అసలు రాకపోదును. వాడికి నా దీవెనలు— త్వరలో సావిత్రి పెళ్ళికూడా జరుగుతుంది. అప్పుడు రామంతో ఒక్కమాటచెప్పు— సావిత్రీ. దాని మొగుడు కలిసి తీయించుకునే ఫోటో పేపర్లో వేయించమను— ఎక్కడ— ఎంత దూరంలోవున్నా చూసి సంతోషిస్తాను. దానికి అందమైన మొగుడురావాలి సుమా! అదంతా మనరామం చూసుకుంటాడు—వాడు గడుసరి— నే వెళ్ళిపోతున్నా. నాకోసం వెతకవద్దు— మీ అందరితోనూ నామనసు వుంటుంది. మరోసంగతి— నేను వచ్చినట్టు రామానికి తెలియనివ్వొద్దు. పిచ్చినాయన! వృధాగా బాధపడతాడు.' సీత కళ్ళవెంబడి ఆగని కన్నీటిధార! అరిచేతిలోకి వచ్చిన ఫలితం జారిపోయింది. రామం ఎన్ని ఆటంకాలువచ్చినా ఇంక మారడని ఆయన గ్రహించలేదు. సంచి,గొడుగుతీసి దాచేసింది. రాత్రి రామంవచ్చాడు.

'అమ్మా! సాయంత్రం మిల్లువదిలాక వస్తుంటే దూరంగా నాన్న కనిపించాడు. అచ్చంగా నాన్నేనమ్మా! నేను పిలుస్తూ పరుగెత్తేను. ఎక్కడ, ఎలా మాయమైపోయారోకాని అంతు చిక్కలేదు.'

సీత ఏడుపు ఆపుకుంది.

'నీ పిచ్చికాని, నాన్న వస్తే బజారంట ఎందుకు తిరుగుతారు? తిన్నగా ఇంటికి వస్తారు—మనిషిని పోలిన మనుష్యులుంటారు— నువ్వు పొరబడుంటావు.' అనగలిగింది సీత.

'ఏమోనమ్మా!....నా కళ్ళు మాత్రం నాన్నే అంటున్నాయి. నువన్నమాటా నిజమే ననుకో—నాన్న ఇంటికి రాకుండా వుండడు...అమ్మా! నాన్నను రమ్మని కోరుతూ పత్రికలో ప్రకటిస్తాను. అదే సరైనమార్గం. నేనింకా పని, పాటా లేక తిరుగుతున్నా ననుకుంటున్నారేమో?'

'వద్దు రామం! ఆయన వచ్చినప్పుడు రానీ—'

'సరే...ఈ నెక్లెసు—దుద్దులు చెల్లాయికి— ఆర్డరిచ్చి రెండు నెలలైంది. ఇప్పటికి చేతికందింది.'

సావిత్రి,సీత అతనికి కనబడకుండా కళ్ళు తుడుచుకున్నారు. గోడమీది వెంకట్రావు ఫోటో తృప్తిగా నవ్వింది. ★



వనితాలోకం

మనసులూ - మనువులూ నాడూ నేడూ...

("నాటి ప్రేమ వివాహాభోజనంబు. నేటి ప్రేమ వింతైనకంటకంబు. నాటి ప్రేమ వెన్నకాచిననేయి. నేటి ప్రేమ అడవిగాచిన వెన్నెల. నేటి ప్రేమ విశ్వామిత్రుని సృష్టివంటిది. నేతిబీరకాయలో నేయివంటిది."

మనసులూ మనువులూ నాడూ నేడూ ఎలా మారిపోయిందీ పైమాటల్లో వ్యాసంగా ఈ క్రింద పొందుపరచారు రచయిత్రి.)

అంతగా పరిచయం లేకపోయినా, పాపం నాకోసం ట్రిప్లికేనునుంచి బస్సు ఎక్కి మాంబలం వచ్చింది మా యింటికి సుభద్ర బొమ్మలకొలువంటూ. అంతదూరం నుంచి వచ్చి పిలిచినందుకైనా వెళ్ళాలని పేరంటానికి వెళ్ళాను.

చక్కని చుక్క - చారడే(యి)సి కళ్ళతో, - పరికిణి జాకెట్టుతో - మూడేండ్ల పాప, ముచ్చటగా, .బొట్టు, వాయనం యిచ్చింది. "ఈ అమ్మాయి మీ చెల్లెలా?" అన్నా - 'కాదు, మా అన్నయ్య కూతురు. 'మీ ఒదినగారా ఆమె?' అన్నా - ఒక లావుపాటి అమ్మాయి గోడకు చారబడి సుండలు ఒకొక్కటే నోట్లో వేసుకుంటూ వుంటే - 'ఈమె, మా చెల్లెలు వసంత,' అంటూ ఇంట్లోవాళ్ళ నొకక్కళ్లనే పరిచయం చేసింది. అందులో వాళ్ళ ఒదినగారి పరిచయంలేదు. కళ్ళతోనే అడగా - 'మా వదిన పుట్టింట్లో వుంది కదోయి!" అంది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు.

సుభద్ర హిందీక్లాసు ఫ్రెండు. వాళ్ళ అన్న కాలేజీ లెక్చరరు. వాళ్ళ వదిన బి. యస్‌సి. చదివిన రెండేండ్లు అతను ఆమెను ప్రేమించాడు. వివాహమయింది. వాళ్ళ నాన్న ఎలిమెంటరీ స్కూలుమాస్టరు. పెండ్లి కావలసిన చెల్లెళ్లు, బండెడుసంసారం. ఈ బర్డెను అంతా వాళ్ళ ఒదినకు భారంగా తోచి, వేరేసంసారం పెడదామంటె వాళ్ళ అన్న వల్లకాదన్నాడు. వల్లమాలిన కోపం వచ్చి పుట్టింటికి వెళ్ళిపోయింది (ట).

నాకాశ్చర్యం వేసింది, ఇదంతా తల్చుకొని. మొగుడు మీదయితే కోపంరావచ్చు. పసిపిల్లను ఎలా వదిలివెళ్ళిందా అని ఆశ్చర్యంవేసి సుభద్ర నడగా - 'నీ తెలివి కూల - వెనుకటికి ఎవడో నీలాంటివాడే, ఎవడో ఏడుస్తూ వుంటె - 'ఎందు కేడుస్తావన్నీ!' అంటె "బాబు చచ్చిపోయినందుకు కాదు, కజ్జలకు రేవు వచ్చిందని ఏడుస్తున్నా నన్నాడుట." అలావుంది. ఇక్కడ

బోడపాటి సుందరి

ఈ అమ్మాయికి మేమంతా లేమా? అనే నా పిచ్చి ప్రశ్నకు చక్కటి సమాధానం చెప్పింది.

ఇంతలో బిలబిలమంటూ నలుగురయిదుగురు అమ్మాయిలు వచ్చారు హాల్లో...అంటూ. చాలాకాలానికి కల్సుకున్నాం నలుగురు స్నేహితులం. అందరి యిళ్లల్లో బొమ్మల కొలువుల 'డిస్క్రిప్షన్సు' అయ్యాక "ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నావు" అన్నారు. 'అబ్బే! ఎక్కడాలేదు' "అయితే పెండ్లెప్పుడు?" ఇది మరీ బాగుంది. 'వూరికే వున్నావంటే ఎవరు నమ్ముతారు? అయితే ఎవరిన్నా ప్రేమిస్తున్నావన్నమాటే - ఎవరా అదృష్టవంతుడు?" యిక వాళ్లమాటలు వినలేక పోయా. అరికాలి మంట తలకెక్కింది. వాళ్ళు హాస్యానికన్నా - ఒకవేళ నిజంగా అన్నా - అదో ఎట్రాక్షన్ - ప్రతివారికి ఇదో పిచ్చి. లవ్ మేరేజిలన్నా - ప్రేమ వివాహాలన్నా పడిచస్తారు.

రెండేండ్ల క్రిందట మా రాధ పెండ్లికి వెళ్లా. ఇద్దరిదీ మేనరికం-ఇద్దరూ ఎం. బి. బి. ఎస్. లు. పెండ్లిచేసుకున్నారు. మాబావ పల్లెలో ప్రాక్టీసు పెడతానంటె రాధ పట్నంలో పెట్టాలని. ఇద్దరూ పెండ్లయిన ఆరునెలలకే విడిపోయి వేరువేరుగా ప్రాక్టీసు పెట్టారు. పట్నంలో ఒకరు పల్లెటూరులో ఒకరు. అప్పుడు ఈ ప్రేమంతా ఏమయిపోయిందో!

సుజాత మటుకు బి. ఎ. చదువుతూ తనతో బి. ఏ. చదివే వాసు పాటలు బాగా పాడతాడని అతనిని ప్రేమించింది. ఇద్దరూ కారులో మహ జోరుగా తిరిగారు క్లాసులు ఎగ్గొట్టి. పెండ్లి చేసుకున్నారు. అతను సినిమాలో ప్లేబేక్ ఆర్టిస్టు క్రిందచేరితే తనకి కోపం వచ్చి టీచరు ట్రయినింగయి బొంబాయి వెళ్లింది వుద్యోగం చెయ్యటానికి. అతను మళ్లీ పెండ్లిచేసుకున్నాడు ఆ రెండేండ్ల ప్రేమ మంట కలసింది. కారుల్లో తిరిగింది- రోడ్డుదుమ్ముపాలయింది.

ఇలా అంటే మా అన్నయ్యకు కోపం. తనది లవ్ మారేజ్. ఒప్పుకోడు. తల్లిదండ్రులు చేసిన పెండ్లిండ్లు మటుకు ఏదో కారణంగా మధ్యలో విడిపోయిన కుటుంబాలెన్ని లేవంటాడు? నలుగురు పిల్లలున్న వైదేహి యిప్పుడు పి. యు. సి. లో చేరింది దేహీ అంటూ తండ్రిదగ్గరకు వచ్చి, భర్త ఏదో టైపిస్టును పట్టాడని. 60 ఏళ్లు నెత్తికొచ్చిన ప్లీడరుగారు, మా ప్రక్కయింటి డాక్టరుగారి మాటేమిటి? 20 ఏళ్లు ఒకరు, 14 ఏళ్లు ఒకరు కాపురాలుచేసి, భార్యకి ఆచారం అని ఒకరు చదువుకోలేదని ఒకరు, తేల్చిపారేసారు అంటాడు అన్నయ్య. అదీ-నిజమే. ఖర్మ - విధిరాత అంటుంది బామ్మ. అమ్మ, నాన్న నా పెండ్లి ఎలా అవుతుందా అని నాకు లేని బెంగ పెట్టుకొని కూర్చున్నారు. మా స్నేహితులుమటుకు - నే నెవర్నో ప్రేమించేసి వుంటాననీ అందుకే యింకా పెండ్లిచేసేసుకో లేదనీ-ఈర్ష్యపడిపోతున్నారు. నాకు మటుకు యివన్నీ చూసినమీదట తల్లిదండ్రులు చేసిన వివాహాలే ఎటు చూసి-ఎటు చూడకపోయినా


(42వ పేజీ చూడండి)

శిరోజా

బొమ్మలు: దేవిక







(1) శిరోభాగంలో రాగిడి. పూలచక్రంలో తురిమిన పూలు. జడమధ్యలో చామంతి బిళ్ళ. వయ్యారంగా క్రిందికి వ్రేలాడే జడ గంటలు, అందమైన పాలుజడకు అలంకారాలు. (2) రెండు జడలు మీదకు ఎత్తి శిరోభాగంలో రిబ్బనుతో ముడి వేయటంతో ఎంత అందమైన అలంకరణ అమరిందో చూడండి! (3) మనసు నలరించే మరో నవీన వైఖరి. (4) జడగంటలతో పాటు, కేశాలంకరణకు పూలజడ మరింత సోయగం చేకూరుస్తుంది. మల్లెలు, జాజులు, చామంతులు, మొగలిరేకులు మొదలైన రకరకాల పూలతో జడమీద అందంగా కుట్టుకోవచ్చు, లేదా జడాకృతిలో ఒక అట్టమీద వేరే కుట్టుకుని, దాన్ని జడకు కలిపి కుట్ట వచ్చును. పూల మధ్యలో అక్కడక్కడ చెమ్కీ బిళ్ళలు వేసికుట్టితే పూలజడ మరింత అందాన్ని ఒలకబోస్తుంది. పూలజడకు అందమిచ్చే రీతిలో తలలో పూలు అలంకరించుకోవాలి.

అలంకరణ






1




2



3







(5) క్రిందకు కుచ్చులా వ్రేలాడే అజంతా పద్ధతి సిగ. (6) మామూలుసిగపైగాని, రింగ్‌తో వేసుకున్న సిగపై కాని నెట్ వేసుకోవటం వల్ల సిగకు నిండుదనం చేకూరుతుంది. సిగపైన అర్ధచంద్రాకృతిలో పూలు మరింత శోభనిస్తాయి. (7) బర్మా సిగ చుట్టుకుని, మొగలిరేకులు పై విధంగా కత్తిరించుకుని అలంకరించుకోవటం కళాభిరుచిని చాటుతుంది. (8) నిండైన బర్మా సిగ, సిగ చుట్టూ పూలు, అందంతోపాటు ఆకర్షణను కూడా పెంపొందిస్తాయి.

మంచివిగా తోస్తున్నాయి. మా తాత మటుకు తన కూతురు విషయంలో అల్లుడి ప్రవర్తన బాగుండకపోతే - ఏదో ముక్కు మూసుకొని - మూలకూర్చుని పరివర్తన చెందక - ఇప్పటిదాకా అల్లుడితో దెబ్బ లాడుతూనే వున్నాడు. నవ్వ(చెప్ప)తూనే వున్నాడు, కొట్టినట్లు. 'తాతా! నీదో మంకు పట్టు. ఊరుకో. చడీచప్పుడు కాకుండా మనోవర్తికి దావా పడెయ్యి అంటే 'అహేం! మంచమ్మ! పండంటి కాపురం. ఎలాగో సర్దు కోవాలి కాని, కోర్టులకి ఎక్కడం ఓగొప్పా!- ఈ పద్నాలుగేళ్లు కాపురంచేసి పిల్ల పిచ్చి దంటాడా - నాలిముచ్చు వెధవ! చెప్పక్రింద తేలులా వాడ్ని దారికి తేకపోతే- చూడు." అంటూ కళ్ళు తుడుచుకొని వీధిలోకి వెళ్ళి పోతాడు.

ఇవన్నీ చూస్తే ప్రేమవివాహాలు నాడూ వున్నాయి. మరి నేడూ వున్నాయి. నాడూ కోర్టులు, రాజదర్బారులూ వున్నా-యిలాంటి కేసులు వచ్చి నటువంటి కథలు వినలేదు. రావణుడు సీతని ఎత్తుకొనిపోయినా రాముడు కోర్టులో 'కేసు' పడెయ్యకుండా నెగ్గు కొచ్చాడు. దమయింతి భర్త పోషించలేక వదిలివేసినా నట్టడివిలో - ఏ కోర్టు గడప తొక్కలేదు మనోవర్తికోసము కాని, దేని కోసముకాని. ఈ ప్రేమవివాహాల గురించి ఎన్నో పురాణగాథలుకూడా విన్నాం. విని వున్నాం. తాను ప్రేమించిన సత్యవంతుడు, గరుత్మంతుడు కాడనీ, సౌందర్యవంతుడు, బుద్ధిమంతుడు, ధీమంతుడు అని ఎంచి అల్పాయుష్మంతుడయినా ఫరవాలేదని ప్రేమ కొద్దీ తెలుసుకొని, ప్రేమకే ప్రాధాన్యం యిచ్చి పెండ్లాడింది సావిత్రి. ఇటువంటి పురాణ ఇతిహాసా లెన్నున్నా నాటి ప్రేమ వివాహాలకి వుదాహరణలుగా ఏకరవు పెట్ట వచ్చు.

సీత, సావిత్రి, దమయంతి, మండోదరి, శకుంతల మొదలగు లిస్టులోని పురాణ హీరో యిన్ లందరు తాము వలచి వలపించుకున్న వారినే ఎన్ని కష్టాలనయినా ఎదుర్కొని వివాహమాడారు. ఇంతెందుకు? ప్రేమకు ఫలితంగా పరిణయం పెద్దలు (తల్లితండ్రులు) చెయ్యకపోవడంవల్ల లైలామజ్నులగతి, సలీం అనార్కలీల సంగతి ఎంత వక్రగతిపొందాయో, ఎంత దుఃఖపూరిత మయినవో లోకవిదితమే. శిశుపాలునితో తన వివాహం ఎక్కడ జరుగుతుందనోననే భయంకొద్దీ కదారుక్మిణి శ్రీకృష్ణునితో ఎలోప్ యి పోయింది— ఇలా ఎన్ని వుదాహరణలయినా యిస్తూ వెళ్ళవచ్చు స్ట్రెయిట్ గా.

కాని నాటికి నేటికి ఎంతో భేదం వుంది. కాలం మారింది. నాటి ప్రేమలు వేరు. నేటి ప్రేమలు వేరు. నాడు పురుషునియొక్క బలం, సౌందర్యం, శక్తి సామర్థ్యాలు, శౌర్యం, చూసి కని, విని ప్రేమించేవారు.

మనసులూ, మనుష్యులూ

(39-వ పేజీ తరువాయి)

నేటి యువతీ యువకులు ప్రేమనే పదానికి అర్థం తెలియకుండా- "మేమూ ప్రేమించాం" "మాకూ చేతనవును ప్రేమించటం" అని చెప్పకోటానికి, మూన్నాళ్ళ ముచ్చటగా ప్రేమించుకుంటారు. ఈనాటి యువతీయువకులకు ప్రేమించుకొనే 'పీరియడ్'లోనే వారి ప్రేమకు అర్థం-పర్థం-పరమార్థం కూడా వుంటుంది. తరువాత కాలేజీ హాలిడేస్ మాదిరిగానే వారి ప్రేమకు కూడా హాలిడే మూడ్ వస్తుంది. తరువాత కొద్దిరోజులకు తమ ప్రేమ నాయక-నాయకీమణులను సినిమా - హీరో హీరోయిన్ల మాదిరిగానే మర్చిపోతారు. సినిమా హీరో-హీరోయిన్లని ఎందుకన్నా నంటే సినిమా అయిన రాత్రి తరువాత మనం మళ్లీ ఈసినిమా-హీరో-...యిన్లని ఇన్నర్ గా కూడా మర్చి, యింకో సినిమా-హీరో-హీరోయిన్ల గురించి అవుటర్ గా మాట్లాడు కుంటాము. ఆ మాదిరిగానే కాలేజీ జీవితం లాంటిది- వికసించని కుసుమంలాంటిది- విజ్ఞానపుటవని దాటనిలాంటిది నేటి ప్రేమ.

అందరూ అలా చేస్తారా ? మేం చెయ్యం- అలా చెయ్య కడిగేసుకోం, ప్రేమ విష

సరళ సలహా

కురులు, ముదితలకు సిరులు. అందుకే వారికి వాటిపై మరులు. అగరునూనెలతో అభ్యంగనం చేసి, విరులతో అలంకరించి ఇరులవంటి కురులను ఇంపుగా దిద్దుకుంటారు మహిళలు. స్త్రీకి పెట్టని భూషలు శిరోజాలు. ఆమె అందానికి మూలకందాలు. 'కురూపికయినా కురులే అందం' అంటారు పెద్దవారు.

'ఇప్పుడు జడచుట్ట లవతరించినవి. జారిచెంబులవలెను...' ఇత్యాదిగా ఆడవారి విపరీతపు అలంకారాలను 'సాక్షి' వెక్కిరించింది.

కాని, కురులుదిద్దుకుని మరులుగొలిపే మనోహరరూపంతో స్త్రీ కన్పించడం ఎంతయినా అవసరం. శిరోజాలంకరణం ఒకప్రకరణం. అందులో అనేకపద్ధతులున్నాయి. 'ఏవయస్సు కామచ్చట ముడి' కనుకుని స్త్రీ తన అందచందాలు దిద్దుకొనడం ఎంతయినా అవసరం.

యంలోమటుకు - అట కెక్క వలసివచ్చినా, ఆకాశంలోకిపోయే అవకాశ మేర్పడినా "మేము ఆదర్శప్రేమికులం అంటూ కొంతమంది చెరొయ్యొత్తున లేవచ్చు - ఎత్తుకుపైఎత్తు వేసేవాళ్ళు-మా అన్నయ్యలాంటి ఆదర్శ మూర్తులూ.

ఈ ఆదర్శప్రేమికులు కూడా అనుభవం మీద తెలుసుకుంటారు. వారి ప్రేమ ఏమిటో! ప్రేమనే పదానికి నిర్వచన మేమిటో-! వేడిలోనే వారి ప్రేమ ఆదర్శమనీ-ఆ వేడి చల్లబడగానే వారి ప్రేమ చప్పబడి పూరు కుంటుందనీను. ఉదాహరణకి నేటి యువతీ యువకులను తీసుకోండి. ఏ కాలేజీ జీవితం లోనో వారి ప్రేమకు పునాది ఏర్పడుతుంది. వివాహం కాకపూర్వమే వారి మనస్సులో కోరిక ప్రకారం బీచి షికార్లు, సినిమాలు, పిక్నిక్ లకు పోయి నీటుగా ఆనందానికి ప్రేమని అర్థం చెప్పకుంటారు. తరువాత వారి ప్రేమ జయం పొంది జయానికి అర్థం వివాహం కనుక అయితే జయం-మనదే అంటారు.

వివాహమయినది మొదలు చిట్టిబుల్లి ప్రణయ కలహాలు, ప్రళయంగా తయారయి, ఒకరిమీదొకరికి నమ్మకాలుపోయి-విడిపోవడాలు, విడాకులు, ఎడముఖాలు, పెడముఖాలుగా తయారయి ముక్కు చీదేది ఒకరయితే మూలకిపోయి కిటికీలోంచి శూన్యంలోకి చూసేదొకరవుతారు. హీరోపోజులో నాటి ప్రేమ పెళ్లినాటి ప్రమాణాలను తలచుకోకుండా-ఒకరిని సలహా అడగటానికి సిగ్గు. వారు ప్రేమించి చేసుకొన్నవారు. తల్లి దండ్రులను సంఘాన్ని ఎదిరించి, కులమతాలని లెక్కచెయ్యక ప్రేమించి వివాహం చేసుకొన్నవారు. అటువంటిది ఇప్పుడు సలహా చెప్పమని ఎవర్ని అడుగుతారు? ఏమని అడుగుతారు? ఎవరు వస్తారు సలహా చెప్పటానికి?

అంతేకాకుండా ప్రతిమించి రాగాన పడినట్లయితే పెండ్లి కాకుండానే నాతో అలా తిరిగావే తిరగలమ్మ! అలా ఎంతమంది మొగాళ్లతో రాయిమీద రాయిలా కాలు మీద కాలు వేసుకొని తిరిగావో అనే భర్త- అలా...అలా...పెండ్లి కాకుండానే నాకు (ఆహ్!) ప్రేమ లేఖలు వ్రాసేశే! అవ్వ! యింకా ఎంతమందికిముందు యిలా నమ్మించి వ్రాసేరో కొంటకరానికొయ్యలా ఓ తిరుగలి కొయ్యా! అనే భార్య-ఇలా ఒకళ్లనొకళ్లు దెప్పకొని (చెప్ప) కొని మాటలతో గాయాలు చేసుకుంటారు.

'జామ' కాయలాంటి వివాహానికి ముందుంతే 'మజా' 'జాం' అయిన తరువాత 'జా'నయి వివాహానంతరం- తరగని సముద్రంలా నీరుకారిపోతుంది. విడాకుల చట్టాల కోసం, 'నో వేకన్సీ' బోర్డులు ఎక్కడ లేవా! అని వెతుకోవడంకోసం ప్రయాణ

మవుతారు, ప్రేమికులు, నేటి రోజుల్లో ఎప్పటికప్పుడు రోజులు మారాయి అనుకుంటూ—

మహా, మహా తల్లిదండ్రులు చేసిన వివాహాలకే దిక్కూ, మొక్కూ, దివాణాలేదు- దివాలీలేదు- దివాలాతప్ప. తల్లిదండ్రులు వివాహంచేసేరంటేఆ కుటుంబంయొక్క తరతరాలనుండి, వాళ్ల సంస్కృతి, సంప్రదాయం, వంశం చూసి బుద్ధవరపు వారి కుర్రవాడయినా, బుద్ధిమంతుడా కాదా అని, అనంతపురం పెండ్లికొడుకయినా, అనంత పద్మనాభరావయినా, వాళ్ల అంతు, అంతసు కనుక్కొని - కాని- కొని తెచ్చుకోటానికి యిష్టపడరు.


బుద్ధిమంతుడు, తెలివైనవాడు, చదువుకొన్నవాడు (అంటే నాలుగురాళ్లు తెచ్చుకొనేవాడు) అవునా కాదా, అనే విషయంపై అర్థం అయ్యేవరకు తర్జనభర్జన చేసి కూలంకషంగా విచారించి, చర్చించి, చలించి (వేసవి పెండ్లిండ్లయినా) అనేక సాధకబాధకాలు (లో)పడి, పప్పులో కాలెయ్యకుండా, తాగక తప్పని, యిష్టంలేని కషాయంలా అర్థం సమర్పించి, ఒక వివాహం అయిందనిపిస్తారు. అంతటితో వారి పని అయిందని చేతులు దులుపుకొని, కాళ్ళు కడుగుకొని (పెండ్లికొడుకు కాళ్ళు కడిగేసాం కదా ?) కూర్చోరు. ఆ వివాహమయిన తరువాత భార్యాభర్తల్లో ఒచ్చే ఒడుదుడుకులకు పోట్లాటలకు సర్ది చెప్పి ఎప్పటికప్పుడు వారిద్దరినీ ఏకంచేస్తారు ఏక్-హీ-రాస్తా మీద నడవమని.

ఒకొళ్లనొకళ్లు అర్థం చేసుకోటానికి భార్యాభర్తలుకూడా ప్రయత్నిస్తారు. వాళ్లలో కొత్తప్రేమ, ఫోటోకి 'ఫ్రేంలా' అందంగావుండి, ఎలమావి చివురులా, నిండు జాబిల్లిలా, బుల్లి పాపాయి బుగ్గసొట్టల బోసినవ్వయి కూర్చుంటుంది. వివాహానికిముందే ప్రేమించుకున్నట్లయితే- అయితే చాలా చోట్లయినట్లే ఆ ప్రేమ వివాహానంతరం-అనంతం అవడానికి బదులు అంతయిపోతుంది. ది ఎండ్ ఎండ(డి)యిపోతుంది. 'నూతన్'ంగాఅందంగా వుండదు. పాతచింతకాయపచ్చడి మాదిరిగా వుంటుందంటే అన్నయ్య ఒప్పుకోడు 'మాది వుందా' అంటాడు ఉదాహరణగా—

అప్పుడయితే నేనంటా తూటాలాంటి మాట - తంటాలేకుండా "వదినది, నీది, లవ్ మారీజ్ అని మహా వుప్పొంగిపోతున్నావు. ఎప్పుడో ఒకప్పుడు చూడు, వదిన నిన్ను పుట్టింట్లో వదిలేసి వెళ్లిపోతుందంటా.

మా వదినకు చాలామంది పిల్లలు పుట్టిపోయారు. అన్నయ్య ఫేమిలీ ప్లానింగ్ అనీ పిల్లలుండకూడదనీ అంటాడు. వదినకు పిల్లలంటె పిచ్చి. భగవంతుడుకూడా అలాగే అన్యాయం చేస్తున్నాడు. అన్నయ్య ఆప

ఏమండూఇంతే-- 64 శంకర్



రేషన్ చేయించుకుంటాననీ- వదిన వల్ల కాదనీ రోజూ వాదాలు. వాయిదా అవుతోంది ఆపరేషన్- రేషన్ లేకుండానే.

అన్నయ్యంటాడు ఏదో వీక్ పాయింటు పట్టుకొని మమ్మల్ని అలా దులపకు. నీవాదం నూటికినూరు పాళ్ళు తప్పు. ఫర్ ఎగ్జాంపుల్ మా కేస్ తీసుకో అంటాడు వదినవేపు చిలిపిగా నవ్వుతూ-

మా వదిన అన్నా చెల్లెళ్లవాదన చూసి 'నీకు పెండ్లయిందాకా తెలియదులే(కొ)మ్మ ప్రేమంటె ఏమిటో అని నాకు ప్రేమ పాఠాలు ప్రథమంగా నేర్పదామని చూస్తుంది.

ఇవన్నీ చూసి పట్టుమని పదహారేండ్లైనా లేని పి. యు. సి. చదువుతున్న మా చెల్లిలు ప్రేమ వివాహాలమీద ఫుల్ స్టాప్, కామా, లేకుండా పది లెక్చరు దంచి పారేసుంది, కేవలం వాటి ఎడ్వాంటేజస్ మటుకు అసలు డిస్ ఎడ్వాంటేజస్ లేనట్లు- కేవలం తను జస్టిస్ మాట్లాడుతున్నట్లు-

ప్రేమించి, పెండ్లి చేసుకొని ఎక్కడకో పారిపోయి తరువాత విడిపోయినవారిని తిరిగి కలపడం ఎంతో కష్టం. ప్రేమించి పెండ్లి చేసుకున్నవారు విడిపోతాగా అనే ప్రశ్న (ప్రేమికులైన) పాఠకులు వెయ్యవచ్చు. ఈ రోజుల్లో ఎన్నో విషయాలు చూసి తల్లిదండ్రులు చేసిన పెళ్ళిళ్లే నలుగురయిదుగురు పిల్లలు పుట్టినతరువాతకూడా భర్త భార్యను వదిలివెయ్యడం, భర్త ఏదో చేసేడని భార్య ఆత్మహత్య చేసుకోవడం నేటి రోజుల్లో అందరూ వింటూవున్న యథార్థగాథలే.

అటువంటిది- కేవలం నేటి ప్రేమికులు బాహ్యరూపం చూసి, ఏదో 'క్రికెట్ మాచ్' ఆడతాడనీ, మేథ్స్‌లో 'జం' అనీ- 'దిలీప్' పోయింది 'దేవానంద్' లాంటి క్రాఫింగు వుందనీ- తన మనోభావాలతో అతని అభిప్రాయాలుకూడా సై అంటాయనీ- . అతనికీ తనకీకూడా అభిమానతారలు కామన్ అనీ (అభిమానం సినిమా చెత్తగావుందనీ) అతను కూడా ఎంచక్క 'సరళి సలహా' అంటె తలవంచేసి ఒప్పేసుకుంటాడనీ- యింతకంటె మనసూ, మనసూ కలియటానికి యుగళ గీతం పాడుకోటానికి- చూడగానే ప్రేమంకురించి సినిమా మొదటిరీలులోలా అవటానికి యింకా ఏంకావాలని చెప్పి- అమ్మా నాన్నలతో దెబ్బలాడి, మీరు చెయ్యకపోతే మేం చేసుకోలేమా! అతనికి తెలుసు రిజిస్ట్రాఫీసుకు దారి! నాకు తెల్సు అటోరిక్షా ఎక్కడం అనే నేటి ఆలోచనారహితులైన యువతీ యువకులకి నాటి పురాణప్రేమికులకి హస్తిమశకాంతర భేదం.

నాటి నాయికలు కష్టమయినా, సుఖమయినా పతితోడిదే దైవమనీ- ప్రేమించి, తోడిరాగంతో, అనురాగంతో ఆరాధించే పూజ్యభామినిలు. కాలం (మారింది) మోడరన్ అయింది. రన్నింగవుతూ నేటి నాయికలు- (నాయకులు) తాత్కాలిక వ్యామోహంలోపడి- ఏదో అనుకొని- ఏదో చూసి భ్రమించి, ఏవో అనుభవహీనమయిన కబుర్లు చెప్పి (మనంచదివే పత్రికల స్టేంపర్లతో) బాధ్యతారహితంగా ప్రవర్తించే సామాన్య (కామినులు) స్త్రీలు.



మనసులు, మనువాలు

భర్త 'చస్' అంటే 'తుస్సు' మనిలేచి మా కాళ్ళమీద నిలబడగల శక్తి మాకూవుంది అందుకే స్త్రీకి విద్య అవసరం- నాడు మటుకు భర్త నిరాధారంగా వదిలేస్తే దమయంతి ఏంటుతోముకొని, వడ్లుదంచి- యింకా- బ్రతికలేదా అనే ఉపన్యాసాలు వుదాహరణతో సహాయిచ్చే సబలలు. 'డార్లింగ్' అంటె 'రింగ్' చేస్తూ 'డార్లింగ్' అనీ హావ్-డూ-యు-డూ- అంటె హై-డియర్- సార్- మా మంచివారూ- అంటూ నే 'షటప్' అన్నప్పుడు 'యూ-షటప్' అనే 60 మోడలున్న (...)

ఎప్పుడూ యింతే (శంకర్) లోలా కాకుండా ఎప్పుడూకూడా తల్లిదండ్రులు చేసే వివాహాలకయితే పూర్తిబాధ్యత వారిదే. కష్టమొచ్చినా సుఖమొచ్చినా వారు దరికి వచ్చి ఆదుకుంటారు. భార్యాభర్తల్లో ఏదైనా తప్పువుండి చిలిపి కలహాలువస్తే యివి తప్పు అని చెప్పి కాపురాలను సరిదిద్దుతారు. ప్రేమించి చేసుకొన్న వివాహాలకయితే- చిలిపికలహాలనే మనం కోతిపుండు బ్రహ్మరాత సిలా చేసుకొని ఉభయులూ భయంలేక సహనాన్ని కోల్పోయి తమ కాళ్ళమీద తామె గొడ్డలితో నరుక్కుంటారు. (ప్రేమ పైత్యంలో) కాళిదాసంతటి వాళ్ళమనుకొని. దీనికి మందులేదు. కేస్ లేదు. కోర్టులేదు. 'సలహా' లేదు. చేసుకున్నంత మహాదేవా అని అనుభవించవలసిందే.

నాటి ప్రేమ వివాహభోజనంబు. నేటి ప్రేమ వింతైన వంటకంబు. నాటి ప్రేమ వెన్న కాచిన నేయి. నేటి ప్రేమ అడవి కాచిన వెన్నెల. నేటి ప్రేమ విశ్వామిత్రుని సృష్టి వంటిది; నేతి బీరకాయలోని నేయివంటిది. ఆగాకర కాయలోని కమ్మదనంలా కరకర లాడే టటువంటిదీను. నాటి ప్రేమ వసిష్ఠునిలా పటిష్ఠం- పటుత్వం- తత్వం-గలది. యింకా- నాటి ప్రేమ గలగలలాడే గాజుల శబ్దం వంటిది- కళకళలాడే కుంకుమవంటి కళ గలది- నేటిది వెలవెలలాడే తిలకంలా, రబ్బరుగాజులులా...

నేటి ప్రేమ బాహ్యసౌందర్యాన్ని కోలిచేది. నాటి ప్రేమ ఆత్మసౌందర్యాన్ని ఆరాధించేది. నాటిగోజుల్లో 'అందమె ఆనందం' అని అనుభవంలోకి తెచ్చుకున్నారు. నేటి రోజుల్లో ఆ మాటకు విలువ తెలీక సినిమా పాటగా పాడుకుంటున్నారు. ★

వనితా వాణి



స్త్రీలే వంట చెయ్యాలా ?

ఏ పురాణాలలో చూచినా వంట ఎవరు చేయాలి అనేది ఎక్కడా నిరూపించినట్లు కనుపించదు. భారతంలో మాత్రం నలుడు, భీముడు వంటలు చేసినట్లు ఉంది. సాధారణంగా సంతర్పణలలోను సమారాధనలలోను కార్యాలలోను వంటబ్రాహ్మణులనే పెట్టి వంట చేయిస్తాముగాని బ్రాహ్మణిని ఎందుకు పెట్టం?

అసలు వంట చేయటమనేది పురుషుని కర్తవ్యమా? స్త్రీ కర్తవ్యమా? దీనికి చరిత్రాధారాలేమైనా ఉన్నాయా? పత్రికాముఖంగా వినగోరెదను.

—అనిపెద్ది లలితాగాయత్రీశ్యామల (జగన్నాథపురం)

*　　*　　*

కొన్ని కొన్ని వంటకములు సోదరీమణులు చెప్పిన విధముగా చేసితిమి. కొన్ని కుదిరినవి. బాగా రుచిగా వుండినవి. ఈమారు పత్రికలో చట్నీ పొడినిగూర్చి కొంతవరకు తెలిసిన వారిని, పత్రికాముఖముద్వారా మాకు అందచేయగోరుచున్నాము.

ఆర్. కృష్ణమ్మ (సముద్రపల్లి)

*　　*　　*

23-11-60 వారపత్రికలో వనితాలోకం శీర్షికయందు ప్రచురింపబడ్డ ఎస్. వి. ఎల్. ప్రఫుల్ల కుమారిగారి మూడు రకాల పుడ్డింగులూ చాలా బాగా కుదిరినవి. హోటల్స్‌లో దొరకనివీ, వండుకుందామంటే తెలియనివీ, అయిన వంటకములివి. ఎన్నాళ్ళనుండో ఎదురుచూసిన పుడ్డింగ్స్ చేసే విధానం పాఠకుల కర్థమయ్యేట్లుగా ఈ కొత్తరకం మూడు వంటకాల నందజేసిన ప్రఫుల్ల కుమారిగారికి అభినందనలు తెల్పుతున్నాను.

'వనితాలోకం'లో వంటలనవసరం అని వ్రాసిన జె. సరోజాగారి అభిప్రాయం ఉచితం గాదనిపిస్తున్నది:

వి. రమాసుందరి (నిజామాబాద్)

*　　*　　*

సరళ సలహా

14-12 60 పత్రికలోని 'సరళ సలహా'ను చదివాను. దైవంపట్ల మనం ప్రదర్శించే భక్తి శ్రద్ధలు ఈ పైసాయెడల చూపుతూనే - ఆ పవిత్ర మనోభావం కూడ దీని విషయంలో విడవక పోవడం అత్యవసరం అనుట చాల అసమంజసముగ ఉన్నది. కలియుగంలో డబ్బుకు ప్రాముఖ్యము ఎక్కువగనే వుండవచ్చు. అంతమాత్రాన దానికి లేని పవిత్రతను అంటకట్టి దేవునిపట్ల మనం ప్రదర్శించే భక్తి శ్రద్ధలు ఈ పైసాయెడల చూపమనడం మన సోదరీమణులకు సరళ మార్గం చూపటం కాక పెడదారిన పెటినట్లు అవుతుందేమోనని నా సందేహం.

రెహాన రహమాన్ (నాగపూర్) ★

వరుణ్ణి ఎన్నుకునే హక్కు

14-12-60 వారపత్రికలో వనితాలోకం శీర్షికయందు 'సి. కృష్ణకుమారి' గారు వ్రాసిన "ఆలుమగలు పరస్పరం" అన్న వ్యాసం చాలాబాగుంది. ఈ రోజులలో చదువుకొని. ఉద్యోగాలు చేస్తూ మాకు పెళ్ళి వద్దు అనే ఆడపిల్లలందరకు బాగా బుద్ధిచెప్పినట్లుగా వ్రాశారు. నిజముగా తెలివిగలవారైతే ఇది చదివిన తరువాతనైనా, బుద్ధి రావచ్చు. ంత చక్కని వ్యాసం వ్రాసిన కృషకృమారి గారికి నా అభివందనములు.

కాని, ఆవ్యాసం చివరలో చిన్న తప్పటడుగు వేశారు. 'పెళ్ళికాని పిల్లలకు సక్రమమైన పద్ధతిలో వరుణ్ణి ఎన్నుకొనే హక్కు లభించాలి' అని ఆమె వ్రాశారు. వారికి ఆ హక్కునిస్తే ప్రస్తుతం 'పెళ్ళి చెసుకోను' అనే వారంతా, వారిహక్కు నెగ్గించుకోవటం కోసమైనా తల్లిదండ్రులు తెచ్చిన వరుల నందరినీ ఏదో వంకపెట్టి వద్దంటారు. కారణం? వారికి హక్కు ఉందిగనుక. చిన్నతనం నుండి ఎంతో ప్రేమతో పెంచి వేలకువేలు ఖర్చుపెట్టి విద్యాబుద్ధులు చెప్పించి వారి బాగోగులు చూసే తల్లిదండ్రులకు, తగిన వరుని జూసి వివాహం చేయటం మాత్రం వారికి తెలియదా! అందువల్ల హక్కు లభించాలి అనివ్రాయటం చాలా అసమంజసంగా ఉంది. ఇంతకుముందు ఈ హక్కు తెలియక, తల్లితండ్రులు చెప్పినట్లు వినే ఆడపిల్లలు కొంతమంది గూడా ఈ హక్కులకోసం పోరాడటం నేర్చుకుంటారని, నా అభిప్రాయం,

భూపతిరాజు సరస్వతి (అద్దంకి)

*　　*　　*

ఈ వారము (14-12-60) పత్రికలో వనితాలోకం శీర్షికయందు ఆలుమగలు పరస్పరం అను వ్యాసము నన్ను ఎక్కువగా ఆకర్షించినది. సోదరీమణులు ముందు కూడ ఇటువంటి వ్యాసములు వ్రాసి వనితలకు తోడ్పడతారని ఆశిస్తున్నాను. కృష్ణకుమారిగారికి మీ పత్రికద్వారా నా హృదయపూర్వక అభివందనాలు చెప్పుచున్నాను.

ఎస్. లక్ష్మీకాంతం (మండపేట)

*　　*　　*

వనితాలోకం శీర్షిక క్రింద 14-12-60 వారపత్రికలో సి. కృష్ణకుమారిగారు వ్రాసిన వ్యాసము చదివినాను. చాలా బాగున్నదని తెలుపుటకు సంతసించుచున్నాను. సంసారజీవితములో ఆలుమగలు పరస్పరం అర్థం చేసుకొని నడచుకొనిన వాళ్ల సంసారం కలతలు లేకుండా ఉండునని నా భావన. కృష్ణకుమారిగారు వ్రాసినట్లు స్వభావంలో తేడాలే గాని 'భార్య బానిస' అనే పదములో గల మహాత్మ్యము కాదు.

కూచిభొట్ల సీతామహాలక్ష్మి (రాజమండ్రి)

ఇంటి యజమాని : (తన యింటితాళంతీస్తున్నదొంగతో) ఎవరూ ?

దొంగ : ఏం ?

ఇంటియజమాని : ఏం చేస్తున్నావ్ ?

దొంగ : ఈ ఇంటికి తాళం వేయబడినదా, లేదా చూస్తున్నా ?

జగన్మోహన్ (గోపాలపేట)



-దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

28-12-60 బుధవారం మొదలు

3-1-61 మంగళవారంవరకు.

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ప్రస్తుతం మీ ఉన్నత స్థితికి చురుకుగా ప్రయత్నాలు చేయగలుగుతారు. క్రొత్త వారితో స్నేహసంబంధాలు ఏర్పడి ముందు ముందు ఫలితంపొందగలుగుతారు. తాత్కాలికంగా మీ ఆలోచనలకు మార్గం కనుపించక పోవచ్చు. వృత్తిలో మీగు కోరుకొనే మార్పులు అనుకూలించగల సమయం, నౌకరులు మొదలయినవారితో మృదువుగా వ్యవహరిస్తూ వారివల్ల దొంగతనము, మోసము జరుగకుండా చూచుకొనటం అవసరం. సాటివారిలో మీయందు ఆదరాభిమానములు ఏర్పడే సమయంలో సహాయం లభిస్తుంది. ఎదురు చూస్తున్న వార్తలు నిదానంగా వస్తవి. అయితే మీరు అనుకున్నంత ప్రయోజనం కనిపించదు. వినోదకార్యక్రమాలు నెరవేరుతవి. 30, 31 లలో బంధు మిత్రుల రాక, ధనలాభం, కార్యభంగం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఏ పని చేదామనుకున్నా మరొకరి సహాయం అవసరం అవుతుంది. అందుకు తగిన మనుష్యులు లభిస్తారు. లాభవార్తలు తెలుస్తవి. వాద ప్రతివాదాలలో జయము, గౌరవము, పొందగలుగుతారు. నిబ్బరంతో భారమైన పనులను నిర్వహించవలసిన సమయం. తలవని తలంపుగా డబ్బుకు సంబంధించిన వత్తిడి రావచ్చు. సంఘ కార్యాలలో పొరపాట్లు, ఇతరులవల్ల మాట రాకుండా చూచుకొనండి. చిన్నచిన్న ప్రయాణాలు చేయవలసి వస్తుంది రాజకీయాలలో చిక్కులను ఎదుర్కొంటు ముందుకు పోవలసిన సమయం. ఆడంబరం నిమిత్తం వృధా ఖర్చులు చేసుకుని పశ్చాత్తాపపడతారు. 28, 29 లలో మనోవ్యధ, విరోధాలు.

* * *

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మీ మంచితనము, న్యాయ పద్ధతి అవతలి వారి దృష్టిలో అసమర్ధతగా తోచవచ్చు.

> **గ్రహస్థితి**
>
> మిధునంలో అంగారకుడు, సింహంలో రాహువు, ధనుస్సులో సూర్య బుధ గురు శనులు, మకర-కుంభాలలో శుక్రుడు, కుంభంలో కేతువు, మేష వృషభ మిధున కటకాలలో చంద్రుడు.

ప్రతిపనిలోను ముందు వెనుకలు ఆలోచించుకొంటు ప్రవేశించవలసిన సమయం. కుటుంబంలో ప్రశాంతత, సుఖము కనుపిస్తవి. ఖర్చులకు తగినంతగా ఆదాయం పెరిగే సమయంకాదు. బంధువర్గంలో ఒకరిద్దరికి మీయందు అసూయాభావం కలుగుతుంది. ఇతరులకు సహాయం చేయటంవంటి బాధ్యతలను నెరవేర్చుకొనలేకపోతారు. ప్రయాణ కార్యక్రమాలు అనుకూలిస్తవి. వారాంతంలో ఆత్మీయులవద్దనుంచి కష్టవార్తలు తెలియగల అవకాశాలున్నవి. కుటుంబంలోనివారి ఆరోగ్యంగురించి జాగ్రత్తగా ఉండండి. ముఖ్యమైన పనులలో పొరపాట్లు వస్తవి. 1, 2 లలో వివాదాలు, వృధా ఖర్చు.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

బుద్ధిబలంతో ఎవ్వరిచేతిలోను చిక్కకుండా పనులు సాధించుకొనవలసినసమయం. మీరు చెప్పే ప్రతిమాటా అవతలివారి దృష్టిలో తప్పుగానే తోస్తూఉంటుంది. బాహ్య విషయాలలో మీ అంతస్తు పెరుగుతుంది. కాని, ధనసంబంధమైన చిక్కులు మీమార్గానికి అంతరాయంకాగల అవకాశాలున్నవి. వృత్తి వ్యాపారాలలో సాధారణమైన ప్రతిబంధకాలు కనుపిస్తున్నా మీ పట్టుదలతో కష్టనష్టాలు రాకుండా జాగ్రత్తపడగలుగుతారు. పిల్లలమూలంగా ఆనందం లభిస్తుంది. మీ శక్తిసామర్ధ్యాలను వినియోగించుకుని సంఘంలో గౌరవ ప్రతిపత్తులను సాధించుకోగలుగుతారు. వారం రెండవభాగంలో ఇతరుల మాటలను నమ్మి చిక్కు పనులలో ప్రవేశించవలసివస్తుంది. 2, 3 లలో ధనలాభం, ధర్మకార్యాలు.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఎవరు ఎన్ని చెప్పినా మీ బుద్ధి స్థిరంగా ఉండటంవల్ల విశేషమైన కష్టనష్టాలనుంచి తప్పించుకోగలుగుతారు. కోర్టు కచ్చేరీలలో అనుకూలమైనకాలం. బంధుమిత్రులలో మీయందు విశ్వాసభావం ఏర్పడుతుంది. శుభ పుణ్యకార్యాలకు అనుకూలపరిస్థితులు కనుపిస్తవి. ఇతరులను నమ్మి ఆరంభించిన వ్యాపార వ్యవహారాలు సుఖంగా కొనసాగక పోవచ్చు. ఈ సమయంలో విలువగల వస్తువులుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తవి. కాని, సంతృప్తిమాత్రం పొందలేకపోతారు. గతవారంకన్నా ఆదాయం బాగుంటుంది. పడమర ఉత్తరదిక్కులనుంచి అకస్మాత్తుగా శుభలాభ వార్తలు తెలియగలవు. కుటుంబంలోనివారితో కలహప్రసంగాలువచ్చి సమసిపోగలవు. 28, 29 లలో అదృష్టసూచనలు, శుభసంబంధమైన ఖర్చు.

* *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా)

ఈ సమయంలో మీ సుఖాన్ని కూడా మరచి ఇతరులకు సహాయంచేస్తారు. మనస్సులో ఉత్సాహము, పట్టుదల పెరుగుతవి. స్నేహితులు మిమ్మలను ఆదరించి సహాయం చేస్తారు. కుటుంబంలోనివారి ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండండి. ఆత్మీయుల వద్దనుంచి ఎదురుచూస్తున్న సహాయం లభించకపోవచ్చు. ముఖస్తుతిచేస్తు మిమ్మలను అనుసరించే మనుష్యులను కనిపెట్టి ఉండటం

అవసరం. సాధ్యమైనంతవరకు మీ కార్యక్రమాలు రహస్యంగా కొనసాగించుకొనటం మంచిది. భూములు మొదలయినవి కొనే ప్రయత్నాలు సుముఖంగా ఉంటవి. వృత్తి వ్యాపారాలలో మీమాట చలామణి బాగుంటుంది. 30, 31 లలో కార్యసిద్ధి, మిత్ర లాభం.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

ఎప్పుడు ఏపని చేస్తారో మీకే తెలియదు. అనేక సందర్భాలలో మీ కార్యక్రమం తలక్రిందులు అవుతుంది. అయితే దైవికంగా మీరు అనుకున్న దానికంటె ఎక్కువ ఫలితమే పొందగలుగుతారు. అధికారుల స్నేహం లభిస్తుంది. మానసికంగా ఇంతకు ముందున్నటువంటి సమస్యలు, సందేహాలు తొలగిపోయి స్థిరమైన మార్గం లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో గౌరవము, ధనాదాయము పెరుగుతవి. ప్రతిపనీ ఆరంభంలో ఎలా చేయగలుగుతామనే సందేహాలు తోచినా మిత్రుల సహాయముతో సుఖంగా నెరవేర్చగలుగుతారు. వారం రెండవ భాగంలో తలవనితలంపుగా ఇతరులవల్ల మోసం జరిగే అవకాశాలున్నవి. శుభవార్తలు తెలుస్తవి. పుణ్యకార్యాలు అనుకూలిస్తవి. 1,2 లలో అకస్మాద్ధన లాభం, విలాసకార్యాలు.

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఒకప్రక్క శ్రమ, మరొకప్రక్క ఖర్చులు మిమ్ములను వెంటాడగల సమయం. ఏ వ్యవహారంలోను ఉద్రేకం పనికిరాదు. నిదానంగా అవతలివారిని మెప్పించి మీ కార్యం సాధించుకోగలుగుతారు. వృత్తి ఉద్యోగాలలో ప్రతివారితోను సామరస్యంతో వ్యవహరించటం అవసరం. ఖర్చులు తగ్గించుకొనటానికీ, వ్యవహారరంగంలో చిక్కులను తొలగించుకొనటానికి మీరుచేసే ఆలోచనలు కొంతవరకు ఫలిస్తవి. ఆదాయం మామూలుగానే ఉంటుంది. కుటుంబంలోని వారిని సంతృప్తిపరచటం నిమిత్తం శ్రమపడవలసి వస్తుంది. దూరబంధువులవద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. నూతన ఆదాయ మార్గాలు నిదానంగా అనుకూలిస్తవి. 30, 31 లలో శుభకార్యాలు, సందేహాలు.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ ప్రథమ పాదం)

దైవబలం అసంపూర్తిగా వున్నటువంటి సమయం. ధైర్యము, ఉత్సాహము తగ్గుతవి. స్నేహితుల ప్రోత్సాహం బాగుంటుంది. ముందు ఎప్పుడో లభిస్తుందనే ఆశతో శ్రమపడవలసిన సమయం. సభాగౌరవం లభిస్తుంది. కొన్ని సందర్భాలలో పోటీ కనిపిస్తున్నా ఇతరుల సహాయంతో నిలబడగలుగుతారు. ముఖ్యంగా సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణం' సహస్రనామపూజ జరుపుకొనటంవల్ల ధైర్యోత్సాహాలు బాగుంటవి. వ్యవహార విజయం లభిస్తుంది. వారం రెండవ భాగంలో ప్రయాణాలు చేయవలసిరావచ్చు. ఇతరులకు సలహా చెప్పటం, సహాయం చేయటంవంటి బాధ్యతలు పైనపెట్టుకొనటం మంచిదికాదు. 1, 2 లలో కార్యభంగం, అనారోగ్యం.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

ప్రతిపనీ శ్రమసాధ్యంగా తోస్తుంది. చివరకు ఫలితం మామూలుగానే ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఇంతకుముందు ఉంటున్నటువంటి చిక్కులు తొలగిపోయి క్రొత్త సమస్యలు ఎదురుపడుతవి. త్రిప్పట, దేహశ్రమ అధికంగా ఉంటుంది. ఆత్మబంధువులు సమయంలో సహాయం చేస్తారు. పడమర దిక్కునుండి లాభవార్తలు తెలుస్తవి. లోగడ కొన్ని వారాలనుంచి మిమ్ములను బాధిస్తున్న ఆందోళన, చిక్కులు క్రమక్రమంగా తొలగి మనశ్శాంతికి మార్గం లభించగలదు. వ్యవహార రంగంలో అనుకూలమైన కాలం. ఇంతకు ముందు మొహమాటం నిమిత్తం పైనపెట్టుకున్న పనులు ఈసమయంలో శ్రమకరంగా కనిపిస్తవి. స్నేహితుల సలహాలు నమ్ముకుని అత్యాశకు పోవద్దు. 28 29 లలో విలాసవినోదాలు, మిత్రలాభం, విలువగల వస్తువులు కొంటారు. దేహశ్రమ.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ప్రస్తుతం ఖర్చు మాత్రం అధికంగానే కనుపించవచ్చు. కాని అనుకున్న పని అనుకున్నట్టుగా నెరవేరగల సమయం. గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతవి. మీతో పోటీ చేయటానికి ప్రయత్నించిన వారు చిక్కుపడి వెనక్కు తగ్గుతారు. ఆర్థిక పరిస్థితులు బాగా వృద్ధిపొంది మనస్సంతోషం లభిస్తుంది. క్రొత్త మనుష్యులతో కలిసిచేయు పనులు నిరాఘాటంగా సాగి ఫలితం పొందగలుగుతారు. కుటుంబంలో సుఖసంతోషాలు లభిస్తవి. మీరు అజాగ్రత్తగా ఉన్నా ఆత్మీయులు అన్నివిధాలా అండగా నిలుస్తారు. వారాంతంలో దుర్వార్తలు తెలుస్తవి, ప్రయాణసూచనలున్నవి. 30, 31 లలో అనారోగ్యం, దైవకార్యాలు.

ఈ వారము ధరలు

బంగారు ధర తేజీలో నిలకడగా వుంటుంది. 30, 31 లలో కొద్ది మందీరావచ్చు. వెండి ధర మందీవచ్చి, వారం రెండవ భాగంలో పెరుగుతుంది.

ధాన్యం ధరలో మందీ కనుపిస్తుంది. పసుపుధర తాత్కాలికంగా మందీవచ్చి పెరుగుతుంది. నువ్వులనూనె ధర నిలకడగా ఉంటుంది. వేరుశెనగపప్పు ధర 30 నుంచీ తేజీవస్తుంది. నూనె ధరలో మార్పు కనుపించకపోవచ్చు.

ప్రత్తి, నూలు, వస్త్రాల ధరలు కొద్దిగా పెరిగి, 1 తరువాత కొద్దిగా తగ్గుతవి. గోధుమలు ధర మందీలో ఉంటుంది. శెనగలకు గిరాకీ వస్తుంది. వారాంతంలో అకస్మాత్తుగా తగ్గవచ్చు.

* * *

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

కొనిపనులయందు ఆసక్తి అధికమవుతుంది. అందు నిమిత్తం వృథా శ్రమపడతారు. ప్రయాణాలు అనుకున్నట్లు జరుగవు. ఖర్చులు పెరుగుతవి. పిల్లల ఆరోగ్యం బాగుండదు. దూరమందున్న బంధుమిత్రుల వద్దనుంచి శుభవార్తలు తెలుస్తవి. వృత్తి ఉద్యోగాలలో మీ ధర్మాన్ని నిర్వర్తించుకొంటారు. అయితే పైవారి ఆదరాభిమానాలు సులభంగా పొందలేక పోతారు. కుటుంబ ఖర్చులు పెరుగుతవి. ప్రస్తుతం సంఘంలో మీ మాట చలామణి అయ్యే అవకాశాలు తక్కువ. వారాంతంలో కలహప్రసంగాలు వస్తవి. 29, 30 లలో శుభవార్తలు, స్వల్పలాభం, శ్రమ. ★

భిషగ్గర్వ భంగం

(గత సంచిక తరువాయి)

తరువాత సభలో నిలచి ఎవరూ మాట్లాడలేదు. దానితో సభ ముగిసింది. ఎవరిఇళ్లకు వారు బయలుదేరారు. దారిపొడుగునా వైద్యుడిని గూర్చి, జ్యోతిష్కుడిని గూర్చి ఎక్కువగా అందరూ విమర్శిస్తున్నారు. వైద్యశాస్త్రజ్ఞుని వెంట చాలామంది గుంపులుగా వెడుతున్నారు. ఇంతమంది ప్రజల్ని మెప్పించినందుకు ఆయనకు ఎక్కడలేని అహంకారం వచ్చింది. రెండు చేతులతో మీసాలు సరి చేసుకుంటూ తనగుఱ్ఱాన్ని ఎక్కి వెళ్లిపోయాడు. జ్యోతిష్కుడు మాత్రం దీనంగా బయలుదేరాడు. ఆయనను చూసి "మళ్లీ అవకాశం ఇస్తే వైద్యుడి మీసాలు ఎగిరిపోయేవి" అని కొందరు సానుభూతిచూపారు.

ఇంతవరకు సభలో ఉండి అందరి వాదాలూవిన్నవారిలో చోళదేశపు బ్రాహ్మణుడు ఒకడున్నాడు. అతని పేరు విక్రమశర్మ, మహారాజు జరిపే సత్కారాలసంగతి ఇంతకుపూర్వమే విన్నాడు. అతనికి ఏ విద్యలోను సరిగ్గా పాండిత్యంలేదు. కాని అన్ని శాస్త్రాలలోను, అన్ని కళలలోను తనతో పోటీచేసేవారే లేరని వాదిస్తూంటాడు. అప్పటికప్పుడు తోచిన ఉపాయాలతో ఎలాంటి పండితులకైనా సమాధానాలు చెప్పి, హడలకొడుతూంటాడు. ఎప్పటికైనా అనంగ మహారాజు కొలువులో తన

తాయ్యేటి భానుమూర్తి

ప్రజ్ఞ చూపెట్టి మహారాజు అర్థసింహాసనాన్నే సంపాదించాలని విక్రమశర్మ కోరిక, ఆ ఉద్దేశ్యంతోనే ఈ సభకువచ్చి అంతా పరిశీలించటానికి ప్రజలలో ఒకడుగా కూర్చున్నాడు. ఏ శాస్త్రంలోను సరిగ్గా పాండిత్యంలేని తను మహారాజు చేసే పరీక్షలో ప్రత్యక్షంగా ఎలా నిలవడం? అయినా సమయంవచ్చి నిండు రాజాస్థానంలో తన ప్రజ్ఞ చూపించి మహారాజు అర్థ సింహాసనాన్ని సంపాదించి పండితులందరికీ ఆశ్చర్యం కలిగించాలనుకున్నాడు. అందుకోసం ఆశానగరంలోనే నివసించాలి. ఆ అవకాశం ఈవేళ అతనికి వచ్చింది. ముందు ఓడిపోయిన జ్యోతిష్కుడిని పట్టుకుంటే తరువాత ఉపాయం ఆలోచించి కార్యం సాధించవచ్చునని ఆయన వెనుకనే బయలుదేరి జ్యోతిష్కుడింటికి చేరాడు.

జ్యోతిషపండితుడు తన వెనుక నుండి వచ్చిన విక్రమశర్మను తిరిగి చూసి మీారెవరు? ఎందుకు వచ్చారు? అని ప్రశ్నించాడు.

నాపేరు విక్రమశర్మ. మాది చోళదేశం. ఈనాటి రాజసభలో పండితగోష్ఠి చూడాలని వచ్చాను. కాని నేను చూసింది మఱొకటి. తలాతోకాలేని నియమాలతో పండితుల్ని ఈసభలో అవమానించడమే జరుగుతూంది. ఏమైనాసరే ఆ వైద్యశాస్త్రజ్ఞుడికి బుద్ధి చెప్పాలి. బుద్ధిలేని మహారాజుకు కూడా బుద్ధిచెప్పాలి. ఆపని నేనుచేస్తాను. మీరు విచారపడకండి. అవకాశం వచ్చేవరకు నేనీ ఊళ్ళోనే వుంటాను. అని బదులు చెప్పాడు విక్రమశర్మ.

జ్యోతిషపండితునికి ఎక్కడలేని సంతోషం వచ్చింది. ఆ అవకాశం వచ్చేవరకు తమయింటనే ఉండమన్నాడు విక్రమశర్మను. అతడు కూడా సరేనని ఒప్పుకున్నాడు. రోజూ భోజనంచెయ్యడం ఊరంతా తిరగడం - ఇదే విక్రమశర్మపని.

అనంగమహారాజుకు తెలియకుండానే ఆయనశరీరం రోజురోజుకు లావెక్కడం ప్రారంభించింది. ఒకరోజున మహారాణీ చెప్పేవరకూ రాజుకు ఈ విషయమే పట్టలేదు.

బాల సాహితి

ఆరుమాసాలు గడిచాయి. రాజుగారి శరీరం మరీ లావెక్కింది. ఎలాగైనా శరీరం తగ్గించుకోవాలని రాజుగారు నిశ్చయించుకొన్నారు. వైద్యులంతరూ వచ్చి తలొకసలహా యిచ్చారు. ఆ ప్రకారం అన్ని మందులు రాజుగారు మింగారు. కాని శరీరంలావు తగ్గలేదు.

చివరకు మీసాల వైద్యుడు పరీక్షించి "మహారాజా; ఇది అంత పెద్దవ్యాధేమీకాదు. వైద్యశాస్త్ర సహాయం ఉండగా మీకేమిభయం? ఇదుగో ఈమందు రోజూ తేనెతో సేవించండి. ఉదయం సాయంత్రం క్రోసుదూరమైనా నడవండి. మీరు రెండుమండలాలు ఇలా చేస్తే మామూలు మనిషిగా మారిపోతాను," అని నల్లటిమందు కొన్ని యిచ్చాడు. మహారాజు ప్రతి రోజు రెండుపూటలా వైద్యశాస్త్రజ్ఞుడు చెప్పినట్లుగానే చేస్తున్నాడు. ఆయాసంతో నడవలేక నడవలేక నడుస్తున్నాడు. విదూషకుడు కాలక్షేపం కోసం కూడావుంటున్నాడు. మండలం గడిచింది. రాజుగారికి ఆకలి ఎక్కువై మరొక ముద్ద అదనంగా తింటున్నాడు. వెన్న, పాలు, పళ్లు, ఫలహారాలు లెక్కలేనన్ని ప్రతి రోజు మాటిమాటికి ఆరగిస్తున్నారు. లేకపోతే నిద్రపట్టక బాధపడుతున్నాడు. ఈ విధంగా శరీరం మరీ కొంచెం లావెక్కింది. రెండు మండలాల గడువు పూర్తయ్యింది. ఇంక లాభం లేదనుకొని మహారాజు ఒకనాడు పండితసభలో తన నిర్ణయాన్ని ఇలా ప్రకటించాడు. "మహామహులారా; రోజురోజుకు నా శరీరం లావెక్కిపోతోంది. మన వైద్యశాస్త్రజ్ఞులవారిచ్చిన మందువలన ప్రయోజనం కనుపించలేదు. మీలోగాని, మరెవరైనాగాని నా శరీరాన్ని తగ్గిస్తే నా అర్థసింహాసనాన్నే ఇస్తాను. అందుకు ప్రయత్నించండి." అనడంతో వైద్యశాస్త్రజ్ఞుడు లేచి "మహారాజా; నాకు ఇంకొక్క అవకాశం ఇవ్వండి. వైద్యశాస్త్ర సహాయంతోనే మీ శరీరాన్ని తగ్గిస్తాను. అని కొంచెం కీవిగానే అడిగాడు. మహారాజుకు ఇంకా వైద్యుడిమీద ఆశ వుంది. "సరే! అదేదో ఇక్కడే చెప్పండి" అని వైద్యుడికేసి చూశాడు మహారాజు. "మహాప్రభూ; ప్రతిరోజు ఉదయం చల్లని నీటిలో తేనెకలిపి తీసుకోండి. రాత్రిపూట భోజనం మాని వెయ్యండి" అన్నాడు వైద్యుడు.

సభలోనుండి ఒక యువకుడు లేచి "ఓ మీసాల వైద్యుడా! ఇది కుదర్చడం నీ వల్ల కాదు. నీ వైద్యశాస్త్రంవల్ల అంతకన్నా కాదు" అని పరిహసించాడు. ఆ వైద్యుడికి వళ్లు మండింది. "ఓరీ; నీ వెవరు? ఇది నా వల్ల కాకపోతే నీవల్ల నవుతుందా వైద్యశాస్త్రానికి రోగం కుదరకపోతే మరే శాస్త్రానికి కుదురుతుంది? నీకు శక్తిఉంటే నాతో పందెంవేసి ముందుకురా! అంతేగాని కబుర్లతో కాలక్షేపం చెయ్యకు."

పొడుపు పద్యాలు

నీదు తల్లి కోర్కె నిర్మలహృదయాన
తీర్చగల్గినాను తెంపుతోడ
తాతనంచు నన్ను తలచుచుందువు నీవు
నాదు నామమేమి నాణ్యకాడ!

* * *

అన్నదానమేల అర్థదానమదేల
వస్త్రదానమేల వంతయేల
సర్వదానములకు సాటి నే నాదును
నాదు నామమేమి నాణ్యకాడ?

* * *

తపములేల—అధిక దానధర్మములేల
యజ్ఞమేల—గొప్పయాగమేల
సర్వపుణ్యములకు సాటి నే నాదును
నాదు నామమేమి నాణ్యకాడ!

* * *

కుడువ కూడులేక కుములుచుండుటదేల
కట్టబట్టలేక కలగుటేల
నన్ను కల్గియుండు మన్నియు నమకూరు
నాదు నామమేమి నాణ్యకాడ!

(జవాబులు 58 వ పేజీలో)

సన్నారెడ్డి జయరామిరెడ్డి

అని సింహంలా అరిచాడు. సభలో మాాఋమూల ఉన్న యువకుడు ముందుకువచ్చి "ఓ వైద్యుడా; మహారాజు రోగం నేను జ్యోతిషంలో కుదురుస్తాను. అర్థసింహాసనం సంపాదిస్తాను. నీవుచెప్పిన వైద్యంతో ముందు ప్రయత్నించు. నీవు ఓడిపోతే నీ పందెమేమిటి?" అన్నాడు దురుసుగా.

వైద్యుడు కళ్లెఱ్ఱజేసి "నేను మహారాజు శరీరాన్ని నెలరోజులలో తగ్గించలేకపోతే నాస్థానాన్ని వదులుకుంటాను. మహారాజు ఇచ్చిన అగ్రహారాలు నీవు ఎవరికి యిమ్మంటే వారికి యిచ్చివేస్తాను. నేను ఈ దేశంనుండే వెళ్ళిపోతాను." అని పందెం వేశాడు.

యువకుడు నవ్వి "తథాస్తు! మహారాజా; మీ జాతకం నాకు ఇప్పించండి. ఈ లోపుగా దాన్ని పరిశీలించి నెలరోజుల తర్వాత సభకు


భిషగ్గర్వభంగం

వస్తాను. వైద్యుడు ఓడిపోతే నా నలహా మీాకిస్తాను. వైద్యుడు నెగ్గితే ఆ వైద్యునికినాజీవితాంతం బానిసగా ఉంటాను. ఇదే నా ప్రతిజ్ఞ" అని విన్నవించాడు.

'సరే! అలాగే చేద్దాం. నా జాతకం మన ఆస్థానజ్యోతిషపండితులు మీాకివ్వగలరు. మీా నామధేయం అడుగవచ్చునా?' అన్నాడు, మహారాజు.

'తప్పకుండా! నాపేరువిక్రమశర్మ. మాది చోళదేశం. తిరిగి నెలరోజులకు కనుపిస్తాను. సెలవిప్పించండి' అని సభలోనుండి బయలుదేరాడు. మహారాజు విక్రమశర్మకు ఈ నెల రోజులు దినవెచ్చం పంపించవలసిందిగా మంత్రికి ఆజ్ఞ ఇచ్చారు.

విక్రమశర్మ జ్యోతిష్కుని యింటనే వుండి మహారాజుఇచ్చిన దినవెచ్చం ఆ జ్యోతిష్కునికే ఇచ్చివేస్తూ హాయిగా భోజనంచేసి కాలక్షేపంచేస్తున్నాడు. నిజానికి మహారాజు జాతకం అంతకుముందే జ్యోతిష్కుడిని అడిగితీసికొని పరిశీలించాడు. ఇక తను పడవలసిన శ్రమ ఏమీాలేదు. ఇతనిప్రవర్తనజ్యోతిష్కునికే ఆశ్చర్యం కలిగించడంవలన ఒకరోజున ఆ జ్యోతిష్కుడు "విక్రమా; ఎవరైనా వైద్యంచేసి రోగం కుదురుస్తారుగాని జ్యోతిషంచెప్పి కుదురుస్తారా? నీవు వట్టి వెఱ్ఱివాడవు పాపం! నామూలాన నీవు ఆ వైద్యుడికి బానిసవైపోతున్నావు. నీవు దేశం విడిచి వెళ్లిపో. బ్రతికివుంటే బలుసాకైనా తినవచ్చును." అని విక్ర ముడితో అన్నాడు. విక్రమశర్మ అందుకు నవ్వి "పండితశ్రేష్ఠా; రాజు



గారిరోగం నేనే కుదురుస్తాను. అర్థ సింహాసనాన్ని ఆక్రమిస్తాను. వైద్యుడిని ప్రవాసం పంపిస్తాను. మీకు ఆ అగ్రహారాలన్నీ ఆ వైద్యుడిచేతనే దానం ఇప్పించి నమస్కరింపచేస్తాను. ఇదంతా ఆ బ్రహ్మరాసినరాత. ఏన్నడరూ తప్పించలేరు" అని జవాబిచ్చాడు.

ఎలా కుదురుస్తావు రోగం? అన్నాడు జ్యోతిష్కుడు.

అదంతా రహస్యం! ఒక్కమహారాజుకు తప్ప ఇంకెవరికీ చెప్పరాదు. ఫలితం వచ్చాకనే పండితసభలో ఆ రహస్యాన్ని విప్పి చెప్తాను, అని జ్యోతిష్కుడికి ఆశ పుట్టించాడు. నెల రోజులూ గడిచిపోయాయి.

రాజుగారు సభకు వచ్చారు. శరీరం ఏమీ తగ్గలేదు. ఆయాసపడుతూ సింహాసనం మీద కూర్చున్నారు. మంత్రిలేచి "వైద్యులవారు తమప్రతిజ్ఞప్రకారం నడుచుకోవచ్చు. విక్రమశర్మగారు ఇప్పుడు తమ సలహామహారాజుకు చెప్తారు." అన్నాడు.

వైద్యశాస్త్రిజ్ఞుడు తన స్థితికి విచారపడుతూ "మహామంత్రీ, వైద్యంతో కుదరని రోగం జ్యోతిష్యంతో కుదురుతుందా? విక్రమశర్మ ప్రజ్ఞ చూసిన తర్వాతనే నాప్రతిజ్ఞ ప్రకారం నడుచుకుంటాను. అనుమతించండి." అని ప్రార్థించాడు.

విక్రమశర్మ లేచి "మహామంత్రి; వైద్యులవారు ముందుగా ప్రతిజ్ఞ ప్రకారం తమ స్థానం ఖాళీ చెయ్యాలి. నాఆజ్ఞప్రకారం ఈ జ్యోతిష పండితునికిఅగ్రహారాలన్నీ దానం చెయ్యాలి. నాప్రజ్ఞ చూడదలిచినంతవరకు ప్రేక్షకులలో కూర్చుండవచ్చును. ఇవన్నీ జరిగితే నాసలహా మహారాజుకు మాత్రమే రహస్యంగా చెప్తాను. ఆయన దాని ఫలితం పొందాక నెలరోజుల తరువాత ఆరహస్యం సభలో చెప్తాను." అని తన స్థానంలో కూర్చున్నాడు.

మహారాజు ఆజ్ఞప్రకారం వైద్యశాస్త్రిజ్ఞుడు తన అగ్రహారాలు జ్యోతిష్కునికి దానం చేశాడు. తన స్థానంవదిలి ప్రేక్షకులలో కూర్చున్నాడు. విక్రమశర్మ మహారాజును రహస్యమందిరానికి తీసికొని వెళ్లి "మహారాజా; నెలరోజులవరకు మీరీ మందిరాన్ని విడువకూడదు. అన్నపానాలు ఇక్కడనే పెట్టి దాసీలు కూడా మీకు కనిపించకుండా తెరవెనుకనుండే వెళ్లిపోవాలి. మహామంత్రీ, మహారాణీ కూడా నెలరోజులవరకు ఇక్కడకు రాకూడదు. తరువాత సభలోనే మిమ్మల్ని కలుసుకుంటాను." అని ఏదో రహస్యంగా మహారాజు చెవులోచెప్పి వెళ్లిపోయాడు.


విక్రమశర్మ వెళ్లినదగ్గరనుండీ మహారాజు అతని నియమాలు పాటిస్తూనే వున్నాడు. మనస్సు మాత్రం ఏమీ బాగుండలేదు. వెఱ్ఱి వెఱ్ఱి చూపులు చూస్తూంటాడు. నిద్రలో కలవరించి ఉలిక్కిపడిలేచి పచార్లు చేస్తూంటాడు. ఎన్నిరుచిగల పదార్థాలు వస్తూనా్న నోటముట్టడు.


> లోభి: ఏమయ్యా యిలా వచ్చావు?
>
> యాచకుడు: చిత్తం బాబూ ధర్మమూర్తులూ నా యిల్లు కాలిపోయింది ఏదైనా సాయంచేస్తారని వచ్చానండి.
>
> లోభి: ఈ పట్టుకు బాధ పెట్టకు. ఇంకోసారి తప్పకుండా చేస్తాను.
>
> పి. వి. సీతారామమూర్తి(నీలాద్రిపురం)

ఎప్పుడూ దిగులుగా వుంటాడు. బాగా నీరసించిపోయాడు. మంచం మీదనుండి లేస్తే కళ్లు తిరుగుతున్నాయి. నెలరోజులనాటికి మహారాజు బాగా చిక్కిపోయాడు. గడువుతీరిపోయింది.

మఱునాటిసభకు మహారాజు మెల్లిగా నడిచివచ్చి సింహాసనంలో కూర్చున్నాడు. సభంతా "ఆశ్చర్యం! ఆశ్చర్యం! అని ప్రతిధ్వనించింది. మంత్రికూడా విస్తుపోయి శిలాప్రతిమలానుంచున్నాడు. వైద్యుడు ఏమిచెయ్యాలో తోచక తలవంచుకుని ఆలోచిస్తున్నాడు. మంత్రి ఆలోచనలోనుండి తేరుకుని 'వైద్యశాస్త్రిజ్ఞుడెక్కడ?' అని గర్జించాడు. "వారు పాతాళలోకం పరిశీలిస్తున్నారు మహామంత్రీ" అన్నాడు జ్యోతిష్కుడు. సభంతా పక్కున నవ్వింది. వైద్యశాస్త్రిజ్ఞుడులేచి "మహామంత్రీ విక్రమశర్మగారిచ్చిన సలహా విని నేను వెళ్లితాను. అనుమతించండి." అని ప్రాధేయపడ్డాడు.

విక్రమశర్మ చిరునవ్వు నవ్వుతూ లేచి సభామధ్యంలోకి వచ్చాడు. సభలోని వారంతా అతనినోట ఏ మహారహస్యం రాబోతోందో అని నిశ్శబ్దంగా ఉండి పరిశీలిస్తున్నారు. మహాప్రభూ; మీకింక భయంలేదు. మీరు వెయ్యేళ్ళు వర్ధిల్లాలి. ఇది నాఆశీస్సు" అని విక్రమశర్మ అంటూండగా మహారాజు "ఆ...... నాకు వెయ్యేళ్లాయుస్సా?......" అంటూ ఉత్సాహంతో లేచాడు. ఆయనకు ఎక్కడలేనిబలం వచ్చింది. తిన్నగా సభమధ్యకు వచ్చి విక్రముణ్ణి తన సింహాసనం దగ్గరకు తీసుకువెళ్ళి "ఇప్పుడు చెప్పండి, ఆ రహస్యం" అంటూ ఆనందబాష్పాలు రాల్చాడు. విక్రమశర్మ మళ్లీ





భిషగ్గర్వభంగం

ప్రారంభించాడు. "మహామహులారా మహారాజు జాతకం పరిశీలించాను. ఆయనకు గడచిన నెలలో గండం వుంది. నిజానికి ఆయన కృత్రిమ శరీరం నశిస్తే ఆమారకంతప్పుతుంది. అందుకే వారి కాగండంసంగతి చెప్పాను. ప్రాణం మీద ప్రతివారికి తీపే! మహారాజు దిగులుతో నెల రోజులు బాధపడ్డారు. నిద్ర కూడా ఉండదు. ఆహారం సయించదు. మనోవ్యాధితో తీసుకోవడంవల్లనే ఆయన కృత్రిమశరీరం తగ్గిపోయింది. నెలరోజులు ప్రాణభీతి మాత్రమే వారిని బాధించింది. జ్యోతిషశాస్త్రి సహాయంవల్లనే ఇదంతా జరిగింది. ఎంతటి ఆపదలనైనా ఉపాయంతో తొలగించవచ్చునని మీకు రూఢి చేయగలిగాను. అన్ని శాస్త్రాలు, కళలు కూడా గొప్పవే! ఒకదానితో మరొకదాన్ని పోల్చడం అవివేకం! ఏది అవసరంవచ్చినప్పుడు అది ఉపయోగపడుతుంది. శాస్త్రాలు ఎంత గొప్పవైనా మానవులు తమబుద్ధితో కూడా ఆలోచించి ఆ శాస్త్రాలను ఉపయోగపడేటట్లు చేసికోవాలి. అప్పుడు ప్రతిశాస్త్రం అవసరమే!" అని సింహాసనంలో మహారాజుతో కలిసి కూర్చున్నాడు.

వైద్యుడు మెల్లగా లేచి దారి బట్టాడు. సభాసదులందరూ విక్రమశర్మ ప్రజ్ఞకు వైద్యుడి గర్వభంగానికి సంతోషించారు. ఆ నాటినుండి విక్రమశర్మ ఆ నగరంలోనే వుంటూ మహారాజుకు స్నేహితుడై అతని సత్కారాలూ, గౌరవాలూ అనుభవిస్తూ కాలక్షేపం చేస్తున్నాడు.★

(అయిపోయింది)

న్యూఢిల్లీ లేఖ

(11-వ పేజీ తరువాయి)

ఫలప్రదమైనదా; ఆదేశంలో జారు నిరంకుశత్వాన్ని రూపుమాపింది టాల్‌స్టాయ్ సిద్ధాంతమేనా?

* * *

ఉత్తరప్రదేశ్ రాజకీయ "టగ్ ఆఫ్ వార్" ప్రథమ "రౌండ్" శ్రీ సి. బి. గుప్త విజయంతో సమాప్తమైంది. ఇలాంటి సంఘటనలను ముచ్చటగా అభివర్ణించే పర్షియన్ సామెత ఒకటిఉన్నది. పొరుగింటి వ్యక్తి కాళ్ళమీద ఆధారపడి స్వర్గానికి ఎగప్రాకినట్లయితే, అది నరకంకంటే హీనంగా ఉంటుంది అని ఆసామెత. పండితపంత్ ప్రత్యక్షంగా జోక్యం కలిగించుకున్నందువల్లనే శ్రీ గుప్త ఉత్తరప్రదేశ్ శాసనసభా కాంగ్రెసు పార్టీ నాయకుడుగా ఎన్నికయ్యారు. శ్రీ గుప్త ఎన్నిక కాకపోతే విదేశాలలో ప్రధానమంత్రి ప్రతిష్ఠ దెబ్బతింటుందనీ, అప్పుడు శ్రీ నెహ్రూ తమపదవికి రాజీనామా చేయవలసి వస్తుందనీ ఆయన కాంగ్రెసు వాదులకు నచ్చచెప్పారు.

ఇప్పుడు శ్రీ గుప్త తమ ఎన్నికకు మూల్యం చెల్లించుకోవలసివస్తోంది. ఇంతవరకు అందిన సమాచారాన్ని బట్టి, శ్రీ గుప్త ఇద్దరు లోక్‌సభ సభ్యులను తమమంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. వీరిలో ఒకరు బెంగాలీ అనీ, మరొకరు బీహారీ అనీకూడా తెలిసింది. ఈ ఎత్తును మూడువిధాలుగా వ్యాఖ్యానించవచ్చు. తమకు సహాయం చేసినవారిని సంతోషపెట్టడానికి శ్రీ గుప్త ప్రయత్నిస్తున్నారనేది మొదటివ్యాఖ్యానం. అంతేకాక, ఉత్తరోత్తరా తమను పైకి లాగగల సమర్థులని తోచినవారినే ఢిల్లీనుంచి ఆయన ఎన్నుకుంటున్నారు. అయితే ఈ ఇద్దరు వ్యక్తులు ఇంతవరకు కేంద్ర మంత్రులు అవలేకపోవటంతో వీరి బలం ఏపాటిదో తెలుస్తూనే ఉన్నది.

ఇక రెండవ వ్యాఖ్యానం. ఉత్తరప్రదేశ్ శాసనసభా కాంగ్రెసుపార్టీలో తమకు అనుకూలురైన వ్యక్తులెవరూ శ్రీ గుప్తకు కనుపించలేదనీ, అందువల్లనే ఆయన ఇతర రాష్ట్రాలవారిని తెచ్చుకోవలసి వచ్చిందనీ, దీనితాత్పర్యం. ఏదో ఒక పదవి సంపాదించుకోవాలని తంటాలుపడుతున్న కాంగ్రెసువాదులకు ఈ సందర్భంలో కొంత ఆశ కలుగవచ్చు.

శ్రీ గుప్త తమ సహచరులను ఎన్నుకోటంలో సంకుచితమైన రాష్ట్ర సరిహద్దులకే తమ దృష్టిని పరిమితం చేసుకోక, అఖిలభారత దృక్పథంతో వ్యవహరిస్తున్నారనేది మూడవ వ్యాఖ్యానం.

అయితే ఈ విషయాలన్నీ రాజ్యాంగాన్ని అనుసరించి సర్దుబాటు కావలసి ఉన్నాయి. శ్రీ గుప్త స్వయంగా ఎన్నిక కావటమే కాక, బయటనుంచి తెచ్చుకునే ఇద్దరు వ్యక్తులను కూడా ఎన్నికచేయించాలి. రాజ్యాంగం ధర్మమా అంటూ ఇందుకు సురక్షితమైన దొడ్డిత్రోవ ఒకటి కల్పించింది. అదే శాసనపరిషత్తు. తమ ఇద్దరు మిత్రులను ఆ సభకు ఎన్నిక చేయించటం శ్రీ గుప్తకు ఏమంత కష్టమైన పని కాకపోవచ్చు. తానుమాత్రం శాసనసభకే ఎన్నిక కాదలచినట్లు ఆయన వెల్లడించారు. ఈ దెబ్బతో విదేశాలలో శ్రీ నెహ్రూకు గల ప్రతిష్ఠ అంటే ఓటర్లకు ఏపాటిగౌరవం ఉన్నదీ తేలిపోతుంది.

భారతీయ ప్రజాస్వామ్యం ఏ దశకు దిగజారింది! శ్రీ నెహ్రూ సూచనలు హేతువాదానికి, రాజ్యాంగానికి ఎంత విరుద్ధంగా ఉన్నా వాటిని గౌరవించి తీరవలసిందే.

ఈ విషయాన్నే ఇంకో విధంగాకూడా చెప్పవచ్చు. శ్రీ పంత్‌కుగాని, శ్రీ లాల్ బహాదూర్ శాస్త్రికిగాని ఎదురుతిరిగితే ఈసారి ఎన్నికలలో పోటీచేసేందుకు టిక్కెట్టు లభించకపోవచ్చునని ఉత్తరప్రదేశ్ శాసనసభా సభ్యులకు బాగా తెలుసు. కాంగ్రెసు టిక్కెట్టు లభించకపోతే, ఉన్న పలుకుబడి అంతా తుడిచిపెట్టుకొని పోవటమే కాక, పెక్కు సందర్భాలలో జీవనభృతి కూడా కోల్పోవలసివస్తుంది. చాలామందికి మరో పనికూడా ఏమీ లేదు. స్వతంత్రపార్టీకి నాయకులైతే ఉన్నారుగాని, అనుయాయులు లేరు. ఉత్తరప్రదేశ్‌లో ఆ పార్టీ సువ్యవస్థితమైతే సుమారు 200 మంది కాంగ్రెసు వాదులు దానిలో చేరేవారే. శ్రీ నెహ్రూకు యథార్థ పరిస్థితులు తెలుసు కాబట్టే, ప్రతిపక్షాన్ని గూర్చి పట్టించుకోటం మానేశారు.

* * *

నూనె, ఇంధన వాయువుల మంత్రి శ్రీ మాలవియా అసలు సమస్యలను దాటివేయటంలో సిద్ధహస్తులయ్యారు. రష్యన్ నూనె అమ్మకాలను గూర్చి పార్లమెంటులో వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, విదేశీ కంపెనీలు "ధరల యుద్ధం" కొనసాగిస్తున్నాయని దుయ్యబట్టారు. నిజానికి ఇది గతంలో చర్వితచర్వణంగా చెప్పిన సమాధానమే. తాము ఏర్పాటుచేసిన భారతీయ నూనె కంపెనీకి ఒక్క పెట్రోలు పంపుగాని, మార్కెటింగ్ సదుపాయాలుగాని లేవనే విషయాన్ని ఆయన బహు తెలివిగా కప్పిపుచ్చారు. కాంగ్రెసుపార్టీకి ఉన్న అత్యధిక సంఖ్యాబలం పుణ్యమా అని అట్టే ఇబ్బంది పడకుండానే ఆయన బయటపడగలిగారు.

☆

80 రోజులలో భూప్రదక్షిణం

(10-వ పేజీ తరువాయి)

విధంగా అది సహజమే. పణాలు ఒకటికి నూటయాభైనుంచి రెండువందలకెట్లవరకూ పడుతూ వచ్చాయి. అంతలో ఏడవరోజున అనుకోని సంఘటన ఒకటి జరగడంతో ఆపాటికూడా లేకుండా పోయింది

ఆరోజు రాత్రి 9 గంటలవేళ స్కాట్లండ్ స్క్వేర్; సెంట్రల్ ఆఫీసులోని పోలీసు కమిషనర్ 'కోవాన్'కు సూయజ్ నుంచి ఒక టెలిగ్రాం వచ్చింది.

సూయజ్-టు లండన్

"కోవాన్; కమిషనర్ ఆఫ్ పోలీస్, సెంట్రల్ ఆఫీస్, స్కాట్లండ్ స్క్వేర్ : బాంకుదొంగ ఫిలియాస్ ఫాగ్ దొరికాడు. అతన్ని అరెస్టుచెయ్యడానికి వెంటనే ఒక వారంటును బొంబాయికి పంపండి."

ఫిక్స్, (డిటెక్టివ్.)

ఈ టెలిగ్రాంతో ఫాగ్ యాత్రలో ఆంతర్యం అందరికీ తెలిసిపోయినట్టయింది— బాంకు ఆఫ్ ఇంగ్లండ్‌లో చోరీ చేసినవాడు పట్టుబడకుండా ఫాగ్ నాటకం ఆడుతున్నాడని. వెంటనే, రిఫారంక్లబ్‌లో ఫైళ్ళలో వున్న అతనిఫోటో తీయించి కనుముక్కు తీరు, విగ్రహం, వాలకం అన్నీ శ్రద్ధగా క్షుణ్ణంగా పరిశీలించారు. బాంకు దొంగ గురించి ఆరాలు తీసినపుడు, అతన్ని చూశామన్న వారు చెప్పిన గుర్తులన్నీ ఇతనిలోను ఉన్నాయి. అంతా అజీపోలిక.

అక్కసుతో ఫాగ్ చరిత్రని పునశ్చరణ చేశారు. అతను ఎంత గుంభనగా, గుట్టుగా ఉండేవాడో చెప్పుకున్నారు. ఇందుకన్నమాట అనుకున్నారు. హఠాత్తుగా బయల్దేరిపోవడంలో అసలువిషయం ఇదన్నమాట అని పసిగట్టారు. ప్రపంచయాత్ర అనే వంక పెట్టుకుని, దాని నిజాయితీకోసం తిలాతోకాలేని పందెం ఒకటికట్టి అతను ఇలా దేశాటనాలు చెయ్యడంలో ఒక్కటే లక్ష్యం వున్నట్లు విశదంఅయింది. ఇంగ్లాండు పోలీసు వాళ్ళు అసలు దొంగఆచూకీ పట్టుకోకుండా, వాళ్ళని తనవెంటనే దేశదేశాలాతిప్పుకోవడంకోసం ఇంతపని చేస్తున్నాడన్న మాట.

[సశేషం]

[ఇందులో ఫోటోలు "ట్వెంటియత్ సెంచరీఫాక్స్" వారి సౌజన్యంతో]

(పొడుపు పద్యాలు)

—గాంధీతాత, నిదానము, సత్యము, విద్య.

బస్ స్టాప్
(21-వ పేజీ తరువాయి)

వాళ్ళని పరిశీలిస్తున్న 'సూర్యా'రావు ఉండలేక ఫక్కున ఒకనవ్వునవ్వి - అంతటితో పూరుకోలేక ఫకాలున మరోసారి నవ్వి తర్వాత ఫకఫకా నవ్వుతుంటూ-నల్లగా... సుబ్బుగా మహాకాయం గలిగిన 'మేఘాల' రావు వెనక్కు పోయాడు.

* * *

వాళ్ళిద్దరూ మొదటిసారిగా చూసుకున్న క్షణంగడిచిపోయింది. మరోక్షణం వచ్చింది. అదికూడ గడిచిపోయింది—ఆరోజుపోయి మరోరోజు వచ్చింది... అదికూడా పోయింది—ఆ నెలను నెట్టి మరో నెల వచ్చింది... దాన్ని మెడపట్టుక గెంటి యింకొక నెల వచ్చింది.

కాలం గడిచినకొద్దీ వాళ్ల మనస్సులు దగ్గఱ పడిపోతున్నాయి...పోయాయి... వాణీహృదయంనిండా కృష్ణమోహనే. ఆమె తలపులన్నీ అతనిపైనే. కృష్ణమోహన్లో

కూడ 'డిటో'.

ఆ చిలిపికళ్లమ్మాయి కంటిపాపలో తన చిత్రాన్ని చూసుకొని మురిసిపోతాడు కృష్ణమోహన్. ఆమె కంటిలోకి ఎప్పుడు చూచినా తన ప్రతిబింబం కనిపిస్తుంటే...తనను ఎంత ప్రేమించకుండా ఉంటే ఆమె కళ్లల్లో తనను నిలుపుకొని వుంటుంది?!" యిలా ఆలోచించుకుంటూ ఉబ్బితబ్బిబ్బయి పోతూ వుంటాడు.

బాణికూడ ఆ కవ్వించే కళ్లుగల అబ్బాయి కండ్లలోకి చూసి అలాగే 'ఫీ' లవుతూ వుంటుంది.

*　　*　　*

....

ఓరోజు కూడావిడిగా అతని గదిలోకి వచ్చింది బాణి. వస్తూనే "మోహన్" చిన్నపుడు నీవొక అమ్మాయిని ప్రేమించావు కదూ" అని అడిగింది.

"చిన్నప్పుడుమాటకేం యిప్పుడు మాటేమిటి?! అయినా ఎవరినబ్బా ప్రేమించాను?! చిన్నతనంలో ఎంతమందినైన ప్రేమించి వుండవచ్చు. ఆ ప్రేమ యీ ప్రేమలాంటిది కాదుగదా...దాన్ని ప్రేమ అనేకంటే...యిష్టత...మరేదో అనటం మంచిది"-ఆలోచిస్తున్నాడు.

మీది వైజాగ్ కదూ?...

"మాది వైజాగని ఏనాడో చెప్పానుకదా! మరలా ఎందుకీ చొప్పదంటు ప్రశ్న" అనుకున్నాడు.

మీ నాన్నగారు సిండియాలో ఉద్యోగం చేసేవారు...అవునా?...ఆయనతో నేవుద్యోగం చేస్తూ మీయింటిప్రక్కనే మరొకాయన వుండేవారు. ఆయనకొక అమ్మాయి వుండేది...అవునా? కాదా?? ఆ అమ్మాయికి అప్పుడు ఏడుసంవత్సరాలుండేవి...ఇదంతా యిప్పటికి తొమ్మిదిసంవత్సరాలక్రితం మాటలే...ఒప్పుకుంటావా? లేదా?" వరుసన ప్రశ్నల వర్షం కురిపించేసింది.

కృష్ణమోహన్ తొందర తొందరగా తన జీవిత పుటలను వెనుకకు త్రిప్పేస్తూ తొమ్మిది సంవత్సరాలక్రితం వ్రాయబడ్డపుటలను చూసుకున్నాడు. అక్షరాలు మాసిపోయాయి. కొన్ని చెరిగిపోయాయి. మాసినవాటిని జాగ్రత్తగా చూస్తూ చెరిగినవాటిని నెమ్మదిగా ఆలోచించి అందు సమన్వయించేలా చూసుకొంటూ-చదువుకుపోయాడు. అంతా ఆమె చెప్పినట్లుండడంతో ఆశ్చర్యపోయి కళ్లప్పగించి చూస్తున్నాడు.

అతని చూపుల కర్థం చేసుకొని "ఆ అమ్మాయి నాస్నేహితురాలు, నా ప్రాణానికి ప్రాణం. ఆమే చెప్పింది నీ గురించి. ఎంతగానో ప్రేమిస్తుండటకూడాను" తన ప్రేమ వృథాం కాలిపోతున్నందుకు బాధపడుతూ కంట తడిపెట్టింది బాణి.

"ఆ...అంటే...నిన్నా......అంటే

నుంచే...భరించలేను"—జేబులు తడుముకొని రుమాలు కానక తన చొక్కా కాలరుతో ఆమె కన్నీరు తుడిచేశాడు. "ఇదిగో యీ కాలరు కంటుకున్న కన్నీటి సాక్షిగా చెబుతున్నాను నీకు తప్ప మరొకరికి నా హృదయంలో స్థానంలేదు...లేదు ముమ్మాటికి...నమ్ము నామాట..."భీకర ప్రతిజ్ఞ చేసి పారేసాడు.

"ఆమె నన్ను చూడలేదు. నే నామెను చూడలేదు కదా, నీతో ఎలా చెప్పింది" ఆశ్చర్యపడుతూ అడిగాడు.

"నా ఆల్బం చూపించాను. అందు నీ ఫొటోలు చూసి నీపేరడిగింది...చెప్పాను నివు తనకు తెలుసునంది. అందుకు తార్కాణం—ఆకళ్ళు...కుడికంటి, క్రింద రెప్పపైనున్న చార—చాలునంది జీవితంలో మర్చిపోకుండా వుండటానికి. నిన్నప్పుడు, యిప్పుడూ ప్రేమిస్తూనే వుందట, ఇకముందుకూడా...నిన్ను చూడాలని వుందని నీదర్శనం ఇప్పించమని కోరినట్లు నీతో చెప్పమంది."

"ఓ...మైగాడ్...చంపావురా!" అరచాడు. "బాణీ నీవు నన్ను పరీక్షిస్తున్నావా? నేను చూడ నామెను. ఆమెకు యీ గుండెలో స్థానంలేదు. నీకంత అనుమానంగా వుంటే నాకళ్ళల్లో కళ్ళుంచి సత్యాన్ని అన్వేషించు...నా హృదయం "బాణీ...బా...ణీ...నారాణీ" అని ఎలా స్పందిస్తుందో చెవియొగ్గి విను." అంటూ లాల్చీ బొత్తాములు విప్పేస్తున్నాడు.

"మోహన నాకు తెలుసు నీ ప్రేమ. అయినా ఆమె నిన్ను చిన్ననాటి నుంచీ ప్రేమిస్తుంది. వాళ్ళు ఆంధ్రులు...పైగా మీవారు. కాబట్టి అన్ని విధాల మీకు తగివుంది. ఆమెను తప్పక వివాహం చేసుకోండి. మీకు దూరమయి వుండటమంటే నాకూ కష్టంగానే వుంటుంది. కాని నా స్నేహితురాలి కొరకు నా ప్రేమను త్యాగం చేసానన్న సంతృప్తి అయినా వుంటుంది'—ఆయాసంగా వూపిరి పీల్చుకుంది బాణి.

ఒకఅబ్బాయి తన తండ్రితో కూడా జంతు ప్రదర్శన శాల లోనికి వెళ్లేడు. బోనులోనున్న సింహామునుచూచి

అబ్బాయి: నాన్నా "ఆ సింహాము నిన్ను మింగితే నేను ఏనంబరు బస్సులో వెళ్ళాలో చెప్పు" అన్నాడు.

జి. కస్తూరి (హైదరాబాదు)

'బాణీ లకు చెప్పు. నేను వినను' కోపంతో అన్నాడు.

"పోనీ ఒకసారి కలుసుకోండి, సాయంకాలం ఆరుగంటలకు 'ధాకురియా లేక్సు' అవతలి తట్టునవున్న పార్కులో సూర్యకాంతినిబట్టి కాల నిర్ణయము చేసే ఘటికా యంత్రం వద్దనున్న బెన్చిపై కూర్చొని మీ రాకకై వేచియుంటానని చెప్పింది. వెళ్ళండి వెళ్ళక తప్పదు" ఇది ఆమె ప్రార్థన ... నా కోరికకూడ" అంటూ అతను చెప్పేది వినదలంచుకొనక చరచరా వెళ్లిపోయింది బాణి.

కళ్లుమూసుకొని నొసటిని చిట్లించి ఘట్టిగా ఆలోచించేస్తున్నాడు కృష్ణమోహన్ "వెళ్లటమా? మానటమా?" అని.

...　　...　　...

నిర్ణీత సమయానికి, నిర్ణీత ప్రదేశంలో బాణి కోరిక మన్నించాలనే ఉద్దేశంలో హాజరయాడు కృష్ణమోహన్. పదహారేండ్ల ఎలప్రాయంపు కన్నెపడుచొకర్తుక ఆకాశంలోని చంద్రరావు ఆగమనాన్ని గమనిస్తూ వెనుక వచ్చి నిల్చున్న కృష్ణమోహన్ ఆగమనాన్ని గమనించలేదు,

కృష్ణమోహన్ ఆమె వెనుక నిలబడి ఆమె ముఖాన్ని చూడ్డానికి ప్రయత్నించకుండా మెడపై నుండి క్రిందకు చూస్తూ ఏమిటో అన్వేషణ చేస్తున్నాడు.

అతగాడు విడచే వేడి నిశ్వాసాలకు వెనుకకు తిరిగి చూసింది ఆయువతి చిరునవ్వుతో.

కృష్ణమోహన్ కొయ్యబారి పోయాడు.

'మోహన్ ఏమిటలా చూస్తున్నావు, నన్ను పోల్చుకోవటంలేదా?' తెలుగులో మృదువుగా అడిగింది.

"యూ. ఫూల్ నీవా బా...ణి" యింకా ఏదో చెడా మడా తిడదామనుకుంటూంటే అతనికా క్రమకలుగ నీయకుండా చేద్దామనే ఉద్దేశ్యంతో మధ్యలోనే అందుకొని "చిన్న సవరణ...బాణికాదు వాణి" అని కిలకిలా నవ్వింది బాణి. కాదు కాదు వాణిగా మారిన బాణి ఉహూ...వాణిగా చెలామణి అయ్యే బాణి...

"నన్నింత కాలం నీవూ మీ నాన్నగారు మోసం చేసారు" ఉక్రోషాన్ని కక్కేస్తున్నాడు.

మిమ్మెవరు మోసపొమ్మన్నారు. మీ ప్రేమ ఎంత ఘట్టిదో తెల్సుకోవటానికి యీ నాటకమాడాను. నాన్నగారిక్కూడా ముందే చెప్పాను ఏమీ బైట పెట్టవద్దని. అందుకే అలా చూస్తున్నారు—తప్పుకదూ ముద్దుగా మృదువుగా అంది.

ఇక అక్కడవుంటే ఆ కొంటెకళ్ళబ్బాయి కొంటెకాడయి కొంటెచేష్టలు చేస్తాడని కొంటెచూపులు కొన్ని విసరి పారిపోయింది.

★

సినిమా

అన్నపూర్ణా పిక్చర్స్ వారి 'వెలుగునీడలు' నిర్మాణం పూర్తి అయింది. సగం పైగా రీరికార్డింగు కూడా అయింది. ఇటీవల పాత మార్కెట్ వద్ద ఔట్‌డోర్ దృశ్యాలు కూడా పూర్తి చేశారు. మధుర విషాద కథాబంధురమై జీవిత వేదాంతం బోధించే కవితమూరుని కమనీయకథను ఈ చిత్రం రూపకల్పన. నాగేశ్వరరావు, జగ్గయ్య, రేలంగి, రంగారావు, సావిత్రి, గిరిజ, రాజసులోచన, సూర్యకాంతం వగైరా నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, మాటలు, పాటలు ఆత్రేయ, శ్రీశ్రీ, కళ కృష్ణారావు, సుబ్బారావు. నిర్మాత – దుక్కిపాటి మధుసూదనరావు.

* * *

నేషనల్ ఆర్ట్ (జయసింహ) థియేటర్ వారి పౌరాణిక చిత్రం 'సీతారామకళ్యాణం' జనవరి 6 వ తేదీ విడుదల అవుతుంది. విచిత్ర ఛాయాగ్రహణంతోను, అద్భుతమైన సెట్టింగులతోను, మధుర సంగీతంతోను ఈ చిత్రం దృశ్యశ్రవ్య కావ్యాలుగా రాణిస్తున్నట్లు తెలిసింది. ఎన్. టి. రామారావు, గుమ్మడి, కాంతారావు, హరనాథ్, కె. వి. యస్. శర్మ, శోభన్‌బాబు, మణి, స్వర్ణ మున్నగు వారు నటీనటులు. సంగీతం గాలి పెంచల(బాల రాజా) నరసింహారావు.

* * *

ప్రగతి ఆర్ట్ పిక్చర్స్ వారు తాతినేని (ఇల్లరికం) ప్రకాశరావు దర్శకత్వంలో నిర్మించిన 'మా బాబు' ఈ నెల 22 వ తేదీ విడుదల కానున్నది. నాగేశ్వరరావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, రమణారెడ్డి, కన్నాంబ, ఎం. ఎన్. రాజం, ఎం. సరోజ, హాసీయురాని ఇందులో పాల్గొన్నారు. నిర్మాత డి. వి. యస్. రాజు.

* * *

రామకృష్ణా ప్రొడక్షన్స్ వారి 'టాక్సీ రాముడు'లో ఎన్. టి. రామారావు, జగ్గయ్య, దేవిక నటిస్తున్నారు. దర్శకుడు సి. యస్. రావు.

* * *

మధూల్కర్ మరాఠీ కథను తెలుగులో నవశక్తి వారు రూపకల్పన చేస్తున్నారు. నాగేశ్వరరావు, కృష్ణకుమారి, మాలతి, గుమ్మడి, లంకసత్యం, రమణారెడ్డి, సురభి బాలసరస్వతి నటిస్తున్నారు. దర్శకుడు— జి. రామినీడు. సంగీతం అశ్వత్థామ. రచన గోపీచంద్.

* * *

విక్రమ్ ప్రొడక్షన్స్ వారి సాంఘికం 'పెళ్లి తాంబూలం'లో రమణమూర్తి, జమున నటిస్తున్నారు. సంగీతం విశ్వనాథన్ రామమూర్తి. దర్శకుడు బి. యస్. రంగా.

భరణీవారి 'బాటసారి'లో భానుమతి.



స రి గ మ లు

చిత్రనటీయం

'నేను హీరోగా ఈ రంగంలోకి ప్రవేశించాను. హీరోగానే, ప్రవర్తించాను. రేపు రంగంలోంచి హీరోగానే నిష్క్రమిస్తాను.'

ప్రసిద్ధ తెలుగుచిత్రనటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు హీరోచితంగా అన్నమాటలివి.

'మొదటినుంచీ హీరో పాత్రలో, పోషణాలలో మునిగిపోయింది నా జీవితం. అది విడచి మరోపాత్ర ధరించినా దానికి పూర్తి న్యాయం చేయలేకపోవచ్చు. అయినా హీరోగా పదిహేనేళ్ళపాటు చెలామణీ అయిన వ్యక్తి ఇతర పాత్రధరిస్తే ప్రేక్షకులకు కూడా అసంతృప్తి కలుగుతుంది. హీరో పని దినదినంగా తయారవుతుంది'

'సినీనటుడి జీవితం చిత్రవిచిత్రమైనది. నవరసాలు అతనికి అందుబాటులో ఉంటాయి. ఏదికావాలంటే అది పలికించుకునే నేర్పు అతనికి ఉండాలి. అప్పుడే అతను రాణిస్తాడు. ఇక గృహజీవితంలో నటుడూ దాదాపు దీపపాత్రధారి. పొద్దస్తమానం ఈ నవరసాలతో స్టూడియోద్యానాలలో ఆడుకుని– అలసిసొలసి నిజప్రపంచానికి భూతలస్వర్గమైన ఇంటికిరాగానే అన్నం తినాలనిగాని, తినే ఓపికగాని ఉండదు. 'నాన్నా' అంటూ పిల్లలు పలకరించినా వాళ్ళ చిన్న బుచ్చుకుంటూ లేమొహనీ యాంత్రికంగా ఒక నవ్వు నటించి ఆవహిస్తున్న నిద్రాదేవి– ఒడిలో వాలిపోవడమే గాని కాస్సేపయినా వాళ్ళను లాలించి బుజ్జగించే ఓపికలు ఉండవు. ఇవీ సినీజీవుల చిత్రజీవితాలు' అని కూడా నాగేశ్వరరావు అన్నారు.

రేలంగిర్వాణం

'నేను ఎన్ని కష్టాలుపడ్డానో, ఎన్నెన్ని దుర్దశలనుభవించానో మీ కెవరికయినా తెల్సా'. అని క్షణం ఆగి 'ప్చ్ ప్చ్ మీకెలా తెలుస్తుంది. ఆరోజుల్లో నిజమైన ప్రతిభకు కూడా నీళ్ళు పుట్టని కటకటలో నేను పడ్డ అవస్థలు అబ్బ!– ఒకటే రెండూ కాగునే నేం అదృష్టం లాగిపెట్టితంతే అభిమానపాత్రలో పడ్డవాణ్ని కాదు. వెలుగునీడలు అనేకం అనుభవించి ఈనాటికీ కొత్తవెలుగు చూస్తూ, అ చూస్తున్నది కూడా నిజమనీ శాశ్వతమనీ విశ్రమించకుండా అసలు వెలుగు కోసం అన్వేషిస్తూ ఆయాసపడుతున్నాను. పాతకాలం వాళ్లే– మీకు నవ్వుకు ఈమాటలు.' అన్నారు కొంచెం బిట్టుగా రేలంగి వెంకట్రామయ్య.

'నేను మొదట తెలుగు తెరకు వచ్చినప్పుడు ఒక ప్రసిద్ధ దర్శకనిర్మాత 'వీడు సినిమాలకు అసలు పనికిరాడు' అని నన్ను ఇంటి మొహం పట్టించాడు. మంచం పట్టించాడు. ఆమహానుభావుడే ఈ మధ్య 'నీ ప్రతిభకు ఆనందిస్తున్నాను' అన్నాడు. అంతా చిత్రమే చిత్రలోకంలో'

ఇటీవల ఆంధ్రప్రభుత్వం పెద్దలు కళాసిద్ధులు అయిన ప్రముఖులను శ్రీ నాగయ్య, గండికోట జోగినాధం వంటి వారిని సత్కరించడం గర్వకారణమన్నారు రేలంగి. వ్యక్తుల నాశ్రయించి కొన్ని కళావిశేషాలుంటాయని, వారినుంచి వాటి సారసత్వం పిన్నలు స్వీకరించాలని, అటువంటి వారిని గౌరవించడం జాతి కళాచైతన్యానికి గుర్తు అని కూడా హాస్యనటచక్రవర్తి అన్నారు.

నిర్మాతృ హృదయం

మాతృ హృదయంవంటిదే దాదాపు నిర్మాతృహృదయం. మాతకు కన్నబిడ్డలాగానే నిర్మాతకు తనచిత్రమూ ప్రాణప్రదం. కన్నబిడ్డను కంటి పాపలా పెంచి పెద్దచేసి కన్నె తనపు వన్నె చిన్నెలు కలసిరాగానే శుభముహూర్తాన పెళ్ళిచేసి అత్తవారింటికి పంపినట్లు కంటికి రెప్పగా కనిపెట్టి, సహజసుందరంగా తయారుచేసి నిర్మాత తన చిత్రం కూడా సకాలంలో అశేషజనంలోకి పంపుతాడు. అత్తవారింట అమ్మాయి గుణవంతురాలనిపించుకుంటే తల్లి ఉప్పొంగిపోతుంది. జనం తన చిత్రాన్ని ఆదరించి గౌరవిస్తే నిర్మాతృహృదయం పులకాంకితమవుతుం–. ఈ సత్యానికి నిదర్శనం అన్నపూర్ణా అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు.

'అనుకున్నది అనుకున్నట్లు కార్యక్రమం సాగిపోకపోతే నాకు మతి పోతుంది. మొన్న సాతనూర్ డాం దగ్గర ఔట్‌డోర్‌కి వెళ్ళింది మా బృందం. రెండు పాటల రికార్డింగ్‌కు నాగేశ్వరరావు, సావిత్రి, యితర సాంకేతిక నిపుణులు వెళ్ళారు. అది రెండు రోజుల కార్యక్రమం. వాళ్ళు వెళ్ళగానే కారుమబ్బులుపట్టి బ్రహ్మాండంగా వాన. నేను ఇక్కడ (మద్రాసు) లో ఉన్నాను. వాళ్లు సురక్షితంగా కార్యక్రమం పూర్తి చేసుకుని సకాలంలో వచ్చేవరకు నాకు కలిగిన బాధ యింతా అంతా కాదు.' అన్నారు మధుసూదనరావు.

'ఆచి ఆచి అడుగువేస్తే ఆపదలు రావు. ఆ నిదానమూ, నిబ్బరమూ నేడు ఎంతయినా అవసరం' అన్నారు ఆయన. ★



ఎన్.ఎ.టి. వారి 'సీతారామకళ్యాణం'లో బి. సరోజాదేవి.

సితారాపథంలో...

తరతరంపరగా పరంపరగా కుంపరగా మహాజనం! వచ్చేవారూ పోయేవారూ, వచ్చిపోయేవారూ, పోయివచ్చేవారూ రాకపోకలేనివారూ నిలబడ్డవారూ, కూర్చున్నవారూ రకరకాల వారంతా మూగివున్నారు.

తీరా దగ్గరకు వెళ్లి చూస్తే అది ఒక న్యాయస్థానం. జనం కిటకిటలాడుతున్నారు. ఒక న్యాయవాది ఎవరో తన ఆర్గ్యుమెంటు టకటక లాడిస్తున్నాడు. కోర్టులో బోనులో నిలబడి ఒక వయసు సాగనుగాడయిన యువకుడు మనిషిలా బొమ్మగా మొహం చిన్నబుచ్చుకుంటున్నాడు. మరో ప్రక్క బెంచీలో ఆడవారు కొందరు ఆదుర్దాతో చూస్తూ కూర్చున్నారు. న్యాయవాదుల బెంచీలో ఒక వృద్ధ న్యాయవాది నిర్వేదంతో మొహం పెట్టుకుని, ఆ మొహంలో ఒక పెద్ద (తెలుగు సినిమా) కథ దాచిపెట్టుకుని కూర్చుని వింటున్నాడు.

కోర్టు హాలంతా చల్లారిన టిబ్బరో టులా 'డల్'గా నిశ్శబ్దంగా ఉంది. ఆ ఒక్క న్యాయవాది సన్నగా ఎదురుగా ఉన్న పోలీసు అధికారిని ప్రశ్నిస్తున్నాడు.

'మీకు ఫోన్ చేసింది ఎవరు?'

'నాకు తెలియదు.'

'పోనీ ఆడగొంతో మగగొంతో గుర్తుపట్టగలరా?'

'మగ గొంతు.'

'వినపడింది మగగొంతు. అక్కడికి వెళ్లి చూస్తే ఉన్నది ఆడమనిషి—అంతేగా?'

'అవును.'

'దట్సాల్ యువర్ ఆనర్' అంటూ చరచరా నడిచి వచ్చేశాడు ఆ న్యాయవాది.


వస్తూనే 'ఏమండీ ఎలా వుంది మన వాదన' అన్నాడు ఆ న్యాయవాది. తీరా చూస్తే ఆయన రేలంగి వెంకట్రామయ్య! నమ్మలేనంత జబర్దస్తీగా ఆ కోర్టుసెట్టు నిర్మించారు. ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి రెండవ చిత్రం (పెళ్లి మనసు) లోనిది ఆ దృశ్యం. బోనులో యువకుడుగా నాగేశ్వరరావు, వృద్ధన్యాయవాదిగా గుమ్మడి, లీడర్ ముసాస్త్రాగా రమణారెడ్డి నటిస్తున్నారు. కృష్ణకుమారి, సంధ్య మొదలగువారు బెంచీలలో ఉన్నారు. ప్రత్యగాత్మ దర్శకత్వం, సాలూరి రాజేశ్వరరావు సంగీత దర్శకత్వం వహిస్తున్న ఈ నవపంథా సాంఘిక చిత్రం 18 రీళ్లు తయారయింది. తమ్ముడి (నాగేశ్వరరావు) మీద వచ్చిన హత్యాభియోగంలో అన్నగారు (రేలంగి) డిఫెన్సువాదం మొన్న డిసెంబరు 16న. చిత్రీకరించారు. ప్రస్తుతం కొయ్యూరు దృశ్యాల చిత్రీకరణ విజయాలో జరుగుతున్నది.

* * *

అక్కడో మారుమూల సౌధం. చుట్టుపట్ల ప్రశాంత వాతావరణం. సౌధాంతర్భాగం లోంచి విద్యుద్దీపాల కాలవెలుగుల ప్రసారం. మధ్య నిశీథ సమయం, నీరవం ఆ ప్రాంతం!

బిలబిలమంటూ చల్లగాలులు వీస్తున్నాయి. కిక్కు కిక్కుమంటూ కటిక చీకట్లు అలుముకుంటున్న ఆ అర్ధరాత్రివేళ ఆ సౌధంలోకి చూస్తే ఏదో ఒక వికటాట్టహాసం పెటిల్లుమని పిడుగులా కాండావుడిగా వినిపించింది. పటిల్లుమని పటిల్లపటిలా ఓ లతాంగి చంగున ఓ గదిలోంచి మరో గదిలోకి దూసుకుపోయింది.

ఇదేమిటి? ఈ మూల సౌధం ఎవరిది? అల వైకుంఠపురంబులో నగరిలో...ఆ మూల సౌధం అన్నారు. ఆ పోతన కాదు గదా అయితే అగరు ధూపాలూ, పారిజాత వ



అన్నపూర్ణవారి 'వెలుగునీడలు'లో రేలంగి, సావిత్రి.

కిటుకూలా, మురళీగానమంజులరవములా, రమ్యనటన్నర్తకి పాద మంజీరాలఘలం ఘలలు—లేనే లేవు!

ఇలా ఆలోచిస్తుండగానే ఆ సౌధవాతావరణం చూడాయగా వ్యాఖ్యానించే ఓ పిల్లగాలి లేచి మదిరాగంధం పోకపోయింది. మత్తుగా నిద్రపోయి పస్తాయిస్తూ మరి రెండు అడుగులు వేసి కిటికీలోంచి చూసేసరికి—

పానమత్తుడై సోఫాలో ఒకడు వాలి వారిపడి వున్నాడు. ఖాళీచేసి పెట్టిన పానపాత్ర ఒకటి సగర్వంగా విద్యుత్ కాంతిలో మెరిసి పోతోంది.

ఇంతలో మళ్ళీ వికటాట్టహాసం ఒకటి వినిపించి జోగిందర్ అనే వాడి వేడి రూపంలో కనిపించి పక్క సోఫాలో కూర్చుంది. ఆ జోగిందర్ అసలు నాటక సూత్రధారి. పానపాత్రధారి. కప్పునిండా అమృతం పోసుకుని గుక్కలో తాగేశాడు. మెల్లమెల్లగా ఓ మెరుపుతీగ వచ్చి పానమత్తుడు వళ్లు మరచిన సోఫా చేతిమీద అలాగా కూర్చుంది. రఘూ అని పిలిచింది. బరువుగా కనురెప్పలు విప్పి కోప వికాసంతో కళ్ళు మూసుకున్నాడా యువకుడు. జోగిందర్ మళ్ళీ మరో కప్పు కడుపు నింపి ఫలితం రాకు యిమ్మన్నట్టు కనుసైగ చేసి ఆ పిల్లకి అందించాడు. ఆమె ముచ్చటంగా గయ్యారంగా త్రాగించింది. బాటిల్ కాన్నట్టు మరి కొత్త ఆ యువకుడికి ఇచ్చింది.

మద్య నిషేధ శాసనానికి వద్యస్థలి అని తగిన ఆ భవనం పేరు ఆదర్శవిజ్ఞానమందిరి! అక్కడ ఆదర్శం వ్యభిచారం, విజ్ఞానం తాగుడు. మందిరి నిండా కాంతకులు.

శ్రీరామా పిక్చర్స్ నిర్మిస్తున్న వ్యంగ్య ప్రధాన దృశ్య కావ్యం 'దేశద్రోహులు' చిత్రానికి చెందిన అదృశ్యంలో దేశద్రోహుల నిజస్వరూపాలకు రూపకల్పన చేసే పై ఘట్టం దర్శకుడు బోళ్ల సుబ్బారావు నిదానంగా నిపుణతతో చిత్రీకరిస్తున్నారు. జోగిందర్ గా రాజనాల, రఘుగా కాంతారావు ఆ పట్టున కోనపట్టుగా నటించారు. ఎన్. టి. రామారావు, దేవిక ప్రధాన భూమికలు ధరించే ఈ చిత్రానికి సంగీతరాజేశ్వరరావు సంగీత దర్శకుడు. ★



ఎన్. ఎ. టి. వారి 'సీతారామకళ్యాణం'లో రామారావణీయం.

వార్తాభరణం

రాజు (నిత్యకల్యాణం పచ్చతోరణం) పిక్చర్స్ వారు ద్వితీయకానుక సమర్పించే సన్నాహంలోకి దిగారు. 'సతీ సునీతి' లేక 'భక్త ధ్రువ' అనే ఇతివృత్తం తీసుకుని పేపర్ వర్క్ పూర్తిచేశారు. వచ్చే జనవరి చివరి వారంలో చిత్రనిర్మాణం ప్రారంభించనున్నట్లు తెలిసింది. రచయిత, దర్శకుడు పినిశెట్టి.

హైదరాబాద్ మూవీస్ (జలాన్ని రాయుడు) ద్వితీయకానుకగా పినిశెట్టి రచన 'మనుతోను' చిత్రీకరిస్తారని తెలిసింది.

* * *


రఘురాం ఫిలిమ్స్ పేరిట కె. హేమాంబరధరరావు 'గురుదక్షిణ' అనే సాంఘిక చిత్రం నిర్మిస్తున్నారు. దర్శకుడు ఆయనే. రచన ప్రత్యగాత్మ. ఇది ఒక బడిపంతులు కథ. ఈ పాత్ర గుమ్మడి ధరిస్తారు. చలం, కృష్ణకుమారి ముఖ్య పాత్రలు వహిస్తున్నారు. సంగీతం టి. చలపతిరావు. ఛాయ నాగేశ్వరరావు. డిసెంబరు చివరివారంలో సెట్స్ కు వెళ్లాలని సంకల్పం. ★

ASP/LIC-60

చేదోడు

మీ భర్త కుటుంబానికి జీవగర్ర. రోజంతా శ్రమించి అలసటతో తిరిగి వస్తారు. ఆప్యాయంగా అనురాగంతో ఆదరించి అతణ్ణి ఉత్సాహపరుస్తారు మీరు.

అయినా అతడికి ఏదో బాధగానే వుంటుంది. కుటుంబ భవిష్యత్తును గురించి ఏదో మథనపడుతూనే వుంటాడు. ఈ విషయంలో అతడికి మీరు చేదోడుగా వుండవచ్చు. జీవిత బీమా పట్టా నొకదానిని తీసికొమ్మని అతణ్ణి ప్రోత్సహించండి. ప్రతి నెల కొద్ది మొత్తం అదా చేసేలాగ అతడికి మీరు తోడ్పడ గలరు. ఇందువల్ల సమయం వచ్చేసరికి కుమారుని చదువుకు గాని, కుమార్తె వివాహమునకుగాని లేదా మీ వృద్ధాప్య అవసరములకు డబ్బు చేతికి వస్తుంది. అదే అతడి బాధల్ని నివారించి, ముఖంలో చిరునవ్వు చిందిస్తుంది. అలా చేస్తారుగా!



జీవిత భీమాకు ప్రతిగా మరొకటి లేదు



ప్రగతిఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి 'మా బాబు'లో ప్రప్రథమంగా నృత్యం చేసిన ఈజిప్షన్ నర్తకి లైలా.

సినీ పక్షపత్రిక 'చిత్రప్రభ' జననం

"చిత్రలోక పత్రికలు సద్విమర్శను అలవరచుకోవాలి. ఏ పరిశ్రమకు అనుబంధాలుగా అవి వర్ధిల్లవలసివుంటాయో ఆ పరిశ్రమ బాగుకోరి, చెడును నిరసించి మంచిని పెంచి నిర్మాణాత్మకమైన సూచనలద్వారా చిత్రకళ ప్రగతికి తోడ్పడాలి. చిత్రపరిశ్రమకు ఈ గడురోజులలో అలాంటి చేయూత ఎంతో అవసరం" అంటూ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు నూతన సినీ పక్షపత్రిక 'చిత్రప్రభ'కు డిసెంబరు 16 వ తేదీ సాయంకాలం మైలాపూర్ న్యూ ఉడ్‌లాండ్స్‌లో ప్రారంభోత్సవం చేశారు.

సభకు అఖిలభారత చలనచిత్ర సమాఖ్య అధ్యక్షులు విజయాధిపతి శ్రీ బొమ్మిరెడ్డి నాగిరెడ్డి అధ్యక్షత వహించారు.

ఇండోర్ లో ఇటీవల అసభ్యకరమైన సినిమా పోస్టర్లపై రేగిన దుమారం అంతటితో సమసిపోయేది కాదనీ, పరిశ్రమకు అది గొడ్డలిపెట్టుగా పరిణమించినా ఆశ్చర్యంలేదని శ్రీ నాగిరెడ్డి అన్నారు. "సాధువులు, సర్వోదయ పథగాములు అయినవారు కానివాని రంగాల అంతరంగిక విషయాలలో తల దూర్చడం న్యాయంకాదు. చలనచిత్రాలు సర్వోదయంకోసమే ఆదినుంచి కృషి చేస్తున్నాయి. తద్వారా అజ్ఞానతిమిరం పోయి, సర్వోదయమైన విజ్ఞాన దీప్తి కలిగించే గాని, అసభ్యకరమైన పనులేవీ జరగలేదు" అన్నారు శ్రీ నాగిరెడ్డి.

శ్రీ వేమూరి గాగయ్య, కొడవటిగంటి కుటుంబరావు, ఇంటూరి వెంకటేశ్వరరావు, పేకేటి, ముక్కామల తదితరులు మాట్లాడారు. ఆహూతులందరూ చిత్రప్రభ నిర్వాహకుడు శ్రీ కె. సుబ్బయ్య, సంపాదకుడు జ్యోతిశ్రీలకు తమ అభినందనలు తెలిపారు. ★

రాగి-విరాగి!

"ఒకప్పుడు సర్వసంగ పరిత్యాగి అయిన యోగి ఒకడు మోక్షకామి అయి తపస్సు చేసుకునేవాడు. సరిగా ఆయన ఆశ్రమం ఎదురుగా ఒక నాట్యకత్తె నివాసం ఉండేది. ఈ మోక్షకామి నిరంతరమూ ఆ నాట్యకత్తె లాసవిలాసాలు దర్శిస్తూ ఎవరు, ఎందరు వచ్చిపోతున్నదీ తిలకించేవాడు. చివరకు ఒకనాడు ఆ నాట్యకత్తెతో "అమ్మాయీ! నీవు నీచమూ అసభ్యమూ అయిన వృత్తి అవలంబిస్తున్నావు. నీవు నరకానికి పోతావు" అని చెప్పాడు. ఆమె చాలా విచారించింది. వ్యర్థ జీవితానికి క్రుంగి కృశించి, ఆమె ఒక రోజు కన్ను మూసింది. దైవికంగా అదే రోజున స్వాములవారు కూడా సిద్ధిపొందారు.

యమదూతలు స్వామిని, దేవదూతలు నటీమణిని తీసుకుని వారివారి లోకాలకు బయలుదేరారు. దారి మధ్యలో స్వామివారు కన్ను తెరచి చూశాగా 'ఇదేమిటి మీరు నన్ను పట్టుకున్నారు. నేను సర్వసంగపరిత్యాగినయిన పవిత్రుడను, స్వర్గలోకానికి పోవలసినవాడను విడవండి' అని మొత్తుకున్నారు.

కాని యమదూతలు విడవలేదు. ఒక నర్తకి స్వధర్మం పతితమని చెప్పి ఆమె మరణానికి నీవు కారకుడవైనావు, నీకు నరకమే ప్రాప్తి. ఆమె స్వర్లోకగత అన్నారు వారు.

సర్వోదయ నాయకులు చలనచిత్రకళపై కళ్లు కుట్టి పెట్టుకుని చేస్తున్న ప్రచారం చూస్తుంటే తనకు పై కథ జ్ఞాపకం వస్తున్నది అన్నారు అఖిల భారత చలనచిత్ర సమాఖ్య అధ్యక్షులు శ్రీ బి. నాగిరెడ్డి ★

ఆంధ్రసచిత్ర వారపత్రిక

గళ్ళనుడికట్టు-33

ఆధారాలు

అడ్డము

1. సీతల్లె జరగవలసిన వసంతా నీ చేతిలోనే వుంది.
3. నా త్రిక రాటికాయ వరేముందు సక్క చేసే పని.
5. జోడు కూడ మెత్తటుగా వుండడానికి కావలసిన వయసు.
6. పాములా సాధించే శత్రువు.
8. జాగ్రత్త. ఇది వస్తే ఎదటివాడు మీ మీద ల్లెక్కేస్తాడు.
10. కాస్త చెయ్యి అందించి సాయం చేయండి.

యుమ కరస్తు. నా లగ్న మదేస్తుంది.

భూమిలో దొరికే మూడినదము—వ్యాకరణంలో 'ఏడు' సరదు.

ఈ ఊరి రాడీ ఆడిన నాటకాలకి అంతు లేదు.

ఆ పాటకే చేరి ఏమిట్రా ఆ గానసభ!

యూటి మాట.

లేదుగాని అయితే ఉపకారం చేసే దేదు కనిపించేవాడు.

కాయాకం కాపుకొంది.

తగాని సత్తి.


సందుచీసా పడి పగిలిపోయి పాత్ర లన్నీ పిల్లాడిదగ్గర పోయాయి.

కోయారగ పతులుపుట్ట చెప్పిన నీతులు పజుతి కథకాలో ఇంతగా వున్నాయి.

26. ప్రియుడికోసం ఎదురుచూసే జవరాలి కాలమానంలో ఇది ఒక భాగం.
28. మన దేశంలో పదేళ్లుగా అమలు జరుగుతున్న పథకం.
30. ఇంటిని కప్పేది.
31. అట్నుంచొస్తే తిప్పడం.
32. ఇంద్రధనుసులో ఇలాటివే వుంటాయి.

నిలువు

2. జాలరిచే పట్టబడేది.
3. 8.
4. తల్లక్రిందులో చూసే మాటపుకే ఆగు.
5. ఇదో-ఛిన్నవారికి లో లేమిటి.
7. గదిలోకంటే బురోటే వుంది.
9. కితలింగము ధరించువాడు.
10. కొలరకాయ రుచి!
11. మనువు కథ; పెద్దనగారి కావ్యం.
12. పలువిధాలు.
14. ఏమీ లేదు.
18. తిర గేసుందయ్యా మేము. అలా కొడితే ఎలా విరుగుతుందని?
19. బహు దొడ్డమాట.
21. కథల కట్ట—చివర ముడతపడి ఉంది చూడండి.
22. మేళం రక్తి కట్టడానికివి లయబద్ధంగా పడాలి.
26. మంచట్లో వుంటేది.
27. అనురాగ ముద్ర.
28. ప్రతి తిక్క శంకరయ్యాకి, యారి అక్క గానే ఎదురవేది.
29. కంకరం చెయ్యి చూడండి కొంచెం.



ఒక పాతికకొడుకు తన మిత్రులతో తన అనుభవాన్ని చెప్తున్నాడు.


"ఒకసారి మేము నాటకము వేస్తుంటే ప్రేక్షకులు అరవదము మొదలు పెట్టేరు.


ఒక మిత్రుడు మధ్యలో "అప్పుడు మీరు కొడతారని భయము వేయలేదా?" అన్నాడు.

"లేదు. ఎందుకంటే వాళ్లు పదిమంది, మేము పాతికపైగా వున్నాము" అన్నాడు.

జి. రామమోహన్ (హైదరాబాదు)

వ గళ్లనుడికట్టుకు జవాబులు





చిత్రకారుడు: ఎం. ఏ. గణేశన్ (తి...)

ఫిర్యాదు

టైపు రైటర్లు అమ్మే ఒక కంపెనీకి ఇలా జాబు వచ్చింది.

"ణరుణా టైప్ రైటరు డీలర్సు వారికి—

ణయ్యా,

మీరు నాకు సప్లయి చేసిన టైపుమిషనులో "ణ, ఆ, ఇ, ఈ"లలో మొదటి ణక్షరమైన 'ణ' లేదు. దానికి బదులుగ వేరొక ణక్షరం 'ణ' వున్నది. ణందుచేత ముద్రాసే వుత్తరాలు ఎవరికీ ణర్థముకాక ఎలా ణఘోరిస్తున్నామో మీకు తెలియుటకై ఈజాబు ణదేమిషన్ మీద ణచ్చు చేసి పంపుతున్నాను. వెంటనే మీరు ఈ మిషన్ తీసుకొని నాకు ణన్ని ణక్షరాలు (ణతోసహా) సరిగా వుండే వేరొక మిషను తక్షణమే పంపండి.

ణవధానం ణప్పలాచారి
ణన్నవరం.

భట్టారం రాధాకృష్ణమూర్తి
(కొత్తూరు నెల్లూరుజిల్లా)

* * *

పగటివెన్నెల

భార్య: అబ్బ! అప్పుడే నిద్ర? లేవండి...అలా చూడండి...ఆ పున్నమిచంద్రుడు ఎలా నిగనిగలాడుతున్నాడో? పగలల్లా ఆఫీసులో అలసి అర్థాయుస్సుతో ఇంటికి చేరుకున్న భర్త: అబ్బబ్బ! రేపొద్దున చూడొచ్చు లేవే—పడుకో...నిద్రొస్తోంది.

ఎం. ఆర్. విఠల్ రావు (బొలారం)

[illegible] లు

అతిశయోక్తి

విదేశాలకువెళ్ళి తిరిగివచ్చిన దంపతుల గౌరవార్థము ఒకసభ నేర్పాటుచేశారా ఊరివారు. భర్తకు అతిశయోక్తులు చెప్ప డం అలవాటు. అందుకే ఆవిడ ముందేచెప్పింది, "ఏమండోయ్ మీరు మరీ ఘోరంగా కోసేయ్ కండీ; విదేశాలగురించి తెలిసిన పెద్దమనుష్యులు మిమ్మల్ని మూర్ఖులనుకో గలరూ" అని. "ఆఁ, ఫరవా లేదు. నీవు నా ప్రక్కనే వుంటావుగా, ఒకవేళ అతిగావున్నట్టుతోస్తే నాకాలు త్రొక్కు—సర్దుకొంటాను" అన్నాడా పెద్దమనిషి.

తీరా సభ మొదలుపెట్టిన తర్వాత ఇంగ్లాండ్ విషయం చెపుతూ "దాన్ని గురించి ఎం చెప్పాలో! నాకు మాటలు దొరకడంలేదు. అక్కడ మేము పార్లమెంటు భవనాని చూశాము. దాని పొడవు మైళ్ళు, వెడల్పు 6 మైళ్ళు..." అని ఇంకా చెప్పబోయాడు. భార్య అతనికాలు త్రొక్కింది. ఆ ఆసామి అప్పటికి తెప్పరిల్లి "ఆఁ, ఆఁ, అన్నట్టు దానిపొడవు 6 అంగుళాలు" అనిచెప్పి కూర్చున్నాడు.

రాజుద్దీన్ బాబా (...)

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd., by S. Radha Krishna at TheAndhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad


ఘనతలోనే అగ్రస్థానం
నూర్జహాన్ పరిమళ ద్రవ్యములనే
వాడి ఆనందించండి!!
నూర్జహాన్ టాల్కంపౌడరు....1·8·0
నూర్జహాన్ బ్రిల్‌యన్‌టైన్....1·4·0
నూర్జహాన్ హెయిరాయిల్..2·0·0
నూర్జహాన్ చిన్నహెయిరాయిల్..1·8·0
నూర్జహాన్ స్పెషల్ సెంటు.....2·0·0
నూర్జహాన్ 1 నెం. సెంటు......1·8·0
నూర్జహాన్ కష్ సెంటు.....1·8·0
నూర్జహాన్ గులాబిసెంటు..1·8·0
నూర్జహాన్ పాపులర్ సెంటు..1·4·0
నూర్జహాన్ దవనం సెంటు...1·0·0
నూర్జహాన్ లక్కీ సెంటు..1·0·0
నూర్జహాన్ మొగలి సెంటు..2·0·0
పరిమళద్రవ్యముల ప్రత్యేక నిపుణులు
దేవరపల్లి సత్యన్నారాయణరావు & కో,
పిఠాపురం..........(ఆంధ్రప్రదేశ్).
Ram Singh